


తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త




epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

24-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 174 పేజీలు: 8+4 వెల: 6.50







గురువారం సిఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఎంఒయు దృశ్యం

# క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్

>> విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలతో పాటు ప్రభుత్వ ఏజెన్సీలను కూడా ఒకే వేదికపైకి తెచ్చేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ పని చేయనుంది. క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు అవసరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించేలా ఈ హబ్ పని చేయనుంది..

**డిజిటల్ లిటరసీపై ప్రత్యేక కార్యాచరణ..**

అమరావతిని క్వాంటం సహా డీప్ టెక్నాలజీలకు కేంద్రంగా మార్చాలని సంకల్పించామని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏక్యూవీలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ క్వాంటం ఏఐ ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయటం మరో కీలకమైన మైలు రాయి అవుతుందని సీఎం అన్నారు. బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించే వినియోగదారులతో పాటు ప్రజలకు డిజిటల్ లిటరసీ పెంచే దిశగా కృషి చేయాలని ముఖ్యమంత్రి పీఎన్ బీ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ దిశగా ప్రభుత్వాలు బ్యాంకులు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయటంలో టెక్నాలజీ మరింత విస్తృతమవ్వాలని సీఎం సూచించారు. క్వాంటం టెక్నాలజీ ద్వారా డిజిటల్ లావాదేవీలకు భద్రతను అత్యుత్తమ స్థాయిలో అందించాలని సీఎం స్పష్టం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ ను మరింత పటిష్టంగా, సులభతరంగా సేవలు అందించేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్‌ను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు పంజాబ్ నేషనల్ బ్యాంక్ సిఇఒ ఎండీ అశోక్ చంద్ర ముఖ్యమంత్రికి వివరించారు.

# పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

>> పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది. నీట్‌తో పాటు యుపిఎస్‌సి, ఎస్ఎస్‌సి, ఆర్ఆర్‌బి, ఐబిపిఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.

# రూ.29.30లక్షల కోట్ల పెట్టుబడులు

>> కోవడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమే ప్రధాన కారణం. దీనిని ప్రతి అధికారి చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. నవంబర్‌లో విశాఖపట్నంలో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్ లో మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధనం అవసరం, రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని కోరారు. నిర్ణీత సమయంలో గ్రౌండ్ చేసిన ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందించేలా ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. గత రెండేళ్లలో 1,20,897 ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. యువతకు ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించే ఎంఎస్ఎంఇ యూనిట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**రంపచోడవరంలో మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం**

పోలవరం జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు రంపచోడవరం ఘన స్వాగతం లభించింది.ఐ పోలవరం జంక్షన్ వద్ద పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, మఠం విజయభాస్కర్ లోకేష్కు జ్ఞాపిక అందజేసి ఘనస్వాగతం పలికారు. రాత్రి 10.30 గంటలు దాటినా లోకేష్ కోసం కార్యకర్తలు వేచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మంత్రిని కలిసేందుకు వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు తమ సమస్యలను వివరిస్తూ అర్జీలు సమర్పించారు. వారి నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి, సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ పర్యటనకు సంబంధించి పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మంత్రి పర్యటన సందర్భంగా పోలవరం జంక్షన్ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మంత్రికి స్వాగతం పలికారు.



నవీ ముంబయిలో ఘోడ్‌బందర్ పాటలీపాడ వంతెన మీద అదుపు తప్పి బోల్తా పడిన ట్రక్కును క్రేన్‌తో తరలిస్తున్న దృశ్యం

# 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

>> ఇందుకోసం బడ్జెట్ లో రూ.250 కోట్లు కేటాయించామని, ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నామన్నారు. రాష్ట్రం చేనేత రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని ఈ నెల 26న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా కూటమి ప్రభుత్వం మరో శుభవార్త చెప్పిందన్నారు. నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఈ మేరకు కేబినెట్‌లో ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. చేనేతలకు ఆర్థిక దన్ను కలిగించేలా నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుట్టిన సిఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

**నేతన్న కుటుంబానికి భారీ ఆర్థిక లబ్ధి**

50యేళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. 51,952 మంది నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, యేడాదికి రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు నెలకు రూ.1800 చొప్పున యేడాదికి రూ. 21,600లు లబ్ధి కలుగుతోందన్నారు. మగ్గం నేతన్నలకు నేతన్న సేవలో రూ.25 వేలు, పెన్షన్ రూ.4 వేల చొప్పున రూ.48 వేలు, ఉచిత్ విద్యుత్‌తో రూ.8,640లు మొత్తం ఏడాదికి రూ. 81,640లు ప్రత్యక్ష ఆర్థిక లబ్ధి కలుగుతుందన్నారు. మర మగ్గం నేతన్నలకు నేతన్న సేవలో పథకం కింద రూ.25 వేలు, పెన్షన్ రూపంలో రూ.48 వేలు, ఉచిత విద్యుత్ కింద రూ.21,600లు కలిపి మొత్తం రూ.94,000 లబ్ది కలుగుతోందన్నారు.

కూటమి ప్రభుత్వం రాగానే నూతన టెక్స్‌టైల్స్ పాలసీ తీసుకొచ్చామని మంత్రి సవిత గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టెక్స్‌టైల్స్ పార్కులు, క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేతన్నలకు గౌరవప్రద జీవనమే సిఎం చంద్రబాబు లక్ష ్యమన్నారు. యేటా త్రిఫ్ట్ ఫండ్ కింద రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నామని, నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామని తెలిపారు. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని, ఆప్కో చరిత్రలో మొట్టమొదటిసారిగా టిటిడితో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. చంద్రబాబు పాలన నేతన్నలకు ఎప్పుడూ స్వర్ణయుగమేనని మంత్రి సవిత కొనియాడారు.

# మాఫియా మూలాలను తుడిచేయండి

>> నాడు రాష్ట్రాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఎర్రచందనాన్ని గుర్తించి, ఆయా రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గతప్రభుత్వ హయాంలో ఇటువంటి అంతర్రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించ లేదని పేర్కొన్నారు. అలాగే, ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో గతంలో కన్విక్షన్ రేటు 3 శాతం కంటే తక్కువగా ఉండేదని, 95 శాతం కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలువిధించే స్థాయికి కన్విక్షన్ రేటు పెరిగిందని వివరించారు. గతంలో స్మగ్లర్లపై పిడి చట్టం అమలు చేయని పరిస్థితి ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 12 మంది స్మగ్లర్లపై పిడి చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**సమన్వయం తక్షణ అవసరం**

ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేకించిన అటవీ సంపద... ఎర్రచందనం. కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఎర్ర చందనం స్మగ్లింగ్‌పై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం అవలంబిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టంగా అమలు చేయాలి. దేశంలో ఎక్కడ ఎర్రచందనం అక్రమ నిల్వలు ఉన్నా ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని స్వాధీనం చేసుకోవాలి. ఇతర రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖ అధికారులతో సమన్వయం తక్షణ అవసరం. స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కింగ్ పిన్స్, ఫైనాన్షియర్స్‌పైనా దృష్టి సారించాలి. బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రానికి చెందిన విలువైన ఎర్రచందనం సంపదను రక్షించేందుకు అత్యాధునిక సాంకేతికత, డ్రోన్ల పరిజ్ఞానాన్ని వినియోగించుకొంటూ నిఘాను మరింత విస్తృతంగా వినియోగించాలి. అంతర్రాష్ట్ర సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలి" అని పేర్కొన్నారు.

# 3,168 ఉద్యోగాల భర్తీ!

>> చారు. సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ అయ్యింది. భుజానికి శస్త్ర చికిత్స కారణంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరు కాలేదు. దాదాపు 25కు పైగా అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బాపట్ల జిల్లా వేదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గోదావరి పుష్కరాల కోసం భద్రతా ఏర్పాట్లకు రూ.50 కోట్లు మంజూరు చేసింది.పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా ఏపీ టూరిజం అథారిటీకి కీలక భూ బదిలీలు జరిగాయి. చిత్తూరు, కాకినాడ నగరాల్లో వరల్డ్ క్లాస్ రిసార్ట్స్, స్టార్ హోటళ్లు, సరికొత్త టూరిజం ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాలను బదిలీ చేస్తూ మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విజయనగరంలో యశశ్రీ విరోహా ఇంపెక్స్ సంస్థ ఆధ్వర్యంలో "రద్దీస్ రీజెనరేటివ్ హబ్" పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. పుట్టపర్తిలో ఎస్ఎస్ఎస్ ఏరోస్పేస్ ప్రాజెక్టు స్థాపన కోసం శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ భూములపై ఉన్న 76.13 ఎకరాల నిషేధాన్ని ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నారు.మంత్రివర్గ సమావేశంలో ల్యాండ్ పూలింగ్ రైతులకు న్యాయం చేయడంతో పాటు పలు మౌలిక వసతుల ఒప్పందాలకు సవరణలు చేశారు. అనకాపల్లి ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా చెర్లపాలి ఖండం రైతులకు 1,800 చదరపు గజాలు లేఅవుట్ డెవలప్ చేసిన ప్లాట్లను పరిహారంగా ఇవ్వనున్నారు. విజయవాడ జెట్ సిటీ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో స్థలాల కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ఇండస్ట్రియల్ పార్కుల వేగవంతం కోసం ఎపీఐఐసీ - ఎన్ఐసీడీఐటీ మధ్య జరిగిన ఒప్పందాన్ని సవరించారు. అగ్నిమాపక శాఖ ఆధునీకరణకు ఆమోదం లభించింది. పరిశ్రమలు, విద్య, మౌలిక సదుపాయాలకు ఊతమిస్తూ వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చింది. విష్ణు ఉమెన్స్ యూనివర్సిటీ, చలపతి యూనివర్సిటీలను ప్రైవేట్ యూనివర్సిటీల జాబితాలో చేర్చే ఆర్డినెన్స్ మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నీటిపారుదల రంగంలో నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641 కోట్ల పరిపాలనా అనుమతి, హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్ -2 పనుల వ్యయాన్ని రూ.312 కోట్లకు పెంచే ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది.విశాఖలో ఏఐజీసంస్థ ఆధ్వర్యంలో నర్సింగ్, అలైడ్ హెల్త్ సైన్సెస్ కాలేజీలు, హాస్టళ్ల నిర్మాణానికి మంత్రివర్గ కమిటీ భూ కేటాయింపులు జరిపారు. నంద్యాల జిల్లాలో ఏఎం గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో 700 మెగావాట్ల సోలార్, 300 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టుల స్థాపనకు రెండు విడతల్లో భూములు కేటాయించారు. గండికోట పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పరిధిలో అదానీ సంస్థ నిర్మిస్తున్న 18 వందల మెగావాట్ల భారీ విద్యుత్ ప్రాజెక్ట్ పనుల కోసం ఎన్ఆర్ఇడీసీఎపికు భూములు కేటాయించారు. కుప్పంలో శ్రేష్ఠ రెన్యూవబుల్స్ ఆధ్వర్యంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు, నంద్యాలలో ఎన్‌సిఎల్ ఇండస్ట్రీస్ మినీ హైడల్ ప్రాజెక్టుకు 33 ఏళ్ల లీజుపై భూములిస్తూ క్లియరెన్స్ ఇచ్చారు.శ్రీకాకుళంలోని బ్రహ్మకుమారీస్ సంస్థకు మున్సిపల్ స్థల లీజును కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పుష్కరాల నిర్వహణ, భద్రత, బందోబస్తు ఏర్పాట్ల కోసం రూ.50 కోట్ల నిధుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇవ్వడం వంటి అంశాలకు మంత్రివర్గం నుంచి ఆమోదం లభించింది. విష్ణు ఉమెన్స్ యూనివర్సిటీ, చలపతి యూనివర్సిటీలను ప్రైవేట్ యూనివర్సిటీల జాబితాలో చేర్చే ఆర్డినెన్స్‌పై కూడా మంత్రివర్గం చర్చించింది. అలాగే నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641.10 కోట్ల పరిపాలనా అనుమతుల మంజూరుపై చర్చ జరిగింది. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్2 పనుల అంచనా వ్యయాన్ని రూ.241.20 కోట్ల నుంచి రూ.312 కోట్లకు పెంచేందుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది ఇక మంత్రి వర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మదనపల్లిలో ఆగస్టు చివరి వారంలో ఉద్యానవనాన్ని ప్రారంభిస్తారని సీఎం చెప్పారు. గోదావరి పుష్కరాల ప్రారంభం రోజే పోలవరం ప్రారంభం గురించి ఆలోచిస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. రెండో త్రైమాసికంలో అడుగుపెట్టినందున శాఖల వారీగా సమీక్షలు చేసుకోవాలని ఆదేశించారు. ఉత్తరాంధ్రలో వెనుకబాటుతనం ఉండకూడదని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై దృష్టి పెట్టాలని అన్నారు.

# ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఎపి

ఇచ్చి ట్యాంపర్‌ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరిగేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థను తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. ఇక భూ సమస్యలు ఉత్పన్నం కావడానికి డబుల్ రిజిస్ట్రేషన్లు ప్రధాన కారణంగా ఉన్నాయని, ఇకపై డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యలను నివారించేలా బ్లాక్ చెయిన్ విధానం పని చేస్తోందని అధికారులు వివరించారు. భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా ఉండేలా మీ భూమి బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చామని, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే వేదిక మీదకు తెచ్చేలా ప్రాజెక్ట్ డిజైన్ చేశామని తెలిపారు. ఎన్ఐసి ఆంధ్రప్రదేశ్, ఎన్ఐసి బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్‌లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో 'మీ భూమి-బ్లాక్ చెయిన్ వ్యవస్థను అభివృద్ధి చేసినట్టు అధికారులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీంట్లో భాగంగా ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల పరిధిలోని 89 రీసర్వే గ్రామాల్లోని 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ చేసేలా 'మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్టు వివరించారు. 'మీ భూమి-బ్లాక్ చెయిన్ అమలు జరిగే తీరును వివరించే వీడియోను అధికారులు ప్రజెంట్ చేశారు. ఇదే విధానంలో క్యూ ఆర్ కోడ్, ఆధార్‌ను అనుసంధానించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

**అధ్యయనం చేయాలి... లోపాలు సరిదిద్దాలి**

'మీ భూమి-బ్లాక్ చెయిన్ పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "భూ రికార్డులు సరిగా లేకపోవడం వల్ల విలువైన భూముల విషయంలో మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణతో పోల్చుకుంటే ఎపిలో ల్యాండ్ లిటిగేషన్లు తక్కువే. కానీ గత ప్రభుత్వ విధానం వల్ల ఎపిలోనూ భూ తగాదాలు, వివాదాలు పెరిగాయి. 22ఏ పేరుతో కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ప్రక్షాళన, విముక్తి, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలు చేపడుతున్నాం.. రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం... పట్టాదార్ పాస్ పుస్తకాలు రాజముద్ర వేసి ఇస్తున్నాం. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న భూములకు విముక్తి కల్పించాం. ఇప్పుడు ప్రారంభించిన 'మీ భూమి-బ్లాక్ చెయిన్ ప్రాజెక్టు ద్వారా భూములకు శాశ్వత భద్రత దక్కుతుంది. భూ రికార్డులకు సంబంధించి ట్యాంపర్ ప్రూఫ్ వ్యవస్థను తెస్తున్నాం.. పటిష్టమైన భద్రత కల్పిస్తున్నాం. బ్లాక్ చెయిన్ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే వేదిక మీదకు వస్తాయి... ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయ విక్రయాలు చేసుకోవచ్చు. రెండు నెలల పాటు ఈ పైలెట్ ప్రాజెక్టు అమలును పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఈ వ్యవస్థ అమల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని నమోదు చేసుకోవడానికి ఓ కంప్లైంట్ సెల్ పెట్టాలి... దానికి అనుగుణంగా బ్లాక్ చెయిన్ ప్రాజెక్టులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఇప్పటి నుంచి సర్వే పూర్తి అయిన గ్రామాలు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థలోకి వెళ్తాయి. నవంబర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 'మీ భూమి-బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేలా చూడాలి. భూ సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టేలా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. భూ సమస్యలకు పరిష్కారం చూపితే ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, సిఎస్ సాయిప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఏడు జిల్లాల కలెక్టర్లు, ఎపి ఎన్ఐసి, బెంగళూరుఎన్ఐసి ప్రతినిధులు హాజరయ్యారు.

# అంపోలు జైలుకు అప్పలరాజు

>>పోలీసులు ఉన్నా వాహనాల రాకపోకలు సంభింపచేసినా కాలిబాటన, పొలాల్లోంచి జనం పలాసకాశీబుగ్గ పట్టణానికి చేరుకుని డాక్టర్ కు తమ సంఘీభావంను తెలియజేశారు.. అప్పలరాజు అరెస్టు హైడ్రామా 24 గంటల పాటు నడిచింది.

**ఆరోపణలతో అక్రమ కేసులు**

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు చేసిన యాక్సిడెంట్ లో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందగా.. సాక్షాలను తారుమారు చేసేందుకు ప్రయత్నం చేశారనే అభియోగంతో మాజీ మంత్రి సీదిరిని బుధవారం రాత్రి కాశీబుగ్గ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రోడ్డు ప్రమాదంలో అప్పలరాజు కుమారుడు అరవ వర్మ సిద్దార్థ త్యాడీలను పదిరోజుల క్రితం అరెస్టు చేసి జైలుకు పంపిన పోలీసులు ఇదే కేసులో ఏ3గా పేర్కొంటూ డాక్టర్ అప్పలరాజును బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. అరవవర్మ సిద్ధార్థ త్యాడీలను అరెస్టు చేసిన రోజు నుంచి అప్పలరాజు ఇంటి వద్ద పోలీస్ స్తే పెద్దసంఖ్యలోనే ఉంది. బుధవారం సాయంత్రం నాటికి ఎసిపి, ముగ్గురు డిఎస్పిలు, పలువురు సిఐలు, ఎస్సైలు, వందలాది మంద పోలీస్ కానిస్టేబుళ్లు కాశీబుగ్గలోని అప్పలరాజు ఇంటివద్దకు చేరుకున్నారు. పోలీస్ బలగాలు బుధవారం సాయంత్రం నుంచి పెద్ద ఎత్తున సీదిరి ఇంటివైపు కదిలిరావడంతో పరిసర ప్రాంతాల్లో ప్రజలు కార్యకర్తలు కూడా అక్కడకు చేరుకొనే ప్రయత్నం చేశారు. అయితే అరెస్టుకు ముంచే పోలీస్ యంత్రాంగం పలాస, కాశీబుగ్గ పట్టణంలో పెద్ద ఎత్తున వలయాలు ఏర్పాటు చేయడంతో పాటు స్టేషన్ వైపు ఎవరూ రాకుండా జారగేడ్లు ఏర్పాటు చేశారు. అప్పలరాజును అరెస్టు చేసిన సమయంలో పోలీసులకు, వైశాపా నేతలు, కార్యకర్తలు, అభిమానులకు వాగ్వివాదం చోటు చేసుకుంది. మాజీ మంత్రి అప్పలరాజును బలవంతంగా పోలీసులు తీసుకొని వెళ్లడానికి చేసిన ప్రయత్నం ను కార్యకర్తలు, అభిమానులు తీవ్రంగా అడ్డుకున్నారు.. ఆయన సోదరుడు సీదిరి త్రినాధ్‌ను పోలీసులు నెట్టేయడం కూడా కార్యకర్తల ఆగ్రహం మరింత పెరగడానికి కారణమయ్యింది.

**అప్పలరాజును రాత్రంతా పోలీస్ స్టేషన్లోనే ఉంచారు**

ఇదే ఘటనలో అప్పలరాజును తీసుకెళ్తున్నప్పుడు అడ్డుకొనేందుకు ప్రయత్నించిన టెక్కలి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌ను కూడా పోలీస్ స్టేషన్‌కు తీసుకొనివెళ్లారు. గురువారం ఉదయం వలాస నియోజకవర్గంలోని వజ్రపు కొత్తూరు, మందస, పలాస మండలాలతో పాటు పలాస, కాశీబుగ్గ పట్టణానికి చెందిన జనం కూడా పెద్ద ఎత్తున తరలివచ్చారు. జిల్లా నలు మూలల నుంచి మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వారు, సీదరి అప్పలరాజు అభిమానులు వైసిపి శ్రేణులు, పలాస కాశిబుగ్గ వాహనాలతో రాకపోకలను పోలీసులు అడ్డుకోగలిగినప్పటికీ కాలిబాటన జనం మాత్రం వేల సంఖ్యలో గుమిగూడిపోయారు. మఫ్టీలోనూ, యూనిఫామ్ తోను వందలాది మంది పోలీసులు అరెస్టు చేయడావికి అక్కడకు వచ్చిన జనాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించడాన్ని జనం చర్చించుకుంటున్నారు. పలాస, ఇచ్చాపురం, టెక్కలి నియోజకవర్గాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో జనం హాజరై అప్పలరాజు అరెస్టును ఖండించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లోనే మాజీ మంత్రి అప్పలరాజును ఉంచడాన్ని ముక్త ఖంఠంతో ఖండిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల తరువాత అప్పలరాజును కోర్టులో ప్రవేశపెట్టడంతో జడ్జి బెయిల్ తిరస్కరించి 14 రోజుల రిమాండ్ ను చెప్పడం శ్రీకాకుళం దగ్గర అంపోలు సబ్ జైలుకు తరలించారు.

## వారం - వర్జ్యం

24-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
దశమి ఉ.9.13, అనూరాధ తె.4.36
వర్జ్యం : ఉ.6.12-ఉ.8.00
దు.ఉ.8.20-ఉ.9.12, 2)మ.12.39-మ.1.31
శుభసమయం : ఉ.5.00-6.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** పారిశ్రామిక రంగాలలో వారికి పదవులు, హోదాలు లభిస్తాయి. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు.

**వృషభం:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. రెండు, మూడు విధాలుగా ధన లాభం పొందుతారు. కోర్టు కేసుల నుండి బయటపడతారు.

**మిథునం:** క్రీడారంగం యందు ఆసక్తి కలిగివుంటారు. మొండిబాకీలు రాబట్టుకోవడానికి కొత్తగా మార్గాలు అవలంభిస్తారు.

**కర్కాటకం:** పురోభివృద్ధిలో స్వల్ప మందగమనం ఏర్పడిందని గుర్తించి కొత్త వ్యూహాలను అనుసరిస్తారు. ఆ దిశగా కొంత పురోభివృద్ధి సాధిస్తారు.

**సింహం:** నూతనవ్యక్తులు పరిచయమై మాట సహాయసహకారాలు అందిస్తారు. అప్రయత్నంగా కలిసివస్తాయి. ఉద్యోగాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**కన్య :** క్రయవిక్రయాలు, దూరప్రాంత ప్రయాణాలు, పెట్టుబడులు కొంతకాలం వాయిదావేయటం అన్నివిధాలా మంచిది.

**తుల:** స్థిరాస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. రాజకీయ రంగాలలోని వారు విదేశీ పర్యటనలు పొందుతారు.

**వృశ్చికం:** సేవకా సిబ్బంది వలన, సహోద్యోగుల వలన నష్టములు వాటిల్లవచ్చు. తగు జాగ్రత్తలు పాటించండి.

**ధనుస్సు:** సంతానం గురించి అధికంగా ఆలోచిస్తారు. వారి పురోభివృద్ధికి కావలసిన వనరులను సమకూరుస్తారు.

**మకరం:** దూరప్రాంతాలలోని ఆత్మీయుల నుండి ఆనందదాయకమైన సమాచారం అందుకుంటారు. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** వ్యవహారాల తాలూకు చికాకులను ఇంట్లో ప్రదర్శిస్తారు. ఇది లాభించే అంశం కాదు. కనుక తగుజాగ్రత్తగా ఉండండి.

**మీనం:** ప్రతి చిన్నవిషయానికి శ్రమించి చివరకు పూర్తిచేస్తారు. క్రయవిక్రయాలలో మెలుకువ అవసరం.ఆరోగ్యం జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సవాల్‌గా తీసుకోండి!

>> చొరవ తీసుకోవాలని సిఎం చంద్రబాబు సూచించారు. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్య పరిష్కారం అయ్యేవరకు ఇన్చార్జ్ మంత్రులదే బాధ్యత అని స్పష్టం చేశారు. భోగాపురం ప్రధాని పర్యటన వివరాలు మంత్రులకు సిఎం వివరించారు. ఉత్తరాంధ్ర 6 జిల్లాల్లో ఫించన్లు ఒకరోజు ముందే ఇచ్చేసి ఆగస్టు 1న పూర్తి స్థాయిలో ప్రధానమంత్రి కార్యక్రమంలో నిమగ్నం కావాలని చంద్రబాబు ఆదేశించారు. అలాగే ప్లానింగ్ బోర్డు సమావేశాలను తరచూ నిర్వహిస్తూ, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్షలు చేయాలని సూచించారు. 'మీ శాఖల్లో ఉన్న సమస్యలను మీరే పరిష్కరించే విధంగా చొరవ చూపాలి. రెండేళ్ల ప్రభుత్వ విజయాలపై మంత్రులు మీడియా సమావేశాలు నిర్వహించినప్పటికీ, వాటిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లలేకపోయార్ను అని చెప్పుకొచ్చారు. పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ కేసుల్లో సిసిటివి కెమెరాల ఆధారంగా నిందితులు దొరికిపోయారని ముఖ్యమంత్రి చెప్పారు. డిఎస్సీ పరీక్షల అంశంలో ప్రతిపక్షం చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మలేదని, కోర్టులోనూ వారికి అనుకూల ఫలితం రాలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని ఢిల్లీలో జరిగిన నీట్ ఉద్యమంతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇలాంటి అంశాల్లో మంత్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

గోదావరి పుష్కరాలు, పోలవరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని ఒకే రోజు నిర్వహించే అంశంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సిఎం పేర్కొన్నారు. పోలవరం ప్రారంభోత్సవం, గోదావరి పుష్కరాల ప్రారంభ కార్యక్రమాలను విడివిడిగా నిర్వహిస్తే బాగుంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశంలో చెప్పినట్లు సమాచారం.

మెగా డిఎస్సీకి, ఢిల్లీ ఆందోళనలకు ముడిపెట్టాలని వైఎస్సార్సీపీ యత్నిస్తోందని మంత్రులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. గొడ్డలి పార్టీ కుట్రల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లేని వివాదాలు సృష్టించటమే ఆ పార్టీ నైజం అని చంద్రబాబు మండిపడ్డారు. ప్రో యాక్టివ్‌గా మంత్రులు ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం పొగాకు రైతుల కోసం తీసుకున్న చర్యలను ప్రజలకు ముందుగానే వివరించాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు ముందే తెలియజేస్తే ప్రతిపక్షానికి అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఆగస్టు చివరి వారంలో ఉద్యాన హబ్‌ను మదనపల్లిలో ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆగస్టు మొదటి వారంలో ఉత్తరాంధ్రలో భోగాపురం ప్రారంభోత్సవం ఉంటే, చివర్లో రాయలసీమలో ఉద్యాన హబ్ ప్రారంభం ఉంటుందన్నారు.

**ఇళ్ల పట్టాలు పంపిణీకి లోకేశ్ ప్రత్యేక చొరవ**

జిల్లాల్లో ఇన్‌చార్జ్ మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే మెజారిటీ సమస్యలు పరిష్కారం అయినట్టేనని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు తెలిపారు. యేళ్ల తరబడి పెండింగ్ సమస్యల పరిష్కారం అయినవి ఎమ్మెల్యేలు, మంత్రులు ఓనర్షిప్ తీసుకోవాలని సూచించారు. మంగళగిరిలో ఇళ్ల పట్టాలు పంపిణీకి లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు.

# రాజాపై ఎస్సీ, ఎస్టీ కేసు

>> 2024వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల ముందు బద్వేల్ టికెట్ కోసం వైకాపా నాయకుల కాళ్ల చుట్టూ తిరిగారని ఇలాంటి అవినీతిపరులకు, లంచగొండిలకు టిక్కెట్ ఇవ్వమని ఎడమ కాలనీలతో బయటకు తన్నేసామంటూ అత్యంత అవమానికారంగా ఆయన మాట్లాడారు.భూ వివాదాల కోసం, మాట్కా దందాల కోసం కర్నూలు మూడో పట్నం పోలీస్ స్టేషన్లో శేషయ్య పోస్టింగ్ ఇచ్చారని వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు ఒంటిమీద చొక్కా ఉంటే ఒట్టు అని హెచ్చరించారు.ఇంటి గేటు దగ్గర నిలబడి ఎండలో వానలో విధులు నిర్వహించే పోస్టును ఇప్పిస్తామని చెప్పారు. జక్కంపూడి రాజా చేసినవి సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారాయి. విషయం ఎస్సీ కమిషన్ దృష్టికి వెళ్లడంతో జక్కంపూడి రాజాపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ కె జవహర్ ఆదేశాలు జారీ చేశారు. ఆయా ఆదేశాలు ప్రకారం బి.ఎన్.ఎస్ 351( 2)ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద ఈ ఏడాది మే నెల 28వ తేదీన కేసు నమోదు చేశారు.దీనిపై నోటీసులు జారీ చేశారు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం
fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
24-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 174 పేజీలు: 8+4 వెల: 6.50

జొన్నగిరి ఇకపై 'స్వర్ణగిరి' గోల్డ్‌మైన్స్ 5లో

ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి: మంత్రి గొట్టిపాటి

# పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

### ప్రధాని మోడీ హామీ... గంటల్లోనే కార్యాచరణ
### ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాట్లు కేంద్రం చర్యలు
### కొత్త యాంటీ-చీటింగ్ చట్టం కింద కేసుల విచారణ
### దోషులుగా తేలితే ఐదేళ్లు జైలు, రూ.10 లక్షల జరిమానా
### తొలి దశలో 4 రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు

**న్యూఢిల్లీ, జులై 23:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్ 2024 కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కోల్‌కతా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే >>2

## ఉపేక్షించబోం!



"మన యువత సంక్షేమం, భవిష్యత్తు కంటే ముఖ్యమైనది మరొకటి లేదు. పరీక్షా పత్రాల లీకేజీకి పాల్పడిన వారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూసేందుకు 'ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్ల'ను ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించాము. ఈ దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించాము. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తాము చేపడుతున్న వరుస చర్యలలో ఇది మరొకటి. మన యువత భవిష్యత్తుకు హాని కలిగించడానికి ప్రయత్నించే వారిని ఏమాత్రం ఉపేక్షించబోమ్ము

- నరేంద్రమోడీ, ప్రధానమంత్రి

## దెబ్బతీసింది మీరే!



"మన యువత భవిష్యత్తును అత్యంత తీవ్రంగా దెబ్బతీసింది మీరే.మన విద్యా వ్యవస్థను పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకుని నాశనం చేసేలా మీరు అనుమతించారు, ప్రోత్సహించారు. అంతేకాక, అందుకు బాధ్యులైన ప్రతి ఒక్కరినీ మీరు కాపాడారు. విద్యార్థుల డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలి. విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్ని

- రాహుల్‌గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

## భవిత కోసమే పోరు!



"అన్నిటికంటే ముందుగా మీరు యువత డిమాండ్లను నెరవేర్చాలి.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, అవినీతి వ్యవస్థను సంస్కరించాలి, విద్యార్థులందరి నుండి క్షమాపణ కోరాలి. ప్రధానమంత్రి గారూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడుతున్నది మీ సొంత దేశానికి చెందిన యువత్ణే

- కాక్రోచ్ జనతా పార్టీ



## చర్చలకు సిద్ధం

- కేంద్ర మంత్రులు జెపి నడ్డా, జితేంద్ర సింగ్ వెల్లడి
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తేనే చర్చలు: సిజెపి
- ఆ చర్చలు తటస్థ వేదికపైనే జరగాలని స్పష్టీకరణ

## పార్లమెంట్‌లోనూ రెఢీ!

- కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, రిజిజు ప్రకటన
- నాల్గవ రోజూ ఉభయ సభల్లో 'నీట్' రభస
- పార్లమెంట్ వెలుపలా అధికార, విపక్షాల ఆందోళన







- ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళన
- పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన ఢిల్లీ పోలీసులు
- పోలీసులకు ప్రత్యేక అధికారాలు కల్పించిన కేంద్ర హోంశాఖ
- కాంగ్రెస్ తీరుపై వాంగ్‌చుక్ భార్య గీతాంజలి మండిపాటు
- రాజకీయాల కోసం విద్యార్థులను వాడుకోవద్దని హితవు
- నేడు దేశవ్యాప్త ఆందోళనలకు సిజెపి పిలుపు

## తగ్గేదేలే!: సిజెపి

- విద్యార్థులకు మద్దతు ప్రకటించిన సినీ ప్రముఖులు
- విద్యార్థులు ఒంటరివారు కాదు మేం వాళ్లతో ఉన్నాం
- జంతర్‌మంతర్ నిరసనల్లో విద్రోహ శక్తులు
- ఢిల్లీ పోలీసుల సంచలన పోస్టులు
- సిజెపి ఆందోళనకు విదేశీ నిధులు...
- బిజెపి కార్యకర్తలు రాళ్లు విసిరారు
- సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే ఆరోపణలు
- జంతర్‌మంతర్ దగ్గర ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిపివేత
- భారీగా పోలీసులు మోహరింపు... ఆంక్షలు

# ఎల్ నినో సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకోండి!

- లోటు వర్షపాతం నమోదవుతోంది
- తాగునీటికి తొలి ప్రాధాన్యతివ్వండి
- పశుగ్రాసానికి తదుపరి ప్రాధాన్యం
- ప్రత్యామ్నాయ పంటలేయండి
- రైతులకు అవగాహన కల్పించాలి
- కేబినెట్ భేటీలో విస్తృత చర్చ
- మంత్రులకు సిఎం దిశానిర్దేశం




**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదవుతుందనే సమాచారం నేపథ్యంలో వ్యవసాయ రంగం జలవనరులు, పౌరసరఫరాలు, పరిశ్రమలు, పంచాయతీరాజ్, ఆర్థిక శాఖలు సమన్వయంతో సంక్షోభాన్ని సవాలుగా తీసుకోవాలని మంత్రులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర మంత్రివర్గం భేటీలో అజెండా అంశాలు ముగిశాక లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. తాగు నీటికి తొలిప్రాధాన్యం, పశుగ్రాసానికి తదుపరి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు మంత్రులు వివరించాలన్నారు. ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కృష్ణా, గుంటూరు డెల్టాలో వరి సాగు వేయకుండా రైతుల్ని చైతన్య పరచాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు పై రైతులకు అర్థమయేలా వివరించేందుకు అవగాహన కార్యక్రమాలుచేపట్టాలని వెల్ల డించారు. ఏసమస్య ఎక్కడతలెత్తినా ఇన్‌చార్జ్ మంత్రులు >>2

## 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

- చేనేతలకు యేటా రూ.25 వేల ఆర్థిక సాయం
- 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి
- ఇప్పటికే ఉచిత విద్యుత్ పథకం అమలు
- 50 యేళ్లు నిండిన చేనేతలకు రూ.4 వేల పెన్షన్లు
- చంద్రబాబు పాలన నేతన్నలకు స్వర్ణయుగమే
- చేనేతల తరఫున సిఎంకు మంత్రి సవిత ధన్యవాదాలు



**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో చేనేత కళాకారులు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సిఎం చంద్రబాబు లక్ష్యమని, ఇందులో భాగంగా నేతన్నలకు ఆర్థిక దన్ను కలిగేలా 'నేతన్న సేవ'లో పథకానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. నేతన్న సేవలో పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి కలిగేలా ఏటా రూ.25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. >>2

## మరింత అధ్యయనం తర్వాత 3,168 ఉద్యోగాల భర్తీ!

- కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం
- 25కు పైగా అంశాలపై చర్చ, ఆమోదం
- పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ భూములపై నిషేధం ఎత్తివేత
- కుప్పంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు
- విజయవాడ జెట్ సిటీ ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో స్థలాల కేటాయింపులకు ఆమోదం
- గండికోటలో 18 వందల మెగావాట్ల భారీ విద్యుత్ ప్రాజెక్టుకు భూములు కేటాయింపు

**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగాల కల్పన, సంక్షేమం, విద్య, నీటిపారుదల రంగాల వంటి కీలక అంశాలకు ఆమోదం తెలపటమే అజెండాగా సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. రెండో దశలో 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశంపై మరింత అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఈ అంశాన్ని మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించి, తదుపరి కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని సిఎం సూచిం >>2



## ఎర్రచందనం మాఫియా మూలాలను తుడిచేయండి

- డ్రోన్‌లతో నిఘా.. స్మగ్లింగ్ పూర్తిగా అరికట్టాల్సిందే
- కింగ్ పిన్‌లపైనా ఉక్కుపాదం మోపండి
- జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలి
- మన ఎర్ర చందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలవద్దు
- అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం

**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** "రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతో అటవీ శాఖ ప్రణాళికలకు మరింత పదును పెట్టాలి. ఇందుకోసం స్మగ్లింగ్ ముఠాలపై నిఘా పెంచాలి. డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించుకొంటూ నిఘా పటిష్టం చేయాల్ని అని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. స్మగ్లింగ్ ముఠాల నెట్‌వర్క్‌ను మూలాలతో సహా నిర్మూలించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు ఎలాంటి అవకాశం లేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, రెండేళ్లలో ఏమేరకు స్మగ్లింగ్ నిరోధించారు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై అటవీశాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సమీక్షించారు. ఈసందర్భంగా గడచిన రెండేళ్లలో ఎర్ర చందనం అక్రమరవాణాను అరికట్టేందుకు అటవీశాఖ తీసుకున్న చర్యలు, సాధించిన ప్రగతి, నమోదైనకేసుల వివరాలను అధికారులు వివరించారు.

**506 కేసులు... 1239మంది అరెస్టు**

గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టినట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి అధికారులు వివరించారు. 506 కేసులు నమోదు చేసి, 1,239 మందిని అరెస్ట్ చేయగా, 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, 12మంది ప్రధాన స్మగ్లర్లపై పిడిచట్టం కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళ >>2



## అంపోలు జైలుకు అప్పలరాజు

- బెయిలు తిరస్కరణ
- 14 రోజుల రిమాండ్
- పలాసలో హైడ్రామా
- రోజంతా పోలీస్ స్టేషన్‌లోనే
- భారీగా పోలీసు బందోబస్తు

**పలాస, జులై 23, ప్రభాతవార్త :** మాజీ మంత్రి వైకాపా నేత డాక్టర్ సీదిరి అప్పలరాజు అరెస్టుతో పలాసకాశీబుగ్గ జంట పట్టణాలు అట్టుడికిపోయాయి. అప్పలరాజు అరెస్టు వార్త బుధవారం సాయంత్రం జనానికి తెలిసిపోవడంతో పరిసర ప్రాంతాలనుంచి జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గురువారంసాయంత్రం వేలాది సంఖ్యలో జనం పలాస కాశీబుగ్గ పట్టణానికి చేరుకున్నారు. వందలాది మంది >>2

## అమరావతిలో పిఎన్‌బి క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్

### సిఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం

**విజయవాడ , జులై 23.ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి క్వాంటం వ్యాలీలో మరో కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ముందుకు వచ్చింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ లో క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ఎపి క్వాంటం మిషన్‌పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఒప్పందం కుదిరింది. సిఎం చంద్రబాబు నాయుడు పిఎన్‌బి సిఇఒ, ఎండి అశోక్ చంద్ర సమక్షంలో ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశంలో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న మొట్ట మొదటి బ్యాంక్‌గా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలిచింది. బ్యాంకింగ్ సేవల్లో సైబర్ భద్రతను పటిష్టం చేయటంతో పాటు ఆర్థిక మోసాలను ముందుగా గుర్తించే వ్యవస్థ ఏర్పాటు, భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్ని సురక్షితంగా నిర్వహించేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తోంది. పరిశ్రమలు, >>2

## జక్కంపూడి రాజాపై ఎస్సీ, ఎస్టీ కేసు

### 28న విచారణకు రావాలంటూ వైసిపి నేతకు నోటీసులు

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి, జులై 23,ప్రభాతవార్త:** కర్నూలు మూడవ పట్టణ సిఐగా విధులు నిర్వహిస్తున్న శేషయ్యను ఉద్దేశించి అత్యంత అభ్యంతరంగా మాట్లాడిన వైయస్‌ఆర్‌సీపి యువత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు కర్నూలు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని డిఎస్‌పి రాఘవేంద్ర ఆయనకు నోటీసులు పేర్కొన్నారు. వైకాపా యోజన విభాగం కర్నూలు నగర అధ్యక్షుడు బాలును పోలీసులు వేధిస్తున్నారంటూ వైకాపా నాయకులు మే 14వ తేదీన కలెక్టరేట్ దగ్గర ధర్నా చేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ పోలీసులు కాకి చొక్కాలు వేసుకుని తప్పు చేస్తున్నారని తాము కొట్టే దెబ్బ చావుదెబ్బలాగా ఉంటుందని హెచ్చరించారు. సిఐ శేషయ్య తాను సంపాదించిన అక్రమ సంపాదనతో రాజకీయాల్లోకి రావాలని చూశారని జక్కంపూడి ఆరోపించారు. >>2

## రెండేళ్లలో రూ.29.30లక్షల కోట్ల పెట్టుబడులు

- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చిత్తశుద్ధితో అమలు చేయాలి
- పరిశ్రమల గ్రౌండింగ్‌లో ప్రతినెలా పురోగతి కన్పించాలి
- 20లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రుల బృంద సమావేశంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం



గురువారం రంపచోడవరంలో మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం పలుకుతున్న దృశ్యం

**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.29,30,357 కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు ముందుకు వచ్చాయి. వీటిద్వారా 24,66,165 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించే అవకాశంఉంది. ప్రతి ప్రాజెక్టును ఎప్పటి కప్పుడు ట్రాక్ చేస్తూ త్వరితగతిన గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం మంత్రిలోకేష్ అధ్యక్షతన ఉండవల్లిలో జరిగింది. సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... పరిశ్రమలకు భూకేటాయింపులు, అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతినెలా నిర్వహించే సమీక్షలో పురోగతి కన్పించాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలు ఎపిని ఎంచు >>2

## ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఎపి

- భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి
- భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా 'మీ భూమి-బ్లాక్ చెయిన్'
- ట్యాంపర్ చేయలేని విధంగా ల్యాండ్ రికార్డులకు హై సెక్యూరిటీ
- 'మీ భూమి-బ్లాక్ చెయిన్' పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రక్షాళన-విముక్తి- భద్రత అంశాలుగా భూ సమస్యలకుశాశ్వతపరిష్కారంచూపేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని సిఎం తెలిపారు. దీనికి అనుగుణంగానే భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా 'మీ భూమి-బ్లాక్ చెయిన్' ప్రాజెక్టును తెచ్చామని సిఎం చంద్రబాబు చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి 'మీ భూమి-బ్లాక్ చెయిన్' పైలెట్ ప్రాజెక్టును వర్చువల్‌గా సిఎం ప్రారంభించారు. ఈ మేరకు ఈ ప్రాజెక్టులో ఉన్న ఫీచర్స్, ప్రత్యేకత లను సిఎస్ సాయిప్రసాద్, రెవెన్యూ శాఖ అధికారులు సిఎం చంద్రబాబుకు వివరించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు బ్లాక్‌చెయిన్ విధానాన్ని రెవెన్యూశాఖ రూపొందించినట్టు తెలిపారు. భవిష్యత్తులో భూ సమస్యలకు చెక్ పెట్టేలా ప్రతి ల్యాండ్ పార్సెల్‌కు ప్రత్యేక డిజిటల్ ఐడి >>2

వార్త

భూమ్మీద మనిషంత గొప్పవాడు ఎవడూ లేడు. మనిషిలో మెదడంత గొప్ప అవయవం మరొకటి లేదు.

-విలియం హోమిల్టన్

# ఒక దీక్ష... ఎన్నో ఆలోచనలు!

*ప్రభుత్వాలకు కూడా ఒక చారిత్రక బాధ్యత ఉంది. శాంతియుత నిరసనలను బల హీనతగా కాకుండా ప్రజాస్వామ్య శక్తిగా చూడాలి. విభేదాలను అణచివేయడం తాత్కాలిక నిశ్శబ్దాన్ని తెచ్చిపెట్టవచ్చు. కానీ సంభాషణ మాత్రమే శాశ్వత విశ్వాసాన్ని నిర్మిస్తుంది. ప్రజాస్వామ్యం అనేది గెలుపుఓటమి రాజకీయాల కంటే, పరస్పర విశ్వాసం మీద నిలిచే వ్యవస్థ. సోనం వాంగ్‌చుక్ ఉద్యమం చివరకు విజయం సాధిస్తుందా? కాలమే సమాధానం చెబుతుంది. కానీ ఈ ఉద్యమం ఇప్పటికే ఒక విజయాన్ని సాధించింది. అది లక్షలాది మందిని ఆలోచింప జేసింది. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతితో మన సంబంధం ఎలా ఉండాలి? యువత పాత్ర ఏమిటి? ప్రభుత్వ బాధ్యత ఎక్కడ ప్రారంభమై ఎక్కడ ముగుస్తుంది? అనే ప్రశ్నలను మళ్లీ మన ముందుంచింది.*

ఎం కె కుమార్

చరిత్రలో కొన్ని క్షణాలు ఉంటాయి. అవి యుద్ధాల వల్ల కాదు. ఎన్నికల వల్ల కాదు. ఒక మనిషి మౌనంగా కూర్చోవడం వల్ల పుడతాయి. మాట్లాడకపోవడం వల్ల వినిపిస్తాయి. తినకపోవడం వల్ల దేశాన్ని ఆలోచింపజేస్తాయి. సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష అలాంటి క్షణాల్లో ఒకటి. ఆకలి సాధారణంగా శరీరానికి సంబంధించిన విషయం. కానీ కొన్నిసార్లు ఆకలి ఒక రాజకీయ భాష అవుతుంది. ఒక నిరసన అవుతుంది. ఒక నైతిక ప్రశ్నగా మారుతుంది. ఒక వ్యక్తి తన శరీరాన్నే వాదనగా మార్చుకున్నప్పుడు,అతని శక్తి కండరాల్లో ఉండదు. అతని బలం అతని నిశ్శబ్దంలో ఉంటుంది. ఆ నిశ్శబ్దం అధికారాన్ని అవమానించదు. కానీ ప్రశ్నిస్తుంది. సమాధానం కోరుతుంది. ఈ దేశం నిరాహార దీక్షలను కొత్తగా చూడలేదు. మహాత్మా గాంధీ కాలం నుంచి ఈ నేల ఒక విచిత్రమైన రాజకీయ సత్యాన్ని తెలుసుకుంది. కొన్నిసార్లు ఖడ్గం చేయలేని పనిని ఉపవాసం చేస్తుంది. శబ్దం చేయలేని మార్పును మౌనం తీసుకొస్తుంది. అయితే ప్రతి నిరాహార దీక్ష చరిత్రలో నిలవదు. ప్రజల హృదయాలను తాకినప్పుడే అది ఉద్యమమవుతుంది. సోనం వాంగ్‌చుక్ విషయంలో ఆసక్తికరమైన విషయం ఆయన వ్యక్తిత్వంకాదు. ఆయన లేవనెత్తిన ప్రశ్నలు. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతి కేవలం వినియోగించాల్సిన వనరేనా? పర్వతాలు రాళ్ల కుప్పలా? నదులు కేవలం నీటి పైపులా? లేక ఇవన్నీ మన నాగరికతకు ఊపిరా? ఈ ప్రశ్నలు ఒక్క ప్రాంతానికి సంబంధించినవి కావు. ఇవి భవిష్యత్తు తరాల ప్రశ్నలు. మన కాలంలో అభివృద్ధి అనే పదం అత్యంత ఎక్కువగా వినిపిస్తోంది. కానీ అదే సమయంలో అడవులు తగ్గుతున్నాయి. నదులు ఎండిపోతున్నాయి. పర్వతాలు కోతలకు గురవుతున్నాయి. గాలి భారంగా మారుతోంది. అభివృద్ధి మనిషి కోసం జరగాలి. మనిషి ప్రకృతిని కోల్పోయేలా జరిగితే, అది అభివృద్ధి కాదు, భవిష్యత్తుపై అప్పు. ఈ ఉద్యమంలో మరో ఆశ్చర్యకరమైన అంశం జెన్‌జెడ్ యువత స్పందన. ఈ తరాన్ని చాలామంది మొబైల్ స్క్రీన్‌ల తరం అంటారు. కానీ అదే స్క్రీన్‌ల నుంచి ఒక సామాజిక చైతన్యం కూడా పుట్టవచ్చని ఈ సంఘీభావం చూపించింది. వారు కేవలం ఒక వ్యక్తికి మద్దతు ఇవ్వడం కాదు. ఒక ప్రశ్నకు మద్దతు ఇస్తున్నారు. 'భవిష్యత్తు ఎలా ఉండాలి?' అనే ప్రశ్నకు. యువత ఉద్యమాల్లో చేరడం కొత్త విషయం కాదు. కానీ నేటి యువత భావోద్వేగాలకంటే సమాచారంతో ముందుకు వస్తోంది. వారు పర్యావరణంపై చదువుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలను గమనిస్తున్నారు. తమ భవిష్యత్తు వాతావరణ మార్పులతో ముడిపడి ఉందని అర్థం చేసుకుంటున్నారు. అందుకే వారి సంఘీభావాన్ని కేవలం సోషల్ మీడియా ట్రెండ్‌గా తీసిపారేయలేం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల బాధ్యత కేవలం పాలించడం కాదు. వినడం కూడా. ప్రతి నిరసన సరైందని చెప్పలేం. ప్రతి డిమాండ్‌ను అంగీకరించాల్సిన అవసరం కూడా లేదు. కానీ శాంతియుతంగా ప్రశ్నించే పౌరులను వినడం ప్రజాస్వామ్య పరిపక్వతకు సూచిక. ప్రశ్నలను అణచివేయడం కంటే వాటితో సంభాషించడం ఎప్పుడూ మెరుగైన మార్గం. ఈ ఉద్యమాన్ని చూసి మరో ప్రశ్న కూడా మన ముందుకొస్తుంది. మనం ప్రకృతిని ప్రేమిస్తున్నామా? లేక అవసరమైనంత వరకు మాత్రమే ఉపయోగించుకుంటున్నామా? హిమాలయాలు కేవలం పర్యాటక ప్రాంతాలు కావు. అవి భారతదేశ జలవనరుల హృదయం. వాటి ఆరోగ్యం దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉంది. అక్కడ జరిగే మార్పులు వేల కిలోమీటర్ల



దూరంలో ఉన్న ప్రజల జీవితాలను కూడాప్రభావితం చేయగలవు. సోనం వాంగ్‌చుక్ గెలుస్తారా? ఓడిపోతారా? ఈ ప్రశ్నకు సమాధానం భవిష్యత్తు చెబుతుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన ఒక చర్చను ప్రారంభించారు. ఒక దేశం తన అభివృద్ధి నమూనాను మరోసారి పరిశీలించాలా అనే ప్రశ్నను ముందుంచారు. అదే ఒక ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన పని. ఎందుకంటే ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకు ఒకసారి ఓటు వేయడం కాదు. ప్రతి రోజు మన భవిష్యత్తు గురించి మాట్లాడుకోవడం. ప్రకృతి గురించి ఆలోచించడం. భిన్నాభిప్రాయాలను వినడం. అధికారాన్ని ప్రశ్నించడం. సమాధానాలను కలిసి వెతకడం. ఒక మనిషి ఆకలి ఎన్నిరోజులు కొనసాగుతుందో తెలియదు. కానీ ఆ ఆకలి ఒక దేశపు మనస్సాక్షిని మేల్కొలిపితే, ఆ నిరాహార దీక్ష చరిత్రలో ఒక రాజకీయ సంఘటనగానే కాదు, ఒక నైతిక సంభాషణగా కూడా నిలిచిపోతుంది. ఒక దేశం బలం దాని సైన్యంలో మాత్రమే ఉండదు. దాని సంపదలో మాత్రమే ఉండదు. ఆ దేశంలో ఒక సాధారణ పౌరుడు అధికారాన్ని ప్రశ్నించగల ధైర్యంలో ఉంటుంది. ప్రశ్నించిన వ్యక్తిని శత్రువుగా కాకుండా, సంభాషణకు ఆహ్వానించే రాజకీయ సంస్కృతిలో ఉంటుంది. ఈ కారణంగానే సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కేవలం ఒక ఉద్యమంగా మిగలలేదు. అది భారత ప్రజాస్వామ్యానికి ఒక అద్దంగా మారింది. నేడు ప్రపంచమంతా అభివృద్ధి గురించి మాట్లాడుతోంది. ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, వేగవంతమైన రైళ్లు, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఇవన్నీ అభివృద్ధి సూచికలుగా మారాయి. కానీ ప్రకృతి నిశ్శబ్దంగా ఒక ప్రశ్న అడుగుతోంది. 'ఈ అభివృద్ధిలో నాకు చోటుందా?' అనే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా మనం ఎంత దూరం పరిగెత్తినా, ఒకరోజు అదే ప్రకృతి మనల్ని ఆపుతుంది. ప్రపంచ చరిత్ర చెబుతున్న ఒక నిజం ఉంది. ప్రకృతిని జయించాలని ప్రయత్నించిన నాగరికతలు చివరికి ప్రకృతి ముందు తలవంచాయి. నదులకు బంధించిన సమాజాలు వరదలను చూశాయి. అడవులను నరికిన దేశాలు కరవును అనుభవించాయి. పర్వతాలను పేల్చిన నాగరికతలు భూకంపాల భయాన్ని ఎదుర్కొన్నాయి. ప్రకృతి ప్రతీకారం తీర్చుకోదు. కానీ తన నియమాలను మాత్రం మార్చదు. ఈ నేపథ్యంలో యువత స్పందనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఒకప్పుడు రాజకీయాలు పెద్దల విషయం అనుకునేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. వాతావరణ మార్పులు, ఉపాధి, విద్య, సాంకేతికత, స్వేచ్ఛ ఇవి యువత భవిష్యత్తును నేరుగాప్రభావితం చేస్తున్నాయి. అందుకే వారు ప్రేక్షకులుగా ఉండటానికి సిద్ధంగా లేరు. వారు ప్రశ్నిస్తున్నారు. చర్చిస్తున్నారు. భాగస్వాములు కావాలని కోరుకుంటున్నారు. అయితే ప్రతి ఉద్యమానికి ఒకప్రమాదం కూడా ఉంటుంది. అది వ్యక్తి చుట్టూ తిరగడం. ప్రజాస్వామ్యంలో వ్యక్తులు ముఖ్యమే. కానీ వ్యక్తుల కంటే విలువలు ముఖ్యమైనవి. ఒక ఉద్యమం ఒక నాయకుడి జీవితంతో ముగియకూడదు. అది సమాజంలో ఆలోచనగా మిగలాలి. పర్యావరణం గురించి, ప్రజల భాగస్వామ్యం గురించి, బాధ్యతాయుతమైన పాలన గురించి చర్చలు కొనసాగాలి. అదే ఒక ఉద్యమం నిజమైన విజయం. మీడియా పాత్ర కూడా ఇక్కడ అత్యంత కీలకం. వార్తలను చెప్పడం మాత్రమే కాదు. ప్రజలకు వివిధ కోణాలను అందించడం కూడా మీడియా బాధ్యత. ఒక ఉద్యమాన్ని పొగడడమో, పూర్తిగా ఖండించడమో కాదు దాని వెనుక ఉన్న ప్రశ్నలను సమాజం ముందు ఉంచడమే ప్రజాస్వామ్య మీడియా ధర్మం. ప్రజలు అన్ని వాదనలు విని తమ అభిప్రాయాన్ని ఏర్పరచుకునే అవకాశం కల్పించాలి. ప్రభుత్వాలకు కూడా ఒక చారిత్రక బాధ్యత ఉంది. శాంతియుత నిరసనలను బలహీనతగా కాకుండా ప్రజాస్వామ్య శక్తిగా చూడాలి. విభేదాలను అణచివేయడం తాత్కాలిక నిశ్శబ్దాన్ని తెచ్చిపెట్టవచ్చు. కానీ సంభాషణ మాత్రమే శాశ్వత విశ్వాసాన్ని నిర్మిస్తుంది. ప్రజాస్వామ్యం అనేది గెలుపుఓటమి రాజకీయాల కంటే, పరస్పర విశ్వాసం మీద నిలిచే వ్యవస్థ. సోనం వాంగ్‌చుక్ ఉద్యమం చివరకు విజయం సాధిస్తుందా? కాలమే సమాధానం చెబుతుంది. కానీ ఈ ఉద్యమం ఇప్పటికే ఒక విజయాన్ని సాధించింది. అది లక్షలాది మందిని ఆలోచింపజేసింది. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతితో మన సంబంధం ఎలా ఉండాలి? యువత పాత్ర ఏమిటి? ప్రభుత్వ బాధ్యత ఎక్కడ ప్రారంభమై ఎక్కడ ముగుస్తుంది? అనే ప్రశ్నలను మళ్లీ మన ముందుంచింది. ●

# 'ఉచితాల' కోసం ఎన్ని తిప్పలో!

ఎన్నికల్లో లబ్ధిపొందడమే లక్ష్యంగా రూపొందుతున్న పథకాలు ఏలిన వారికి విజయం సాధించి పెట్టినా, ఆ వెంటనే అభాసుపాలు చేస్తున్నాయి. చిత్తశుద్ధికీ లక్ష్య సిద్ధికి లంగరు అందడం లేదు. అనర్హులకు చిక్కుతున్నాయి. ప్రభుత్వ ఖజానాలకు చిల్లుపెడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో ఏరాజకీయ పార్టీ అధికారంలోఉన్నా అవలంభించాల్సిన ఎన్నికల తంత్రం ఇదేనన్నట్లు చరిత్ర శిలాక్షరాలు రాసిపెట్టేసినట్లుంది. ఉచితాలనేవి తాత్కాలిక ప్రయోజనం ఆశించి గుప్పించే 'ఎర'మాత్రమే.అంతకన్నా వేరుగా విశ్లేషించలేం. కాలక్రమేణ అదే విషయం నిరూపితమవుతోంది. మహారాష్ట్రలో మహిళల కోసం మొన్న ఎన్నికలప్పుడు అమలు చేసిన సంక్షేమ పథకం ఇప్పుడు ఆ రాష్ట్ర కోశాగారానికి కన్నం పెట్టిందనే చెప్పాలి. అనర్హులకు తామరతంపరగా ఆర్థికలబ్ధి చేరిపోయింది.ఇదేదో కుడి ఎడమైతే పర్వాలేదని పరాకుగా తెచ్చినపథకంకాదు. కానీ మహా కోశాగారం ఖాళీ అయిపోయింది. మహారాష్ట్ర ప్రభుత్వం పేదమహిళల ఆర్థిక పరిపుష్టి కోసం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ముఖ్యమంత్రిమాఝీలాడ్కీ బహీన్ యోజన'లో వెలు గుచూసిన ఆరోపణలు, బడ్జెట్ ఉల్లంఘనలు, నకిలీ లబ్ధిదారుల ఉదంతం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో పారదర్శకత లోపిస్తే, ప్రజాధనం ఏ విధంగా దుర్వినియోగమవుతుందో తెలిపేందుకు ఈ ఘటన ఒక ఉదాహరణ. కాగ్ నివేదికతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర తనిఖీల్లో ఈ పథకంలో జరిగిన లోపాలు స్పష్టమయ్యాయి. ప్రాథమిక దశలో కఠినమైన భౌతిక తనిఖీలు లేకుండా కేవలం స్వీయ పత్రాల ఆధారంగా ఆదరబాదరగా నిధులు విడుదల వల్ల నకిలీ ఖాతాలు వెలిశాయి. నిరుపేద మహిళలకు నెలకు రూ.1,500 ఇచ్చే ఈపథకంలో సుమారు 14వేల మందికి పైగా పురుషులు మహిళలుగా నకిలీపత్రాలతోనమోదు చేసుకుని నిధులు పొందినట్లు తేలింది.దీనివల్ల సుమారు రూ.21.44 కోట్ల నిధులు పక్కదారి పట్టాయి. అర్హత లేకపోయినా దాదాపు 2,600 మందికి పైగా ప్రభుత్వ మహిళా ఉద్యోగులు (క్లాస్3, క్లాస్4) ఈ ఆర్థిక సహాయాన్ని అక్రమంగా పొందారు. దాదాపు 29వేల మంది పురుషులు, సుమారు 8వేల మంది ప్రభుత్వఉద్యోగులు అనర్హులు అయినప్పటికీ లబ్ధి పొందినట్లు తేలింది.నిధుల కేటాయింపుల్లో అనుమతించిన బడ్జెట్ కంటే దాదాపు రూ.3,541 కోట్ల మేర అదనపు వ్యయం జరిగిందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. ఈ స్థాయిలో అక్రమాలు జరగడానికి ప్రభుత్వ యంత్రాంగం,డిజిటల్ వ్యవస్థల్లో ఉన్న లోపాలే ప్రధాన కారణం. ఎంప్లాయ్ డేటాబేస్ , ఆధార్ సీడింగ్‌ను సరిగ్గా సరిపోల్చకపోవడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం సులభంగా లబ్ధిదారులుగా మారిపోయారు. లోపాలు బయటపడిన తర్వాత ప్రభుత్వం కఠిన తనిఖీలు చేపట్టి,ఆన్‌లైన్ ఈకెవైసి ప్రక్రియ ద్వారా దాదాపు 92లక్షల నకిలీ, అనర్హమైన ఖాతాలను తొలగించింది. అలాగే అక్రమంగా నిధులు పొందిన వారి నుండి రికవరీ చర్యలను ప్రారంభించింది. తొలగించబడిన లబ్ధిదారులు సుమారు రూ.14వేలకోట్లు అందుకున్నారు. ఈ ఘటన ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ పథకాలనిర్వహణపై అనేక సందేహాలను రేకెత్తిస్తోంది. ఎన్నికల సమయాల్లో హడావుడిగా తగినంత బడ్జెట్ అంచనాలు లేకుండాప్రవేశపెట్టే పథకాలు రాష్ట్ర ఆర్థికపరిస్థితిని దెబ్బతీస్తాయి. ఒకేసారి లక్షలాది పేర్లను తొలగించే క్రమంలో,డిజిటల్ పరిజ్ఞానం లేని కొందరు నిజమైన పేద మహిళలు కూడా ఈకెవైసి సమస్యల వల్ల ప్రయోజనాలు కోల్పోతున్నారనే ఆందోళన ఉంది. లడ్కీబహీన్ యోజన కింద నమోదు చేసుకున్న ప్రతి 10మంది మహిళల్లో దాదాపునలుగురిని తొలగించినట్లు ప్రభుత్వ రికార్డుల సమీక్షలో వెల్లడైంది. ఈపథకం నుండి 92 లక్షలకు పైగా లబ్ధిదారులను తొలగించారు. ఇది మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు బహిరంగంగా వెల్లడించిన సుమారు 80లక్షల తొలగింపులను మించిపోయింది. ఇలాంటి వాటిపై ఎన్నో చర్చోపచర్చలు జరుగుతాయి. కానీ ఫలితం శూన్యం. వారి కుటుంబాల వార్షిక ఆదాయం పథకం అర్హత గరిష్ట పరిమితి అయిన రూ.2.5లక్షలను మించిపోయినందున,దాదాపు 16లక్షల మంది లబ్ధిదారులను తొలగించారు.ధృవీకరణ సమయంలో మరో 4.42లక్షల మంది లబ్ధిదారులు, తాము గానీ లేదా తమ కుటుంబ సభ్యులలో ఒకరు గానీ ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నారని ప్రకటించారు. వీరిలో సుమారు3.6 లక్షల మంది ఇప్పటికే సంజయ్‌గాంధీ నిరాధర్ యోజన కింద సహాయం పొందుతుండగా, దాదాపు 2.5 లక్షల కేసులలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికంటే ఎక్కువ మంది లబ్ధి పొందుతున్నారు. రికార్డుల ప్రకారం, సుమారు 1.8 లక్షల మంది లబ్ధిదారులు 65ఏళ్ల గరిష్టఅర్హతా పరిమితి కంటే ఎక్కువ వయస్సుగలవారని,జిల్లా స్థాయి ధృవీకరణ సమయంలో దాదాపు 1.7లక్షల మందిని గుర్తించినట్లు వెల్లడైంది. ఈపథకం కింద, సంవత్సరానికి రూ.2.5 లక్షల కంటే తక్కువ సంపాదించే కుటుంబాలకు చెందిన 21నుండి 65 సంవత్సరాల మధ్యవయస్సు గల మహిళలు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా నెలకు రూ. 1,500 పొందుతారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు , కొన్ని ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారులను దీని నుండి మినహాయించారు. ధృవీకరణ ప్రక్రియలోని వివిధ దశలలో లబ్ధిదారులు సుమారు 10 నెలల పాటు సహాయం పొందారని అధికారులు తెలిపారు. కేవలం ఓట్ల లబ్ధికోసం వేగంగా నిర్ణయాలు తీసుకోవడం కాకుండా, బడ్జెట్ క్రమశిక్షణతో కూడిన పారదర్శక పాలన అందించడమే దీనికి ఏకైక పరిష్కారం.

ఇరవైయేళ్ల వయసుంటేనే యువకుడి కింద లెక్కకాదు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే వారే యువకులు.



థామస్ ఫుల్లర్

మహనీయుడు మరణాసన్న దశలో మామూలు మాటలు మాట్లాడినా అవి దైవ వాక్యాలుగానే పరిణమిస్తాయి.



లియో టాల్‌స్టాయ్

## ప్రజావాక్కు

### ప్రభుత్వ భూములాక్రమిస్తే జైలే గతి

ఈ మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబుప్రభుత్వ భూములు ఆక్రమిస్తే జైలే గతి అని ప్రకటించారు.అప్పుడే అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అటవీ భూములు ఆక్రమిస్తే తాట తీస్తాం అన్నాడు.. ఇద్దరి ప్రకటనలు చాలా బాగున్నాయి. అయితే అవి ఉత్తుత్తి ప్రకటనలుగానే మిగిలిపోయాయి అన్న అనుమానం వస్తుంది.ఎందుకంటే రాష్ట్రంలో దొంగ స్వాములు ప్రకాశంజిల్లాలో దొంగస్వామి, తిరుపతి జిల్లాలో కల్కి ఇద్దరు ప్రభుత్వ భూములు, దళితులభూములు, అటవీ భూములు అసైన్డ్ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో రకరకాలుగా మోసం చేస్తున్నారు. ప్రకాశం జిల్లాలోని దొంగస్వామి ఆక్రమించిన భూముల నుస్వాధీనం చేసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ 2021లో ఆదేశం ఇచ్చింది. ఇంతవరకు అతీగతీ లేదు.కల్కి వందలాదిఎకరాలు అసైన్డ్‌పేదల భూములుఆక్రమించి ఆశ్రమం నిర్మించాడు.కలెక్టరు ఖాళీచెయ్యమంటే కోర్టుకు వెళ్ళాడు. అటవీ భూమిలో కట్టేపుల్ల విరిస్తే జైల్లో పెడతాం అనే అటవీశాఖవారు కల్కి విషయంలో ఎందుకీ మౌనం?

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### విద్యార్థుల గురించి ఆలోచించాలి?

జిల్లా కేంద్రంలో ఉన్నకాలేజీలు,అందులో కొన్నిఆర్ట్స్ గ్రూపులు గ్రామాలకు తరలించడం అనే ప్రచారం జరుగుతుంది. జులై 31వరకు అడ్మిషన్లు ఇంకా కొనసాగుతున్నాయి. 40 సీట్లు భర్తీ కాలేదు. తగిన వసతులు లేవు. ట్రైబల్ విద్యార్థులు ఏజెన్సీ దూర గ్రామీణ ప్రాంతాల నుండి వస్తున్నారు. ఆగష్టు మొదటి వారంలో టెస్టులు నిర్వహించడం కోసం షెడ్యూల్ వచ్చింది. నోట్ బుక్స్, టెక్ట్స్‌బుక్స్,స్టడీమెటీరియల్,యూనిఫామ్‌లుఇంకారాలేదు. అరకొర వసతులతో ఎలా చదవడం ?గ్రామాలలో తగిన రవాణా వసతులు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతవిద్యలతో ఉద్యోగాలుపొందేఅవకాశం కలిపించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### రేషన్ కేవైసీ చేసుకోవాలి

రాష్ట్రంలోని రేషన్ కార్డు లబ్ధిదారులందరూ త్వరితగతిన రేషన్ కార్డులో పేరు కలిగిన అందరూ వేలిముద్ర ద్వారా ఈ కేవైసీ చేసుకోవాలి.రేషన్ కార్డు ఈ చేసుకోకపోతే రేషన్ నుండి పేరుతొలగించే అవకాశం లేకపోలేదు. కావునఅందరూ చేసుకుని పథకాలకు అర్హులుగా ఉండగలరని అధికారులు సూచిస్తున్నారు.

- ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### సరైన నిర్ణయం కాదు!

దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక సంస్థను ఏర్పాటు చేసుకోవడానికి, అన్యాయం జరిగినప్పుడు న్యాయం కోరడానికి,హక్కులు నిరాకరించబడినప్పుడు పోరాడేందుకు, అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి రాజ్యాంగం అందరికీ హక్కులను కల్పించింది. అందుకే 'నీట్'సహా వివిధ పోటీ పరీక్షలలో ప్రశ్నాపత్రాలు లీక్ కుంభకోణం, అవకతవకలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరుగుతున్నాయి. నీట్ పునఃపరీక్ష కారణంగా చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.తమపిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ప్రతిరోజూ కన్నీరు కార్చుతూ ఎంతో దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు.దీనికికారణం అవినీతిమయమైన విద్యా వ్యవస్థ కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్ సమంజసమైనదే.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం

### కరోనా నిజమేనా?

మెడికల్ మాఫియా లేక కరోనా అనేది నిజమా అని నిర్ధారణ చేసుకోలేని స్థితిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరోనా కేసులు నమోదు గురించి సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అధికారికంగా ఆంధ్రప్రదేశ్ వైద్యఆరోగ్యశాఖ, భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ లేదా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గాని ఎలాంటి ప్రకటన చేయలేదు. విజన్ కలిగిన ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిముందు జాగ్రత్త చర్యగా సోషల్ డిస్టెన్స్ పాటించే విధంగా లాక్‌డౌన్ ప్రకటించకుండా మహిళల ఉచిత బస్సు సౌకర్య ప్రయాణాన్ని రద్దు చేయాలి. ముఖ్యంగా కూరగాయలు చిరు వ్యాపారస్తులు స్నానపానాలు లేకుండా బస్సులు ఎక్కి మిగతా ప్రయాణికుల ఆరోగ్యంతో ఆటలాడుకుంటూ ఉన్నారు.ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు లేకుండా చేస్తే అంత రద్దీ ఉండదేమో ప్రభుత్వం ఆలోచించాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### పెరుగుతున్న పర్యావరణ సమస్యలు

వైశాల్యంలో దేశంలోనే కీలక నగరంగా ఉన్న విశాఖపట్నం నేడు తీవ్రమైన పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటోంది అని పలునివేదికలు తెలియచేస్తున్నాయి.ఇప్పటికే ఉన్న కాలుష్యానికితోడు, ప్రైవేట్‌రంగంలోని పోర్టు ను ండి వెలువడుతున్న కాలుష్యం గాజువాక, మల్కాపురం తదితరప్రాంతాలను పూర్తిగా కమ్మేయడం వలన ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు.విలీన ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సదుపాయాలు,వీధిలైట్లు,డ్రైనేజీవ్యవస్థ నేటికీఅధ్వాన్నంగా ఉన్నాయి.

-సి. రాజేందర్ , విశాఖపట్నం

# ఆదాయపు పన్ను.. ప్రజల ఆర్థిక బాధ్యత



రామ కిష్టయ్య సంగన భట్ల

భారత ఆర్థిక చైతన్యానికి సంకేతంగా నిలిచే జులై 24 ఆదాయపు పన్ను దినోత్సవం. ఇది కేవలం ఓ చట్టబద్ధమైన విధానం రోజు కాదు. ఇది ప్రజల ఆర్థిక బాధ్యతను, ప్రభుత్వానికి పౌరుల భాగస్వామ్యాన్ని, నైతికతను, పారదర్శకతను గుర్తుచేసే చైతన్య దినం. భారత దేశంలో ఆదాయపు పన్ను చట్టం మూలాలు బ్రిటిష్ కాలంలోకే వెళ్తాయి. 1857 సిపాయిల తిరుగు బాటుతో ఏర్పడిన ఆర్థిక లోటును తీర్చేందుకు 1860 జూలై 24న బ్రిటన్ ఆర్థిక మంత్రి సర్ జేమ్స్ విల్సన్ పర్యవేక్షణలో ఆదాయపు పన్ను విధానం రూపొందించబడింది. గవర్నర్ జనరల్ లార్డ్ కేనింగ్ మద్దతుతో తొలిసారిగా భారత దేశంలో ఆదాయపు పన్ను అమలులోకి వచ్చింది. ఈ చరిత్రాత్మక నిర్ణయం భారత ఆర్థిక పరిపక్వతకు నాంది పలికింది. ఈ చారిత్రికతకు గౌరవ సూచకంగా భారత ఆదాయపు పన్నుశాఖ 2010 నుంచి ప్రతి సంవత్సరం జూలై 24ను ఆదాయపు పన్ను దినంగా అధికారికంగా నిర్వహిస్తోంది.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పన్ను చెల్లింపుదారుల పట్ల కృతజ్ఞత ప్రకటిస్తూ అవగాహన కార్యక్రమాలు, సాంకేతిక శిక్షణలు, విజేతల సన్మానాలు నిర్వహించబడుతున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961నాటి చట్టం, ఇది 1962 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చింది. ఈచట్టం ప్రకారం వ్యక్తులు, కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు తమ ఆదాయానికి తగిన విధంగాపన్ను చెల్లించాల్సి ఉంటుంది. పన్ను వసూళ్లను పర్యవేక్షించే ఆదాయపు పన్ను శాఖ దీనిని నిష్టతో అమలు చేస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థలో ఆదాయపుపన్ను కీలకమైన వనరుగా నిలుస్తోంది. దేశానికి వచ్చే మొత్తం పన్ను ఆదాయంలో సగానికి పైగా ఆదాయపు పన్నుల ద్వారానేలభిస్తోంది.




2023-24 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే ఆదాయపు పన్నుల ద్వారా రూ.10లక్షల కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. ఈ ఆదాయంతోనే ప్రభుత్వం ఆరోగ్యం, విద్య, రక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు పెడుతోంది. పన్ను చెల్లించే వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఆదాయపు పన్ను శాఖ అనేక సంస్కరణలను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ఫేస్‌లెస్ అసెస్మెంట్ విధానం ద్వారా అవినీతి నివారణ, ఇఫైలింగ్ వేదిక ద్వారా సులభత, ప్రీఫిల్డ్ రిటర్న్లతో ప్రజలకు సమయాన్ని ఆదా చేసే మార్గం, డిజిటల్ చెల్లింపు పద్ధతుల ద్వారా పారదర్శకత పెరిగింది. అంతేకాక, ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని పన్ను చెల్లింపుదారుల అనుభవాన్ని మెరుగుపరచడం జరిగింది. పన్ను విధానంలో సామాజిక సమతుల్యతకూ ప్రాధాన్యం ఇచ్చారు. అధిక ఆదాయం కలిగిన వారు అధిక పన్నుచెల్లిస్తే, తక్కువ ఆదాయం కలిగినవారు మినహాయింపులను పొందే విధంగా వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఫలితంగా, సమాజంలోని బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయి.2023-24లో దేశవ్యాప్తంగా 8.2 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు నమోదయ్యారు. వారిలో 60శాతం పాత పన్నువిధానాన్ని ఎంచుకోగా, మిగిలిన వారు కొత్త పన్ను విధానాన్ని అనుసరించారు. ఇది ఆదాయ స్థాయిలను బట్టి వ్యక్తులు ఎంచుకునే స్వేచ్ఛను సూచిస్తుంది. ఇదే ప్రజల ఆర్థిక చైతన్యానికి నిదర్శనం. పన్ను చెల్లించడాన్ని నేరుగా చట్టబద్ధ కర్తవ్యంగా కాక, దేశానికి చేసే సేవగా భావించాల్సిన అవసరంఉంది. ప్రతి పౌరుడు తన ఆదాయానికి తగిన విధంగా పన్ను చెల్లిస్తే మాత్రమే సమాజంలో సమతుల్యత, అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆదాయపు పన్ను దినం అంటే కేవలం పన్ను చట్టాన్ని గుర్తు చేసే రోజు కాదు. ఇది ప్రజల ఆర్థిక బాధ్యతకు గుర్తుగా నిలిచే అవిశ్రాంత పిలుపు. ఈ సందర్భంగా పన్ను చెల్లించు - దేశాన్ని నిర్మించు అనే నినాదం ప్రజల మనసుల్లో నాటుకోవాలి. జూలై 24 - ఇది దేశాభివృద్ధిలో పౌర సహకారానికి ఒక నిశ్చల గుర్తింపు, భవిష్యత్ భారత నిర్మాణానికి ప్రజల నైతిక ఆర్థిక చింతనకు నిలిచే శాశ్వత పిలుపు. ●

# ఉపాధ్యాయుడే భవిష్యత్ మార్గదర్శి

తరిగోపుల నారాయణస్వామి

విద్య అనేది ఏ రాష్ట్రానికైనా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి పునాది. ఆ పునాదిని నిర్మించే ప్రధాన శిల్పి ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడు ప్రశాంతంగా, ఆత్మ విశ్వాసంతో, వృత్తిపరమైన గౌరవంతో పనిచేసినప్పుడే విద్యార్థి అభ్యసన ఫలితాలు మెరుగుపడతాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో నేడు అనేక మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుఎదుర్కొంటున్న పరిస్థితులను పరిశీలిస్తే, బోధన కంటేబోధనకు ఆటంకాలు ఎక్కువగా కనిపిస్తున్నాయనే భావన కలుగుతుంది. ఈ పరిస్థితి కేవలం ఉపాధ్యాయుని వ్యక్తిగత సమస్య కాదు, అది విద్యార్థి భవిష్యత్తు, పాఠశాల వాతావరణం, సమాజ అభివృద్ధితో ముడిపడి ఉన్న అంశం. ఒక ఉపాధ్యాయుని ప్రధాన బాధ్యత తరగతిగదిలో విద్యార్థులను బోధించడం. కానీ వాస్తవ పరిస్థితుల్లో బోధనేతర కార్యక్రమాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే అభిప్రాయం ఉపాధ్యాయుల్లో విస్తృతంగా వినిపిస్తోంది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు, నివేదికలు, డేటా నమోదు, ప్రత్యేక కార్యక్రమాలు, పరిపాలనా పనులు వంటి బాధ్యతలుబోధన సమయాన్నే ప్రభావితం చేస్తున్నాయని పలువురు ఉపాధ్యాయులు భావిస్తున్నారు. తరగతి గదిలో గడపాల్సిన సమయం కార్యాలయ సంబంధిత పనుల్లో గడిస్తే, విద్యార్థుల అభ్యసన నాణ్యతపై దాని ప్రభావం సహజంగానే ఉంటుంది.విద్యార్థి ముందు నిలబడే ఉపాధ్యాయుడు కేవలం పాఠ్య పుస్తకాన్ని బోధించే వ్యక్తి కాదు. ఆయన ఆలోచింపజేసే మార్గదర్శి. విలువలను నాటే వ్యక్తిత్వ నిర్మాత. అలాంటి బాధ్యతలను నిర్వర్తించాలంటే ఉపాధ్యాయునికి మానసిక ప్రశాంతత అత్యవసరం. అయితే నిరంతర పరిపాలనా ఒత్తిళ్లు, తరచూ మారే ఆదేశాలు, అదనపు బాధ్యతలు, అనిశ్చితి వంటి అంశాలు బోధనపై ప్రభావం చూపే అవకాశాన్ని విస్మరించలేం. ఇటీవలి కాలంలో యాభై సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయుల్లో కూడా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు సంబంధించిన ఆందోళనలు కనిపిస్తున్నాయి. అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులు మళ్లీ పరీక్షలకు సిద్ధం కావాల్సిన పరిస్థితి మానసిక ఒత్తిడిని పెంచుతుందని వారు భావిస్తున్నారు.జీవిత అనుభవం, బోధనా అనుభవం, కుటుంబ బాధ్యతలు, ఆరోగ్య సమస్యలు,వయస్సు వంటి అంశాల మధ్య పరీక్షలకు సిద్ధమవడం సులభం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నాణ్యమైనవిద్య లక్ష్యం ఎంత ముఖ్యమో, ఆలక్ష్యాన్ని అమలు చేసే విధానంలో మానవీయ కోణం కూడా అంతేముఖ్యమనే చర్చ అవసరం. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత ఉపాధ్యాయుల్లో కేటాయింపులపై ఏర్పడిన అనిశ్చితి కూడా చాలామందిలో ఆందోళనకు కారణమైంది. ఏ జిల్లాలో సేవలు కొనసాగుతాయో తెలియని పరిస్థితి కుటుంబ జీవితం, పిల్లల చదువులు, వృద్ధుల సంరక్షణ వంటి అనేక అంశాలను ప్రభావితం చేస్తుంది. ఉపాధ్యాయుడు పాఠశాలలో చిరునవ్వుతో కనిపించినా, మనసులో అనిశ్చితి ఉంటే అది బోధనలో ప్రతిఫలించే అవకాశం ఉంటుంది. ఆర్థిక అంశాలు కూడా ఉపాధ్యాయుల మనోధైర్యంపై ప్రభావం చూపుతాయి. పెండింగ్ డీఏలు, వేతన సవరణ ఆలస్యం, ఇతర ఆర్థిక అంశాలపై ఉపాధ్యాయ సంఘాలు తరచూ తమ ఆందోళనలను వ్యక్తం చేస్తున్నాయి. ఆర్థిక భద్రత ఉద్యోగ సంతృప్తికి ఒక ముఖ్యమైన ఆధారం. కుటుంబ అవసరాలు,పిల్లల ఉన్నత విద్య, వైద్య ఖర్చులు, ద్రవ్యోల్బణం వంటి పరిస్థితుల్లో ఆర్థిక అనిశ్చితి ఉద్యోగి మానసిక ప్రశాంతతను ప్రభావితం చేయవచ్చు. ఆర్జిత సెలవులు మంజూరులో ఆలస్యం లేదా పరిమితులపై కూడా ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విశ్రాంతి అనేది విలాసం కాదు, అది వృత్తి సామర్థ్యాన్ని నిలబెట్టే అవసరం. శారీరకంగా, మానసికంగా పునరుత్తేజం పొందిన ఉపాధ్యాయుడే తరగతి గదిలో ఉత్సాహంగా బోధించగలడు. ఆదివారాలు, పండుగ సెలవులు, ఇతర విశ్రాంతి రోజుల్లో కూడా అధికారిక కార్యక్రమాలకు హాజరు కావాల్సి వస్తోందని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. కుటుంబంతో గడపాల్సిన సమయం తగ్గిపోతే కుటుంబ బంధాలపై ప్రభావం పడుతుంది. ఉపాధ్యాయుడు కూడా ఒక కుటుంబ సభ్యుడే. ఆయనకు కూడా వ్యక్తిగత జీవితం ఉంటుంది. వృత్తి, కుటుంబం మధ్య సమతుల్యత కోల్పోతే ఉద్యోగంపై ఆసక్తి తగ్గే ప్రమాదం ఉంది. పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం అవసరమే. కానీ అదే సమయంలో మిగతా తరగతుల విద్యార్థుల అభ్యసన కూడా సమానంగా ముఖ్యమే. ప్రారంభ తరగతులలో బలమైన పునాది ఏర్పడకపోతే పదో తరగతిలో మంచి ఫలితాలు ఆశించడం కష్టమే. కాబట్టి విద్యా విధానం మొత్తం పాఠశాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకోవాలి. ఒకే తరగతిపై అధిక దృష్టి కేంద్రీకరిస్తే మిగతా తరగతుల అభ్యసనలో ఖాళీలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. విద్య అనేది పరీక్షల కోసం మాత్రమే కాదు. జీవితాన్ని నిర్మించడానికి. పరీక్షలు అవసరమే కానీ పరీక్షలే విద్యకు కేంద్రబిందువుగా మారకూడదు. విద్యార్థిలో ప్రశ్నించే స్వభావం, సృజనాత్మకత, సహకార భావం, విలువలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించడమే అసలు విద్య లక్ష్యం. ప్రభుత్వ పాఠశాలలపై సమాజం నమ్మకం పెరగాలంటే మొదట ఉపాధ్యాయుడిపై వ్యవస్థ నమ్మకం చూపాలి. ప్రతిసమస్యకు ఉపాధ్యాయుడినే బాధ్యుడిగా చూడకుండా, ఆయనకు అవసరమైన వనరులు, సమయం, శిక్షణ,మానసిక భరోసా, పరిపాలనా సహకారం అందించడం మరింత ప్రయోజనకరం. ఉపాధ్యాయుడు భాగస్వామి, కేవలం ఆదేశాలు అమలు చేసే ఉద్యోగి మాత్రమే కాదు. విద్యా విధానాల రూపకల్పనలో తరగతి గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుల అనుభవాలను కూడా వినాలి. పాఠశాల వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకుంటే అమలు సులభమవుతుంది. పైస్థాయిలోరూపొందిన విధానాలు నేలస్థాయిలో ఎలాపని చేస్తున్నాయో నిరంతరం సమీక్షించడంఅవసరం.ఉపాధ్యాయుడి మనసు ప్రశాంతంగా ఉంటే తరగతి గది సృజనాత్మకంగా మారుతుంది. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

## తిరుమల సమాచారం

### 31న టిటిడి ఖాళీ గోనె సంచుల ఇ-వేలం



**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలవేంకటేశ్వరస్వామి ఆలయంతో బాటు టిటిడి అనుబంధ ఆలయాల్లో వినియోగించిన ఖాళీ గోనె సంచులను ఇ వేలం వేయనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి 2027 మార్చి 31 వరకు "రేట్ కాంట్రాక్ట్" ప్రాతిపదికన విక్రయించేందుకు ఈనెల 31న ఇ వేలం నిర్వహించనున్నట్లు టిటిడి తెలిపింది. ఈ వేలంలో పాల్గొనదలచిన ఆసక్తిగల వ్యక్తులు, సంస్థలు ఈనెల 30వ తేదీ సాయంత్రం లోపు కొనుగోలు పోర్టల్ ద్వారా 30వేల రూపాయలు ఇఎండీ చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.ఈ వేలానికి సంబంధించిన పూర్తి వివరాలను హెచ్‌టిటిపిఎస్://కొనుగోలు.ఎపి.జివొవి.ఇన్" వెబ్‌సైట్ ను సందర్శించవచ్చు. అదనపు సమాచారం కోసం టిటిడి జనరల్ మేనేజర్ (వేలాలు) కార్యాలయాన్ని 0877-2264429 నంబర్‌లో సంప్రదించగలరు.

### శ్రీవాణి బ్రేక్ భక్తులకు తిరుమలలో లాంజ్

**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొం డలవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులతోబాటు ప్రతిరోజూ శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనానికి విచ్చేస్తున్న 1,500మంది భక్తులకు సులభంగా విశ్రాంతి తీసుకునేలా లాంజ్ ఏర్పాటుచేయాలని టిటిడి భావిస్తోంది. విమా నాశ్రయంలో ప్రయాణీకులు వేచివుండే లాంజ్‌లా తిరుమలలోనూ శ్రీవాణి భక్తులకు కల్పించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పరిశీలించారు. ఉదయం టిక్కెట్‌లు అందుకునే భక్తులేగాక ముందుగా ఆన్‌లైన్‌లో విడుదలైన ఈ దర్శన టిక్కెట్లతో వస్తున్న భక్తులకు గదులు సమకూర్చడం కొంత క్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ఉదయం నుండి సాయంత్రం 4గంటల వరకు దర్శనానికి వెళ్ళే వరకు ఈ భక్తులు ఎక్కడ విశ్రాంతి తీసుకోవాలనేది సమస్యగా మారింది. శ్రీవాణి భక్తుల కోసం నూతన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం శ్రీవాణి దర్శన టికెట్లు మూడు నెలల ముందు 500 ఆన్ లైన్‌లో ,ప్రతి రోజు 500 కరెంట్ బుకింగ్ ఆన్‌లైన్‌లో, మరో 300 గతంలో విరాళాలిచ్చి టికెట్లు పొందని వారి కోసం కేటాయిస్తున్నారు. మరో 200 టికెట్లు రోజూ తిరుపతి విమా నాశ్రయంలో ఆఫ్ లైన్‌లో ఇస్తున్నారు. ఈ టికెట్లు పొందిన భక్తులకు గదులు కేటాయిస్తున్నారు. కరెంట్ బుకింగ్ లో టికెట్లు పొందిన వారికి అదే రోజు సాయంత్రం 4 గంటలకు టిటిడి దర్శనం కల్పిస్తోంది. ఉదయం 9 గంటలకు టికెట్లు తీసుకున్న భక్తులు సాయంత్రం 4 గంటల వరకు వేచి ఉండాల్సి వస్తోంది. వారికి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విమా నాశ్రయం తరహాలో శ్రీవాణి భక్తులు వేచి ఉండేందుకు లాంజ్ నిర్మాణం చేయాలని ఆలోచన చేస్తున్నారు. రానున్న టిటిడి బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలు తయారుచేసి ఆమోదించే అవకాశం ఉంది.

### భవిష్యత్తులో ఇలాంటి అపచారాలు పునరావృతం కాకుండా చర్యలు: మంత్రి ఆనం

**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల మొదటిఘాట్ రోడ్డులోని 7వ మైలు వద్ద ఇంజనేయస్వామి ఒక అడుగు విగ్రహ అపహరణకేసును కొన్ని గంటల్లోనే తిరుమల పోలీసులు చేదించడం అభినందనీయమని రాష్ట్రదేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు దేవాలయాల వద్ద భద్రతను పటిష్ఠం చేయాలని ఆయన ఆదేశాలిచ్చారు. పక్కా ప్రణాళికతో వేగవంతమైన దర్యాప్తు జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో బాటు, స్వామి విగ్రహాన్ని సురక్షి తంగా స్వాధీనం చేసు కోవడం పోలీసుల సమర్థతకు, అంకితభావానికి నిదర్శనమని ఆయన కొనియాడారు.తిరుమల వంటి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రాల్లో భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాల్సి న అవసరం ఎంతైనా ఉందని మంత్రి అన్నారు. తిరుమలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లను తక్షణమే పటిష్ఠం చేయాలని సంబంధిత దేవాదాయ, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణాల్లో సిసిటీవీ నిఘాను నిరంతరం పర్యవేక్షించాలని, భద్రతా సిబ్బంది గస్తీని పెంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. దేవతా విగ్రహాలను అపహరించడం,ఆలయ ఆస్తులు, సెంటిమెంట్లతో ఆడుకునే దుశ్చర్యలకు పాల్పడే వారిపై కూటమి ప్రభుత్వం అత్యంత కఠినమైన వైఖరిని అవలంబిస్తుందని మంత్రి హెచ్చ రించారు. కోట్ల మంది భక్తుల నమ్మకాలకు, భావోద్వేగాలకు భంగం కలిగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని తేల్చిచెప్పారు. భవి ష్యత్తులో ఏ పుణ్యక్షేత్రంలోనూ ఇలాంటి అపచారాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



### శాస్త్రోక్తంగా ఆంజనేయవిగ్రహం పునఃప్రతిష్ఠ

**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు వద్ద ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సమీపంలో చోరీకి గురైన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని గురువారం ఉదయం యథావిధిగా శాస్త్రోక్తంగా పునఃప్రతిష్టాపన చేశారు. ఇక్కడ పూజలందుకునే విగ్రహాన్ని చోరీ చేసిన విషయం విదితమే. పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో టిటిడి అర్చకులు తిరిగి అంతే వేగంగా పునఃప్రతిష్ఠించే పనులు చేపట్టారు. టిటిడి ఆగమ సంప్రదాయాల ప్రకారం పుణ్యాహ వచనం, జల సంప్రోక్షణం తదితర శాస్త్రోక్త క్రతువులు నిర్వహించి, గురువారం ఉదయం అదే ప్రదేశంలో విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించినట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. ఈ ఘటనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సిసి కెమెరాల నిఘా, విజిలెన్స్ సిబ్బంది అప్రమత్తత, జిల్లా పోలీసులతో సమన్వయం కారణంగా అత్యంత తక్కువ సమయంలో నిందితుడిని గుర్తించి విగ్రహాన్ని తిరిగి తీసుకురావడం సాధ్యమైందని అదనపు ఇఒ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఘాట్ రోడ్డులోని చిన్న దేవాలయాలు, విగ్రహాలకు రక్షణగా గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో పాటు మరింత నాణ్యమైన సిసి కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి ్మ,తిరుమల ఎఎస్పీ రామకృష్ణ,విఎస్ఒ సురేంద్ర, ఇతర అధికారులు,అర్చకులు పాల్గొన్నారు.

### విగ్రహం మాయం వెనుక భూమన హస్తం
#### జనసేన నేత కిరణ్ రాయల్ సంచలన వ్యాఖ్యలు



**తిరుపతి,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్న తిరుమల ఘాట్‌లో ఏడవమైలు వద్ద ఆంజనేయస్వామి విగ్రహాన్ని చోరీచేసుకెళ్ళిన ఘటన వెనుక వైసిపి నేత భూమన హస్తం ఉందని జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి నేత కిరణ్‌రాయల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుమల నడక మా ర్గంలో విగ్రహ మాయంపై భూమన అనవసర రార్థాంతం చేశాడని,ఆవిగ్రహం మాయం చేయడం వెనుక భూమన హస్తం ఉందన్న అనుమానం ఉందని ఆరోపణలు చేశారు. 2019 -24మధ్య వైసిపి హయాంలో భూమన తిరుపతి పరిసరాల్లో భారీగా భూకబ్జాలకు పాల్పడ్డారని, 1వందకోట్ల విలువచేసే భూ ములను కబ్జా చేశారని ఆరోపించారు. తిరుపతి పరిసరాల్లోని మంగళం, తిరుచానూరులో 16ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించారని కిరణ్‌రాయల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో భూమన బాధితులు చాలా మంది ఉన్నారని, భూమన బాధితులు ముందుకు రండి భూకబ్జాకు పాల్పడలేదని భూమన ఇప్పుడు ప్రమాణం చేయగలడా..? అని ప్రశ్నించారు.

## క్వాంటం పరిశోధనలకు అమరావతి అత్యుత్తమం
### సిఎం చంద్రబాబుతో క్వాంటినమ్ టెక్నాలజీస్ సిఇఒ రాజీబ్ హజ్రా భేటీ



సీఎం చంద్రబాబుతో భేటీ అయిన క్వాంటినమ్ టెక్నాలజీస్ సీఈఓ రాజీబ్ హజ్రా

**విజయవాడ, జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రాష్ట్ర, దేశాభివృద్ధికి తోడ్పడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్ టెక్నాలజీగా క్వాంటం కంప్యూటింగ్ రంగాన్ని గుర్తించి అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం పని చేయటం ప్రారంభిస్తుందని, ఇప్పటికే క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీలు ఏపీలో పని ప్రారంభించాయని వెల్లడించారు. అంతర్జాతీయస్థాయి ఫుల్‌స్టాక్ క్వాంటం కంప్యూటింగ్ కంపెనీ క్వాంటినమ్ సంస్థ సీఈఓ రాజీబ్ హజ్రా సహా ఆ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అమరావతి క్వాంటం వ్యాలీని క్వాంటం ఇన్నోవేషన్ సహా పరిశోధనలు తదితర అంశాల్లో కీలకమైన హబ్ గా తయారు చేసేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో క్వాంటినమ్ సంస్థ సీఈఓ చర్చించారు. జాతీయ క్వాంటం మిషన్ కు అనుగుణంగా ప్రపంచస్థాయి ఎకోసిస్టంను అభివృద్ధి చేసేందుకు ఏపీతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు క్వాంటినమ్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. క్వాంటం నైపుణ్యాలు, ఏఐ ఎనెబుల్డ్ క్వాంటం అప్లికేషన్లు, అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ రీసెర్చి, స్టార్టప్ ఇంక్యుబేషన్ టెక్నాలజీలపై పనిచేయాలని సీఎం సూచించారు. గతంలో ఐటీని ప్రోత్సహించామని ఇప్పుడు ఏఐ, క్వాంటం టెక్నాలజీల ద్వారా వేగంగా సమస్యలకు పరిష్కారం అందించాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. క్వాంటం పరిశోధనలకు ఏపీ అమరావతి అత్యుత్తమ ప్రాంతమని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీలో క్వాంటం కంప్యూటర్ పరికరాల ఉత్పత్తితో పాటు అల్గారిథమ్స్ వరకూ సహకారం అందించేందుకు తాము సిద్ధమని క్వాంటినమ్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఉపాధ్యక్షుడు సీతారామకృష్ణ, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.

### గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో
## నీటి సమస్యలకు చెక్: మంత్రి పార్థసారధి




మంత్రి పార్థసారధి, కమిషనర్ విశ్వనాథన్

**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** గోదా వరి, కావేరి నదుల అనుసంధానంతో మంచి, సాగునీటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని రాష్ట్ర సమాచార,పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురు వారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి వెల్లడించారు. క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పలు సమస్యలపై దిశానిర్దేశం చేశారని ముఖ్యంగా ఎల్ నినో ప్రభావంతో రైతులు సాంప్రదాయ పంటలు వేయటం వల్ల సకాలంలో సాగు నీరు అందక పోతే నష్టపో తారన్న అభిప్రాయం ముఖ్యమంత్రి వ్యక్తం చేశారని తెలిపారు.ఈ ఏడాది ఎల్ నినో ప్రభా వం ఆగస్టు తరువాత మరింత తీవ్రంగా ఉం డనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు.ఈ ఏడాది సాధారణం కంటే 51 శాతం కంటే ఎక్కువగా వర్షపాతం తగ్గుదల ఉంటుందని, దీంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున రైతులు ఈ ఏడాది నీటి ఎద్దడిని ఎదుర్కొనే ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపాలని తద్వారా ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం నుండి తప్పించుకోవచ్చని సూచిం చారు. అంతేకాకుండా భూగర్భ జలాలు సైతం అడుగంటే ప్రమాదం పొంచి ఉందని హెచ్చ రించారు.బోర్లు వేసి వ్యవసాయం చేద్దాం అనే ఆలోచనను రైతులు చేయవద్దని కోరారు.దీంతో భూగర్భ జలాలు మరింత అటుగంటే ప్రమాదం పొంచి ఉందని మంత్రి పార్థసారథి అన్నారు. పోలవరం వద్ద గోదావరి నది ప్రతి ఏడాది ఈ సమయానికి దాదాపు లక్ష క్యూసెక్కుల వరద నీరు ప్రవహించేదని కాని ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడటంతో ఈ ఏడాది కేవలం 35 నుండి 38వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే ప్రవహిస్తోందని దీంతో గోదావరి,కృష్ణా పరివాహక ప్రాంతాల్లో సాగు నీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఒక వేళ మంచి వర్షాలు పడితే మంచిదే కాని ఎల్ నినో ప్రభావం పై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోదావరి, కృష్ణా జలాలతో సాగు చేసే రైతులు ఇప్పటికే 70శాతం మంది రైతులు నాట్లు వేశారని, కాని ఇప్పటి వరకు నాట్లు వేయని రైతు లు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంపై కేం ద్రం సానుకూ లంగా ఉండటం హర్షనీయమన్నారు. నదుల అనుసంధానం తెలంగాణా,ఏపి,తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉం టుందని, అంతే కాకుండా ఈ నాలుగు రాష్ట్రా ల్లోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరు తుందని ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నా రన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్ గా నిలవనుందని, ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమానా శ్రయాన్ని ప్రారంభించ నున్నారని మంత్రి పార్థసారథి తెలిపారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రభు త్వం సిద్ధం చేస్తోందన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సం చాలకులు కెఎస్.విశ్వనాధన్ పాల్గొన్నారు.

### రూ.5,092కోట్లతో ట్రాన్స్‌కో గ్రిడ్ బలోపేతం
#### ప్రాజెక్టుల పురోగతిపై విజయానంద్ సమీక్ష



**విజయవాడ, జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ప్రసార వ్యవస్థను మరింత బలోపేతం చేసి, అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీట్రాన్స్‌కో చేపడుతున్న 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ ఎక్స్‌ట్రా హై వోల్టేజ్ ప్రసార ప్రాజెక్టుల పురోగతిపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపిట్రాన్స్కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ , డైరెక్టర్లు ఏ వి కె భాస్కర్, జీవి రావు, వెంకట రమణ మూర్తి, సీ ఈలు, యస్‌ఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉన్న ప్రాజెక్టుల పురోగతి, రానున్న పెట్టుబడులు, భవిష్యత్ కార్యాచరణ, కీలక ప్రసార మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రూ.5,092 కోట్ల అంచనా వ్యయంతో 60 ప్రధాన ప్రసార ప్రాజెక్టులు వివిధ దశల్లో అమలులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రానికి అదనంగా 14,296 ఎంవీఏల ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యం, 1,760 సర్క్యూట్ కిలోమీటర్ల ప్రసార లైన్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. దీంతో విద్యుత్ ప్రసార సామర్థ్యం మరింత పెరగడంతో పాటు ప్రాంతాల మధ్య గ్రిడ్ అనుసంధానం బలోపేతమై, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా, విశ్వసనీయంగా మారనుందని వివరించారు. త్వరలో పూర్తి కానున్న ప్రాజెక్టులపై కూడా విజయానంద్ సమీక్ష నిర్వహించారు. రూ. 3,507 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 36 ప్రధాన ప్రసార ప్రాజెక్టులు (400 కేవీ, 220 కేవీ, 132 కేవీ) రానున్న ఆరు నెలల్లో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయని తెలిపారు.



నవమల్లెతీగను ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

### సామాజిక ప్రయోజనమే సాహిత్యానికి హేతువు: మంత్రి సవిత

**విజయవాడ,జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక ప్రయోజనమే సాహిత్యానికి హేతువుగా నిలవాలని ఏపీ చేనేత,జౌళి,హస్తకళలు,బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు.ఏ ప్రక్రియలో రాసినప్పటికి సాహిత్యం జనజాగృతంగా ఉండాలన్నారు.సమకాలీన పరిస్థితులతో పాటుగా,గతాన్ని గుర్తు చేస్తూ, వర్తమానంలో చోటు చేసుకున్న అవగతం చేసుకుంటూ రేపటి తరానికి మంచి వారధిని నిర్మించే దిశలో రచనలు ఉండాలన్నారు.రచయిత,రచయిత్రి స్వేచ్ఛగానే తమ భావవక్తీకరణ చేయాలని, అయితే ఇతరుల భావోద్వేగాలకు భంగం కలిగించకూడదన్నారు. కలిమిశ్రీ సంపాదకత్వంలో నవమల్లెతీగ శత సంచికని ఏపీ సచివాలయంలో సవిత ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రముఖ చిత్రకారుల ముఖచిత్రాలతో ఇలాంటి ప్రత్యేక సంచికలు వెలువరించేవన్నారు. ప్రచురణలు కనుమరుగవుతున్న నేటి కాలంలో ప్రత్యేక సంపుటికి తీసుకురావడం గొప్ప సాహసమన్నారు. సాహిత్యాన్ని ప్రధానంగా చేసుకుని సాహితీవేత్తలతో పాటు యువతను, మహిళలను అన్నిరకాల పాఠకుల్ని ఆకట్టుకునే విధంగా పత్రికను రూపొందిస్తున్న సంపాదకులను అభినందించారు.

## జొన్నగిరి ఇకపై 'స్వర్ణగిరి' గోల్డ్ మైన్స్
### అధికారికంగా పేరు మార్చిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ, జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు జిల్లాలోని జొన్నగిరి గోల్డ్ మైన్ పేరును రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'స్వర్ణగిరి గోల్డ్ మైన్'గా మార్చింది. జొన్నగిరి గోల్డ్ మైన్ పేరును అధికారికంగా మార్చాలని రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి చేయగా ఆ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. ఇకపై మైనింగ్ ప్లాన్‌లు, చట్టపరమైన అనుమతులు, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ , పర్యావరణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ తదితర అధికారిక రికార్డుల్లో కూడా స్వర్ణగిరి గోల్డ్ మైన్' పేరును నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.దేశంలో స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రైవేట్ రంగంలో ఏర్పాటైన తొలిబంగారు గనిగా గుర్తింపు పొందిన ఈ గని భవిష్యత్తులో ప్రముఖ బంగారం ఉత్పత్తి కేంద్రంగా ఎదిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. కర్నూలుజిల్లా తుగ్గలి మండలం పరిధిలోని పగిడిరాయి, జొన్నగిరి, ఎర్రగుడి గ్రామాల సరిహద్దుల్లో ఈ బంగారు గని విస్తరించి ఉంది. మొత్తం 597.820 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఈ గనిలో ప్రధానంగా బంగారాన్ని వెలికితీస్తున్నారు. దీంతో పాటు వెండి, రాగి, సీసం, జింక్ వంటి ఇతర ఖనిజాలనుకూడా తవ్వుతున్నారు.బంగారం వెలికితీత కోసం జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రభు త్వం 30 సంవత్సరాల మైనింగ్ లీజును మంజూరు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈయేడాది జూన్‌లో గనిని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ ప్లాంట్‌లో వాణిజ్య బంగారం ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించారు.

### ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి: మంత్రి గొట్టిపాటి



**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి త్వరలోనే ఒక అంత ర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేసారు. త్వరలోనే ఇక్కడ భారీ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో పాటు ప్రముఖ కళాశాలలు ఏర్పాటు కాబోతున్నాయని వెల్లడించారు. అమరావతిలో భవనాల నిర్మాణాలు అద్భు తంగా సాగుతున్నాయని, భవిష్యత్తులో ఇది అత్యంత అద్భుతమైన నివాస యోగ్యమైన నగరంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఐకానిక్ భవనాలకు సంబంధించిన మొదటి డైమండ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి 12 ఫ్లోర్లు సిద్ధమవుతాయని ప్రకటించారు. రాజధాని విషయంలో వైసీపీ అధినేత జగన్ అనవసర గందరగోళం సృష్టిస్తూ ప్రజలను తికమక పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. జగన్ కనీసం ఒక్కసారైనా నేరుగా వచ్చి అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లారా చూడాలని హితవు పలికారు. రాజధాని నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రైతుల చలవ వల్లే ఈరోజు అమరావతిలో ఇంతటి భారీ నిర్మాణాలు సాధ్యమ వుతున్నాయని మంత్రి కొనియాడారు. వారి త్యాగాలను కూటమి ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు.

### మాజీ మంత్రి అప్పలరాజు అరెస్టుతో
## పలాస-కాశీబుగ్గలో ఉత్కంఠ
#### 144 సెక్షన్ అమలు, పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రహదారులన్నీ దిగ్బంధం
#### పేరాడ తిలక్‌పై పోలీస్ కేసు నమోదు

**పలాస (శ్రీకాకుళం జిల్లా), జులై 23 ప్రభాతవార్త :** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ఇంగిలిగాం పారిశ్రామిక వాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని కూడా రాజకీయ కక్ష సాధింపు కోసం ఆయుధంగా మార్చుకునే స్థాయికి కూటమి ప్రభుత్వం దిగజారిపోయిందనే ఆరోపణలు పలాస నియోజక వర్గం వైసిపి శ్రేణుల్లో వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజు రెండవ కుమారుడు 18 యేళ్ల అరవ్ వర్మ ద్విచక్ర వాహనం నడుపుతూ రోడ్డు ప్రమా దానికి కారకుడయ్యాడన్న ఆరోపణలపై రోడ్డు ప్రమాదానికి సంబంధించిన సెక్షన్లు కాకుండా, ఏకంగా హత్యానేరం అభియోగాలు మోపి అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించడం జరిగింది. అయితే అదే కేసులో ఏ3 ముద్దాయిగా ఉన్న డా. సీదిరి అప్పలరాజును బుధవారం రాత్రి అరెస్టు చేయడం చూస్తే ఒక మత్స్యకార వైసీపీ నాయకుడి కుటుంబాన్ని రాజకీయంగా వేధించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా మారిందని ఈ సంఘటనతో తేటతెల్లమైందని వైసిపి నాయకులు పేర్కొంటున్నారు. మరి టీడీపీ నాయకులు, మంత్రులు, వారి కుటుంబ సభ్యులు, అనుచరుల వలన జరిగిన రోడ్డు ప్రమాదాలన్నింటికీ ఇదే సిద్ధాంతం వర్తింపజేస్తారా..? అని వైసీపీ శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నాయకులను కేసుల్లో ఇరికించి వారి గొంతునొక్కాలన్నదే ఈ అరెస్టుల వెనుక కనిపిస్తున్న కుట్ర అని పలువురు పేర్కొంటున్నారు.

**వైసిపి నాయకుడు పేరాడ తిలక్ అరెస్ట్ :** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించిన సందర్భంగా బుధవారం రాత్రి సుమారు 2 గంటలకు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజు అరెస్టును నిరసిస్తూ కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వద్ద వైసీపీ పార్టీ కి చెందిన పేరాడ తిలక్ మరి కొంత మంది అనుచరులతో కలిసి నినాదాలు చేస్తూ మానవహారం నిర్వహించి సాదారణ ప్రజానీకం రాకపోకలను అడ్డుకొన్నారు. ఈ సమయంలో అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది మానవహారం చేయవద్దని తెలిపారు. అయితే అక్కడ నుండి తప్పుకోమని పోలీసులను బెదిరించి వారి విధులకు ఆటంకం కలిగించడం వలన విధులలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ వైసీపీ నాయకులు తమ విధులకు ఆటంకం కలిగించారని పేరాడ తిలక్, అతని అనుచరులు కొంత మందిపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో



ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి వైసీపీ నేత పేరాడ తిలక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.

పలాసలో 144 సెక్షన్ అమలు: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అరెస్ట్ కు నిరసనగా పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు చర్యగా కాశీబుగ్గ పోలీసులు 144 సెక్షన్ ను అమలు చేశారు. ఎమర్జెన్సీని తలపించే విధంగా పోలీస్ స్టేషన్ కు వెళ్లే రహదారులలో బారికేడ్లు పెట్టి భారీగా పోలీసు లను మోహరించారు. దీని వలన ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. కాగా రాత్రి అదుపులోకి తీసుకున్న డాక్టర్ అప్పలరాజును గురువారం 12 గంటల వరకు పోలీస్ స్టేషన్ లోనే ఉంచారు. ఈ సమాచారం తెలుసుకున్న వైసిపి పార్టీ శ్రేణులు పోలీస్ స్టేషన్ కు తరలి వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. డాక్టర్ అప్పలరాజుకు వైద్య పరీక్షలు అనంతరం పలాస కోర్టు కు తీసుకువెళ్లి సబ్ జడ్జి ముందు హాజరు పరిచారు.

### కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎన్డీయే పక్షాల నిరసన

**విశాఖపట్నం, జులై 23:** న్యూఢిల్లీ పార్లమెంట్ భవన ప్రాంగణంలో ఎన్డీయే కూటమికి మద్దతుగా, కాంగ్రెస్ పార్టీ వైఖరికి నిరసనగా పలువురు ఎంపీలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తెలుగుదేశం పార్టీ తరపున రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం మోసపూరిత వైఖరితో దేశంలోని యువతను పక్కదోవ పట్టిస్తోందని, వారి భవిష్యత్తుతో ఆడుకుంటోందని ఎంపీలు మండిపడ్డారు. ఎన్డీయే పక్షాల ఎంపీలతో కలిసి రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ నిరసన తెలపడమే కాకుం డా, యువతను వంచి స్తున్న కాంగ్రెస్ పాలసీ లను తీవ్రంగా నిరసిం చారు.దేశ ప్రయోజ నా లు, యువత సంక్షే మం దృష్ట్యాఎన్డీయే ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.



## నేడు పోలవరం జిల్లాకు సిఎం చంద్రబాబు
#### యం.పి.టి.యం సమావేశ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**పోలవరం జిల్లా ప్రతినిధి జులై 23 ప్రభాత వార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు పోలవరం జిల్లాలో(రంపచోడవరం )లో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన పురస్కరించుకొని మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. హెలిప్యాడ్, యం. పి. టీ. యం సమావేశం నిర్వహించే పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, సి. యం. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్వరావు,జె. సి. ప్రశాంత్ కుమార్,రంపచోడవరం ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష దేవి, మఠం విజయ్ భాస్కర్,ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఎంస్ చైర్మన్, రంపచోడవరం పరిశీలకులు కోట్ని బాలాజీ, అరకు పార్లమెంట్ టీ డి పి అధ్యక్షురాలు తేజవతి, మాజీ యం యల్ ఏ బాబురామేష్,సుభాని, పెద్దిరాజు తదితరులు ఉన్నారు.



# జి.ఓ నం.3ని పునరుద్ధరిస్తాం

## గిరిజనుల ప్రయోజనాలు పరిరక్షిస్తాం: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



**విజయవాడ,జూలై 23,ప్రభాతవార్తప్రతినిధి:** గిరిజన హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా బలమైన చట్టం తీసుకొస్తామని ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. గిరిజన సంఘాల నుంచి వచ్చిన సూచనలు, వినతులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గుమ్మిడి సంధ్యారాణి, ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ జీవో నంబర్3 పునరుద్ధరణతో పాటు గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. జీవో నంబర్3కు కూటమి ప్రభుత్వం గానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగానీ ఏనాడూ వ్యతిరేకం కాదని, ఆదివాసీలకు శాశ్వత న్యాయం జరిగేలా చట్టపరంగా బలమైన పరిష్కారం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జీవో3 చరిత్రను వివరిస్తూ.. 1986లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జీవో275 ద్వారా గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. అనంతరం 2000 లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో నంబర్3ను ప్రవేశపెట్టి ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులను 100 శాతం స్థానిక గిరిజనులకే కేటాయించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. సుప్రీంకోర్టులో జీవో నంబర్ 3 రద్దుకు గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని మంత్రి విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో3 పునరుద్ధరణకు నాటికి నూరు శాతం కట్టుబడి ఉన్నారని, ఈసారి తీసుకొచ్చే చట్టం కోర్టుల్లోనూ నిలిచేలా అందరూ సహకరించాలని మంత్రి కోరారు. గిరిజనుల భూభాగాలను పరిరక్షించే 1/70 చట్టం ఉందని అది వారి ప్రాథమిక హక్కు అని, దానిని ఏ ప్రభుత్వం కూడా పక్కన పెట్టబోదని మంత్రి స్పష్టం చేశారు. ఈ అంశంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను గిరిజనులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# ఎండుతున్న పంటలు..కుములుతున్న రైతులు

## ఎల్‌నినోతో తగ్గిన నీటిమట్టం

## ఫసల్ బీమాకు అధికారులు సూచనలు

**శ్రీకాళహస్తి,జులై 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లో గురువారం ఆచార్య ఎన్.జి రంగా యూనివర్శిటి సీనియర్ శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో వరి పంటను పరిశీలించారు. ముందస్తు ఖరీఫ్ సీజన్‌లో శ్రీకాళహస్తి వ్యవసాయడివిజన్లో రైతులు సుమారు 33వేల ఎకరాల్లో వరిపంటను వేసారు. శ్రీకాళహస్తి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో రైతులు ప్రభుత్వం, వ్యవసాయశాఖ ఆదేశాలను ఖాతరు చేయక వరిపంటను పోలో మని సాధారణ విస్తీర్ణంకన్నా అధికంగా పంటలు వేసారు.ఎల్‌నినో ప్రభావంతో పంట పిలక దశ నుంచి పరిపక్వత దశకు చేరుకుంది. ఈ పరిస్థితిలో నీటి కొరతతో చేతికొచ్చిన పంట కళ్ళ ముందే ఎండుతుంటే రైతులు తల్లడిల్లుతున్నారు. అనూహ్యంగా బోర్లలో నీరు అడుగింటడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతుండటంతో వ్యవసాయశాఖ సహాయ సంచాలకు రమేష్‌రెడ్డి వారి సహాచరులతో అన్ని మండలాల్లో పంటల పరిస్థితిని పరిశీలించారు. నివేదికలు తయారు చేస్తున్నారు. ంరైతులకు అవగాహన కల్పిస్తూ 'పంటల భీమాను' తప్పని సరిగా చేసుకోవాలని ఆగస్టు 15వరకు అవకాశం ఉందని చైతన్య పరుస్తున్నారు.ఈ నేపధ్యంలో బుధవారం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు శ్రీకాళహస్తి మండలంలోని కమ్మకొత్తూరు, ఏర్పేడు మండలంలోని దుర్గిపేరి గ్రామాల్లో చేతికొచ్చిన వరి పంట ఎండుతుండటంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈసందర్భంగా దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతలు మాట్లాడుతూ తాము ముందస్తుగానే మేనెలలోనే వరి పంటను వేస్తా మన్నారు. జూన్ నెలలో ఊహించని విధంగా ఎండలతో చెరువులు ఎండాయని బోర్ల నీరు అడుగింటి పోయిందని శాస్త్రవేత్తలకు వివరించారు.


**రైతులకు పలు సూచనలు:**

ఎండుతున్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు అన్నదాతలకు పలు సూచనలు చేస్తూ విత్తనాలు,పురుగుమందులు, ఎరువులు కొనుగోలు చేయాలన్నా అన్నదాత సుఖీభవ, ఎంఎంకిసాన్, ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన స్కీం కింద ఇన్సు రెన్స్‌లబ్ధి పొందాలన్నా, తప్పని సరిగా ప్రతి ఒక్క రైతు సమీప రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్ర దించాలన్నారు. అంతేకాక ఎల్‌నినో ప్రభావంతో ఎండలుఅధికమై నీరు ఆవిరిగా మారి బోర్లు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం సహాయం అందాలంటే ప్రతి రైతు తమ పంటకు సంబంధించి బీమా చేసుకోవాలని సూచిం చారు. ఈ పరిశీలనల్లో సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతిమ, డాక్టర్ సం ధ్యారాణి, సహాయ సంచాలకులు ధనంజయరెడ్డి, శ్రీకాళహస్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి.రమేష్ెడ్డితో కలసి విస్తృతంగా పరిశీలించారు. ఏర్పాట్లను వ్యవసాయాధికారి మమతారెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది తేజస్విని, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం వరి పంటను పరిశీలిస్తున్న ఆచార్య రంగా వర్సిటీ శాస్త్రవేత్తలు

# బిఎల్ సంతోష్‌ని కలిసిన జనసేన ఎంపీలు



గురువారం న్యూఢిల్లీలో బిజెపి కార్యనిర్వాహక కార్యదర్శి బిఎల్ సంతోష్‌తో జనసేన ఎంపిలు

**విజయవాడ.జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ జనతాపార్టీ ప్రధాన (ప్రచార) కార్యదర్శి బి ఎల్ సంతోష్ ని గురువారం ఢిల్లీలో జనసేన ఎంపీలు లింగమనేని రమేష్ , వల్లభనేని బాల శౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంతోష్‌ని జనసేన ఎంపీలు సత్కరించారు. మోడీ నాయకత్వంలో భారత దేశ అభ్యున్నతికి కూటమి పక్షాలన్ని సంఘటితంగా కృషి చేద్దామని సంతోష్ వ్యాఖ్యానించారు.

# ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించిన ఉద్యోగ సంఘాల జెఎసి

**శ్రీకాళహస్తి,జులై 23 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండున్నర సం వత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు రాష్ట్ర ప్ర భుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదని ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ రాష్ట్ర జేఏసి నాయకులు ఎంఎల్‌ఏలకు వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఈ నేపథ్యంలో గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. రాష్ట్ర జేఏసి పిలుపు మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ జేఏసి ఛైర్మెన్ చల్లా చెంచురత్నం యాదవ్ సారథ్యంలో ఉద్యోగులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల బాధలను చెంచురత్నం యాదవ్ వివరించారు. ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చారన్నారు.అయితే ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన పిఆర్‌సికి సంబంధించి కమిషన్ వేయటంలో చొరవ చూపలేదన్నారు ఇక ఐఆర్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఉద్యోగులకు 5డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని సరెండర్ లీవ్‌కు సంబంధించి కూడా అపరిష్కృతంగా ఉందన్నారు.ఈ సమస్యలను ఎంఎల్‌ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు ఉద్యోగులతో సహాకరించాలని కోరారు. జేఏసి నాయకుల అభ్యర్ధనను స్వీకరించిన శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు బాసటగా నిలుస్తుందన్నారు.నేడు రాష్ట్ర జేఏసి సంఘ నాయకులు అందించిన వినతి పత్రంలోని డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తామన్నారు. రాబోవు శాసనసభ సమావేశాల్లో ఉద్యోగుల సమస్యలకు సంబంధించి చర్చించి పరిష్కరించేందుకు తన వంతు సహాకారాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ మేరకు ఉద్యోగ సంఘాల జేఏసి ఛైర్మెన్ చల్లా చెంచురత్నం యాదవ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు సురేష్,కార్యదర్శి వెంకటముని, శ్రీనివాసులు,బాలు తదితరులు పాల్గొన్నారు.



గురువారం ఎంఎల్‌ఏ బొజ్జల సుధీర్ రెడ్డిని కలసి ఉద్యోగ సంఘాల నాయకులు



# డెన్మార్క్ ప్రతిష్టాత్మక డారా పిహెచ్‌డి ఫెలోషిప్‌ను దక్కించుకున్న విమల

**విజయవాడ.జూలై 23ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శాస్త్రవేత్త విమల బత్తినేని అరుదైన ఘనత సాధించారు. డెన్మార్క్ ప్రతిష్ఠాత్మక డారా పీహెచ్‌డీ ఫెలోషిప్‌ను దక్కించుకున్నారు. దీని విలువ సుమారు 25 లక్షల డానిష్ క్రోనార్లు (దాదాపు రూ.3.6 కోట్లు). 2026 సెప్టెంబర్ నుంచి యూనివర్సిటీ ఆఫ్ సదర్న్ డెన్మార్క్‌లో మూడేళ్ల పీహెచ్‌డీ ప్రారంభించనున్నారు. సామాజిక మాధ్యమం లిం క్డిన్‌లో ఈ విషయాన్ని విమల వివరిస్తూ ఈ విజయం వెనుక ఎన్నో తిరస్కరణలు, అనిశ్చితి దాగి ఉన్నాయని చెప్పారు. అనేక పీహెచ్‌డీ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, డారా ఫెలోషిప్‌కు చేసిన తొలి ప్రయత్నం కూడా విఫలమైందని గుర్తు చేశారు. అయితే ప్రతి తిరస్కరణ తనకు కొత్త పాఠం నేర్పిందని పేర్కొన్నారు.విమల 2019 నుంచి 2023 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని రేకులకుంట హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో శాస్త్రవేత్తగా పనిచేశారు. అనంతరం భర్త ఉద్యోగరీత్యా డెన్మార్క్‌కు వెళ్లడంతో, అక్కడే పరిశోధన రంగంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆమె చేపట్టనున్న ఫాబా లూప్ పరిశోధనలో ప్రొటీన్ అధికంగా ఉండే ఫాబా బీన్స్ సాగును విస్తరించడం ద్వారా సోయా దిగుమతులపై డెన్మార్క్ ఆధారపడడాన్ని తగ్గించవచ్చా అనే అంశాన్ని అధ్యయనం చేయనున్నారు.

# విజయవాడ, విశాఖపట్నంలో కేంద్ర జిఎస్‌టిఎటి బెంచ్‌ల ప్రారంభం

**విజయవాడ,జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (జీఎస్‌టీఏటీ) విజయవాడ, విశాఖపట్నం బెంచ్‌లు గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమాన్ని కేంద్ర జీఎస్‌టీఏటీ ఉపాధ్యక్షులు. సభ్యులు (న్యాయ), (ఆంధ్రప్రదేశ్) భాస్కర్ రెడ్డి వేమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంచ్‌ల ప్రారంభోత్సవం ఒక చారిత్రక మైలురాయి అన్నారు. రెండు బెంచ్‌లలోనూ అప్పీళ్ల విచారణలు ప్రారంభోత్సవం జరిగిన అదే రోజే ప్రారం భమయ్యాయన్నారు. పన్ను చెల్లింపుదారులకు వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవం తమైన న్యాయాన్ని అందించడంతోపాటు, కేంద్ర జీఎస్‌టీ అప్పీళ్ల విచారణలో ఏకరూపత, సమర్థతను నిర్ధారించడం పట్ల ట్రిబ్యునల్ నిబద్ధత కలిగి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌టీఏటీ (ఆంధ్రప్రదేశ్) సభ్యులు (సాంకేతిక) సతీష్ కుమార్ అగర్వాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ ఎ.బాబు, స్పెషల్ కమిషనర్ నూతులపాటి సౌమ్య, కమిషనర్ (అప్పీ ల్స్) దేవేష్ గుప్తా, కమిషనర్ (కస్టమ్స్) ఆర్కే రామన్, కమిషనర్ (సీజీ ఎస్‌టీ) అరుణ్ రిచర్డ్, అదనపు కమిషనర్ (కస్టమ్స్) లక్ష్మీ నారాయణ, అదనపు కమిషనర్ (సీజీఎస్‌టీ) జి రాజుయాదవ్, డిప్యూటీ రిజిస్ట్రార్ (జీఎస్‌టీఏటీ ఏపీ) వివిఎస్ కిషోర్ రాయలు,కోర్టుఅధికారి (జీఎస్‌టీఏటీ ఏపీ) వినయ్ కృష్ణ దాసి, కోర్టు అధికారి (జీఎస్‌టీఏటీ ఏపీ) సి.హెచ్.ప్రత్యూష, అకౌంట్స్ అధికారి (జీఎస్‌టీఏటీ ఏపీ) శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన ట్యాక్స్‌బార్ సీనియర్ సభ్యులు, ట్యాక్స్ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ లూనార్ మిషన్‌కు ఎపి విద్యార్థిని ఎంపిక

## ధవళేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న కందుల జెస్సీ

### జెస్సీకి మంత్రి లోకేష్ అభినందన

**విజయవాడ.జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అరుదైన అంతర్జాతీయ ఘనతను సొంతం చేసుకుంది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కందుల జెస్సీ, ప్రపంచంలోనే మొట్టమొదటి గ్లోబల్ ఆల్‌గర్ల్స్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ అయిన 'మిషన్ శక్తిశాట్" కు ఎంపికయ్యారు.ఈ విజయంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. జెస్సీని అభినందిస్తూ ఎక్స్(ట్విట్టర్) వేదికగా ప్రశంసలు కురిపించారు. 'విద్యా రంగంపై మేం ఎందుకు ఇంతగా పెట్టుబడి పెడుతున్నామో అప్పుడప్పుడు ఇలాంటి కథలు గుర్తుచేస్తుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ప్రభుత్వ పాఠశాల నుంచి అంతర్జాతీయ అంతరిక్ష మిషన్‌కు ఆమె ప్రయాణం, కలలు కనే ప్రతి యువతకు స్ఫూర్తిదాయకం' అని పేర్కొన్నారు.' జెస్సీ, నువ్వు ఆంధ్రప్రదేశ్ గర్వపడేలా చేశావు. చంద్రుడిని, ఆపై శిఖరాలను అందుకోవాలని ఆశిస్తూ నీకు శుభాకాంక్షలు' అంటూ లోకేశ్ తన పోస్టులో అభినందనలు తెలిపారు. ఈ మిషన్‌లో భాగంగా జెస్సీ శాటిలైట్ రూపకల్పనలో అంతర్జాతీయ శాస్త్రవేత్తలతో కలిసి పని చేయనున్నారు. ఈ శాటిలైట్‌ను అక్టోబర్ 11న శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి ప్రయోగించనున్నారు. ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అంతరిక్ష ప్రయోగంలో భాగస్వామి కావడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది.



# కాంగ్రెస్ ఆఫీస్‌పై దాడిని ఖండిస్తున్నాం

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై బిజెపి మూకల దాడిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా ఖండించారు.ఈ మేరకు ఈశ్వరయ్య నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టులకు నిరసనగా జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ర్యాలీపై బిజెపి ఘర్షణకు దిగటం దుర్మార్గం. నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా ఒక బాధ్యతాయుత స్థానంలో ఉన్నారనే విషయాన్ని విస్మరించి, కేవలం బిజెపి నేతగానే శ్రేణులు చూడటం అవివేకమన్నారు. బిజెపి దాడుల వెనక రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉండి ఉంటుందన్న పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు లేకుండా ఏపీలో బిజెపి దాడులకు తెగబడే సాహసం చేయలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులు, ఉన్మాద చర్యలు అత్యంత హేయం. దాడికిపాల్పడిన బిజెపి మూకలను తక్షణమే అరెస్ట్ చేయాలని కోరుతున్నామన్నారు.

# చెరువు కబ్జా చేసిన భూమన: టిడిపి జెబి శ్రీనివాస్



**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి మొత్తం బతుకు కబ్జాతోనే ప్రారంభమైందని. భూమి లాక్కుని ఇల్లు కట్టావని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జెబి శ్రీనివాస్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గురూవారం సాయంత్రం తిరు పతిలో మీడియా సమావేశం నిర్వహించారు. తిరుచానూరులో స్వర్ణ ముఖి నది ఒడ్డున భూమిని కబ్జా చేసిన ఘనత భూమనదేనన్నారు. గతంలోనే ఈ విషయం చెప్పానని, ఇప్పుడు విజిలెన్స్ విచారణతో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారని అన్నారు.కోట గోడలు కట్టి స్వర్ణ ముఖి నదిని పూడ్చి మొత్తం 9 ఎకరాలు ఆక్రమించుకున్నావని ఆరోపించారు. అది మాదే అని మీడియాతో చెబుతు న్నావన్నారు. 24 ఎకరాలు మీదే అయితే. 2024 ఎన్నికల అఫిడవిట్ లో సుమారు 15ఎకరాలు మాత్రమే మీ కుటుంబ పేరుతో పొందుపరిచావని, మిగిలిన 9 ఎకరాలు ఆక్రమించినట్టు ఒప్పుకున్నటేగా అని వ్యాఖ్యలు చేశారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కుమారమ్మ ,అన్నా అనిత, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్,తిరుపతి క్లస్టర్ ఇన్చార్జులు శ్రీధర్ వర్మ,దంపూరి భాస్కర్ యాదవ్,మునిశేఖర్ రాయల్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.



# అంతర్జాల సదస్సుకు ఆచార్య రాచపాలెం

**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం నిర్వహిస్తున్న అంతర్జాల సాహిత్య సదస్సుకు ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డుగ్రహీత, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు సాహితీ విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి హాజరు కానున్నారు. తెలుగు సాహిత్య విమర్శ "నాడు నేడు" అనే అంశంపై ఆయన కీలక ప్రసంగం చేస్తారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఈ వెబినార్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. "నెలనెలా తెలుగు వెన్నెల" పేరుతో ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం "సాహిత్య వేదిక" వెబినార్ సదస్సును నిర్వహిస్తోంది. ఈనెల 26వ తేదీ జరిగే 228 వ అంతర్జాల సాహిత్య సదస్సుకు ముఖ్య అతిథిగా ఆచార్య రాచపాలెంను ఆహ్వానించినట్లు సంఘం అధ్యక్షులు మాధవి లోకిరెడ్డి, సమన్వయకర్త దయాకర్ మాడ వెల్లడించారు. మాతృభాషను అభిమానించి, తెలుగు సాహిత్యాన్ని ఆస్వాదించాలని వారు కోరారు.

# నాగరాజు పోలీసు కస్టడీ విచారణపై తీర్పు రిజర్వ్

**విజయవాడ,జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కేసులో నిందితుడిగా ఉన్న కృష్ణలంక పీఎస్ సస్పెండెడ్ సీఐ నాగరాజు పోలీసు కస్టడీ విచారణపై సుప్రీంకోర్ట్ తీర్పు రిజర్వ్ చేసింది. సిఐడి కస్టడీలో నాగరాజును విచారించేందుకు హైకోర్టు షరతులు విధించింది. హైకోర్టు షరతులను సుప్రీంకోర్టులో ఏపీ సీఐడీ సవాలు చేసింది.జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం సీఐడీ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ విచారణకోసం నాగరాజును 160కి.మీ. తీసుకొచ్చి మళ్లీపంపించాల్సి ఉంటుందని సీఐడీ స్పష్టం చేసింది.

ఇలా చేస్తే కేసు దర్యాప్తుపై తీవ్ర ప్ర భావం చూపుతుందని సీఐడీ తెలిపింది. ఇరు వర్గాల వాదనల తర్వాత సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# థాయ్‌లాండ్‌లో మెరిసిన పద్మావతి వర్సిటీ విద్యార్థినులు

**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళావిశ్వవిద్యాలయంకు చెందిన ఇద్దరు విద్యార్థినులు థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ నాయకత్వ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. బయోటెక్నాలజీ విభాగానికి చెందిన పి. హారిణి సూర్యం, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగానికి చెందిన జి. శ్రీ సాయి హర్షిత థాయ్‌లాండ్‌లోని ప్రిన్స్ ఆఫ్ సాంగ్‌క్లా యూనివర్సిటీ (పీఎస్‌యూ), పట్టానీ క్యాంపస్ నిర్వహించిన ఐదు రోజుల "లీడర్‌షిప్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్" అంతర్జాతీయ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన విద్యార్థులతో కలిసి వీళ్ళునాయకత్వ లక్షణాలు, బృందంగా పనిచేసే విధానం, భిన్న సంస్కృతుల గురించి అవగాహన పెంపొందించుకున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అనుభవాత్మకంగా నేర్చుకున్నారు.

హారిణి సూర్యం మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మంచి అవగాహనతో పాటు కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం లభించిందని చెప్పారు. సాయి హర్షిత మాట్లాడుతూ, ఇతర దేశాల విద్యార్థులతో కలిసి పనిచేయడం వల్ల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, జట్టుగా పనిచేసే సామర్థ్యం, ప్రపంచ దృక్పథం మరింత మెరుగుపడ్డాయని తెలిపారు. విద్యార్థినులను వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమా వెన్నం, రిజిస్ట్రార్ ఆచార్యఆర్. ఉషా, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ ఆచార్య పి. విజయలక్ష్మి ్మ అభినందించారు.

# పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు రద్దు చేయండి: హైకోర్టు

**విజయవాడ.జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ నాయకుడు పేర్ని నాని, ఆయన కుమారుడు మచిలీపట్నంలో పంపిణీ చేసిన నకిలీ ఇంటి పట్టాలను రద్దు చేయడానికి నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉన్నతాధికారులను ఆదేశించింది. రోడ్లు, శ్మశాన వాటికలు,డ్రైనేజీ, పోరంబోకు వంటి ప్రభుత్వ భూముల్లో పట్టాల అక్రమ పంపిణీకి సం బంధించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న అధికారులపై తీసుకున్న చర్యల గురించి నివేదిక సమర్పించాలని కూడా కోర్టు ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. మచిలీపట్నంలో ఎన్నికలకు ముందు వైఎస్సార్సీపీ నేత నాని, ఆయన కుమారుడు కిట్టు, వైఎస్సార్సీపీ నాయకులు నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినప్పటికీ ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు జాప్యం చేస్తున్నారంటూ టీడీపీ నేత ఐ. దిలీప్‌కుమార్ గతేడాది హైకోర్టులో పిల్‌వేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది మల్లవోలు నిఖిత వాదనలు వినిపించారు. నకిలీ పట్టాలు పంపిణీ చేసింది వాస్తవమేనంటూ అధికారులు తేల్చారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు.ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం నకిలీ పట్టాల రద్దుకు నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. పేర్ని నాని తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. రాజకీయ ప్రయోజనం కోసం ఈ పిల్ దాఖలు చేశారన్నారు. పిటిషనర్‌పై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయాలను పిల్‌లో దాచి పెట్టారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వాస్తవాలను గోప్యంగా ఉంచి పిల్ దాఖలు చేసినట్లు తేలితే పిటిషనర్‌కు ఖర్చులు విధిస్తామని స్పష్టం చేసింది.

# నిరుద్యోగులను మోసగించిన కేసులో ముసునూరి సౌజన్య, శ్రీనివాస్‌లకు రిమాండ్

**విజయవాడ,జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** నిరుద్యోగులను మోసం చేసిన కేసులో నిందితులు ముసునూరి సౌజన్య, శ్రీనివాస్‌లను విజయ వాడ న్యాయస్థానం గురువారం రెండు వారాల పాటు రిమాండ్ విధిం చింది. నిందితులను విజయవాడ పోలీసులు హైదరాబాద్‌లో అదు పులోకి తీసుకున్నారు. వారిని విచారించిన తరువాత బుధవారం అధికారికంగా పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రకటించారు.వారిని బుధవారం రాత్రే న్యాయస్థానానికి తరలించారు. అయితే సమయం ముగియడంతో న్యాయమూర్తి ఇంటికి తీసుకెళ్లారు. రిమాండ్ రిపోర్టును పరిశీలించిన న్యాయమూర్తి అందులో మార్పులు చేయాలని దర్యాప్తు అధికారికి సూచించారు. నివేదికలో మార్పులు చేసి గురువారం ఉదయం న్యాయస్థానంలో ప్రవేశపెట్టాలని సూచించడంతో నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.రిమాండ్ రిపోర్టులో మార్పుల అనంతరం నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా వారి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. విజయవాడ శివారులోని పెదపులిపాక గ్రామానికి చెందిన ముసునూరి శ్రీనివాస్, సౌజన్యలు భార్యాభర్తలు. సౌజన్య గతంలో పటమట పంటకాలువ రోడ్డులోని ఒక సంస్థలో పని చేసింది. స్టూడెంట్ వీసా ప్రాసెస్ గురించి తెలుసుకుని నిరుద్యోగులను మోసం చేయవచ్చని భావించింది. ఒక పథకం ప్రకారం భర్తతో కలిసి విజయవాడ, విశాఖపట్నం, హైద రాబాద్‌లో ఫ్లైయింగ్ బోర్డర్స్ కన్సల్టెన్సీ కార్యా లయాలను ఏర్పాటు చేసింది. సోషల్ మీడియా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో విస్తృతంగా ప్రచారం చేసి నిరుద్యోగులను ఆకర్షించారు. ఈ నెల 19న అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండే షేక్ సలమా అనే యువకుడికి విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను అరెస్టు చేసినట్లు విజయవాడ డీసీపీ గుణ్ణం రామకృష్ణ తెలిపారు.ఇక స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరిల పేరుతో యూరప్ దేశాలైన నెదర్లాండ్స్, ఐర్లాండ్, లక్సెంబర్గ్, ఫిన్లాండ్‌తదితర దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వారిని నమ్మించారు. ఒక్కొక్కరి వద్ద రూ. 8 లక్షల నుంచి రూ. 13లక్షల వరకు వసూలు చేశారు. ఇలా విజయవాడలో 700 మంది నుంచి రూ.11 కోట్లు, విశాఖపట్నంలో 130 మంది నుంచి రూ.2.2 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో దాదాపు 2,400 మంది వీరి కార్యాలయానికి వచ్చినట్లు గుర్తించారు. అక్కడ ఎంత మందిని మోసం చేసింది ఇంకా తెలియరాలేదు. నిరుద్యోగుల నుంచి ప్రాసెసింగ్ రుసుములు వసూలు చేసి, వారికి నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహించే వారు. తమ సంస్థ ప్రతినిధులనే విదేశీ కంపెనీ ప్రతినిధులుగా నటింపచేసేవారు. తర్వాత ఇంటర్వ్యూల్లో ఫెయిల్ అయ్యారని అభ్యర్థులకు నకిలీ ఫీడ్‌బ్యాక్ ఇచ్చేవారు. దీనిపై కొంత మంది అనుమానం వ్యక్తం చేయగా వారి చరవాణి నంబర్లను బ్లాక్ చేశారు. ఇలా తెలుగు రాష్ట్రాల్లో అనేక మందిని మోసం చేశారు. మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో ఈ మోసం డొంక కదిలింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగానే అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో కేసు నమోదైంది. దీంతో పోలీసులు నిందితులను గుర్తించి ఆకస్మాత్తుగా దాడి చేసిఅరెస్టు చేశారు. భార్యాభర్తలపై మొత్తం 8 కేసులు నమోదయ్యాయని పోలీసులు వెల్లడిం చారు. 2011లోనే సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మోసం కేసు నమోదైంది. 2024లో మాచవరం పీఎస్‌లో, 2025లో అన్న మయ్య జిల్లా పీలేరు పోలీస్ స్టేషన్‌లో, 2026లో తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల మహిళా పీఎస్, బేగంపేట పీఎస్, కామారెడ్డి జిల్లా బిక్నూర్ పీఎస్, విజయవాడ మాచవరం, సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన డబ్బులతో కారు లోన్ (రూ.3.3 లక్షలు), రూ.71.45 లక్షల విలువైన బంగారం, రూ.2.25 కోట్ల విలువైన స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇంకా ఏమైనా కొనుగోలు చేశారా అనే దానిపై వాకబు చేస్తున్నారు,

# శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ మరింత ఆధునికం

## ఎపి పోలీస్ రిట్రీట్-2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

**విజయవాడ.జూలై23.ప్రభాతవార్తప్రతినిధి:** శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ మరింత ఆధునికంగా మారాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ పోలీస్ రిట్రీట్-2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌కు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. భవిష్యత్తులో పోలీసులకు ఎదురయ్యే సవాళ్లు.. వాటిని ఏ విధంగా అధిగమించాలనే అంశాలపై మూడు రోజుల నుంచి పోలీస్ ఉన్నతాధికారులు మేథో మథనంగా రిట్రీట్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారులు.టెక్నాలజీని వినియోగించి పోలీసింగ్ ఏ విధంగా చేయాల్లి... మారాలని? సైబర్ నేరాలు కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై కాన్ఫరెన్సులో చర్చలు జరిపారు.తద్వారా వివిధ అంశాలపై తమ రూపొందించిన ప్రజెంటేషన్లను సీఎం చంద్రబాబుకు ఐపీఎస్ అధికారులు వివరించారు. సంబంధిత నివేదికను సీఎం చంద్రబాబుకు అందించారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 2001లో ఇదే తరహాలో ఫ్యూచర్ పోలీసింగ్ తరహాలో వర్క్ షాప్ నిర్వహించాం అన్నారు. గతంతో పోల్చుకుంటే నేరాలతీరు మారిందన్నారు.సోషల్ మీడియా వేదికగా సమాజంలో అశాంతిని రెచ్చగొట్టేలా కొందరు వ్యవహరిస్తున్నారు.నేరాలను కట్టడి చేయ డం తోపాటు తప్పులు చేసిన వారికి శిక్షలు పడేలా చేయగలిగితే నేరాలు అదుపులోకి వస్తాయి అన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీస్ వ్యవస్థను రీస్ట్రక్చర్ చేయాల్సిన అవసరం ఏ మేరకు ఉందో పరిశీలించాలన్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు కొన్ని పార్టీలు ఏకంగా నేరాలు చేయడానికి కూడా వెనుకాడటం లేదన్నారు. రౌడీయిజం, ఫ్యాక్షనిజాన్ని సమర్ధంగా నియంత్రించామని, శాంతి భద్రతల పరిరక్షణలో పో లీసులుప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సీఎం సూచించారు.



ఎపి పోలీస్ రిట్రీట్-2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌లో చర్చించిన అంశాలపై నివేదికను ప్రదర్శిస్తున్న సీఎం చంద్రబాబు,హోంమంత్రి అనిత,డీజీపీ హరీష్

## ఆంజనేయుని విగ్రహం అపహరణలో వీడని చిక్కుముడి

**తిరుమల, ప్రభాతవార్త:** తిరుమల డౌన్‌ఘాట్‌రోడ్డు (మొదటి)లోని మామండూరు మిట్ట వద్ద ప్రసన్నాంజనేయ స్వామి గుడి వద్ద చిన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని బుధవారం వేకువజాము అపహరించారు. ఈ కేసును కొన్ని గంటల వ్యవధిలోనే తిరుపతి జిల్లా పోలీసులు ఛేదించడమే ఛాలెంజ్‌గా తీసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ మురళీకృష్ణ, తిరుమల అదనపుఎస్పీ ఐ.రామకృష్ణ, తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, తిరుమల డిఎస్పీ విజయశేఖర్, 2టౌన్ సిఐ రాముడు ప్రత్యేక బృందాలతో చేపట్టిన దర్యాప్తు సత్ఫలితాలనిచ్చింది. సాంకేతికత తో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ముద్దాయి జశ్వంత్‌కుమార్‌తో పాటు విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు విచారణ తోబాటు అతని తల్లి తండ్రుల విచారణలో జస్వంత్‌కుమార్ ఇంజనీరింగ్ వరకు చదివి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నట్లు, సుమారు మూడు సంవత్సరాలుగా అతని మానసిక పరిస్థితి నిలకడగా లేనట్లు, తరచూ తల్లి తండ్రులతో గొడవ పడుతున్నట్లు వివరాలు రాబట్టారు. ఈ నెల 5 వ తేదీ మిత్రులతో కలిసి తిరుమల కి వచ్చినట్లు, నడకదారిలో వెళ్తూ ఈ చిన్న ఆంజనేయ స్వామి విగ్రహాన్ని చూసినట్లు, చిన్నదిగా బాగుండటంతో తీసుకెళ్ళి పూజ చేసుకోవాలని భావించాడు. మూడు రోజుల క్రితం తిరుమల కి ఒక్కడే వచ్చినందున దర్శనం పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణంలో జీపు లో వెళ్తూ ఆంజనేయస్వామి గుడి వద్ద దిగి విగ్రహాన్ని పట్టుకెళ్ళాడు. అయితే ఈ కేసులో దర్యాప్తు అన్ని కోణాల్లో చేపట్టాల్సి ఉందని, విగ్రహం దొంగతనంలో నిందితుడు వెల్లడించిన సమాచారంలో ఎంతవరకు వాస్తవాలు ఉందనేది తేల్చాల్సి ఉందని అదనపు ఎస్పీలు రవి మనోహరచారి, రామకృష్ణ గురువారం సాయంత్రం తిరుమలలో మీడియాకు వెల్లడించారు. త్వరలోనే కోర్టు ద్వారా కస్టడీ కి తీసుకొని పూర్తి స్థాయి లో దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## 25,26 తేదీల్లో 'తెలుగు మహోత్సవం': మంత్రి దుర్గేష్

**విజయవాడ.జూలై23.ప్రభాతవార్తప్రతినిధి:** మాతృభాష వైభవాన్ని, సాంస్కృతిక సంపదను భావితరాలకు అందించాలనే ఉన్నతాశయంతో రాష్ట్ర స్థాయిలో 'తెలుగు మహోత్సవం' నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం అనంతరం రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూలై 25, 26 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చారిత్రాత్మక ఉండవల్లి గుహల ప్రాంగణంలో జరగనున్న తెలుగు మహోత్సవం అధికారిక పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు భాషా వైభవం, సాహిత్య సంపద, సాంస్కృతిక



సౌందర్యం, కళా సంప్రదాయాలు, జానపద వారసత్వం మరియు సృజనాత్మకతలను ఒకే వేదికపైకి తెచ్చే అద్భుతమైన వేడుక ఈ తెలుగు మహోత్సవం అన్నారు. మాతృభాష గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ మహా కార్యంలో విద్యార్థులు, యువత, తెలుగు భాషాభిమానులు, ప్రతి ఒక్కరూ విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

## కందుల జెస్సీకి పవన్ కళ్యాణ్ అభినందనలు

**విజయవాడ,జూలై 23,ప్రభాతవార్తప్రతి నిధి:** ప్రతిష్ఠాత్మక మిషన్ శక్తిశాట్ కార్యక్రమానికి ఎంపికైన తూర్పుగోదావరి జిల్లా జడ్పీ పాఠశాలకు చెందిన కందుల జెస్సీని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్..అభినందించారు. "ప్రభుత్వ పాఠశాల తరగతి గది నుంచి చంద్రుని యాత్ర అంచు వరకు సాగిన నీ ప్రయాణం అద్భుతం" అంటూ పవన్ కళ్యాణ్ ప్రశంసించారు..యువతకు స్ఫూర్తిగా నిలిచేలా మరిన్ని విజయాలు సాధించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు.

## ఉగ్రకుట్ర కేసులో ముగ్గురికి జైలుశిక్ష విధించిన విశాఖ ఎన్ఐఏ కోర్టు

**విజయవాడ.జూలై 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఉగ్రకుట్ర కేసులో విశాఖ ఎన్ఐఏ కోర్టు ముగ్గురికి జైలుశిక్ష విధించింది. డొంగరి దేవేంద్ర, దుబాషి స్వప్న, చుక్క శిల్పకు 5 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. దోషులు జరిమానా చెల్లించకపోతే అదనంగా 6 నెలల జైలుశిక్ష విధించనున్నారు. దోషులు నిషేధిత సీపీఐ మావోయిస్టు అనుబంధ సంస్థ సభ్యులుగా గుర్తించారు. మావోయిస్టులకు మద్దతు, నియామకాలు, కుట్ర ఆరోపణలతో కేసు నమోదైంది. ఏపీ పోలీసుల నుంచి 2022 జూన్‌లో ఎన్ఐఏ కేసును తీసుకుంది.

## లారీ కింద పడి వ్యక్తి మృతి

**బుచ్చి (నెల్లూరు), జూలై 23, ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం ముంబాయి రహదారిలో వేణుగోపాల స్వామి గుడి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి ఆత్మకూరుకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. బుచ్చిరెడ్డిపాళెం నుండి సంగం వైపు మోటార్ బైకుపై వెళుతు వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో అదుపు తప్పి ద్విచక్రవాహనదారుడు పడిపోగా వెనుకనే వస్తున్న లారీ అతని తలపైన ఎక్కడంతో తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి ఆత్మకూరు జేఆర్ పేటకు చెందిన అశోక్‌కుమార్ (40)గా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిఐ శివరామ కృష్ణారెడ్డి, ఎస్ఐ ఉమాశంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టరం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐటిపరిశ్రమల స్థాపనకు అనువైన భవనాలు పోర్టల్‌లో నమోదు చేయండి : ఎన్‌టిఆర్ కలెక్టర్

**విజయవాడ, జులై 23, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా ఐటి పరిశ్రమలు, స్టార్టప్ కంపెనీల స్థాపనకు అనువైన ఖాళీ కమర్షియల్ భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీభూములు, ఐటి కార్యకలాపాలకు అనువైన ఇతర ఆస్తుల వివరాలను ప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌లో నమోదు చేసి జిల్లాలో ఐటిపరిశ్రమ విస్తరణకు సహకరించాలని జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్‌జిల్లాను ఐటిహబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఐటిపరిశ్రమల విస్తరణ ద్వారా స్థలాలు, భవన యజమానులకు మంచి అద్దె లభించటంతోపాటు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు.

పోర్టల్ నమోదు వివరాల కోసం 8497961902లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

## భూమన కరుణాకర్ రెడ్డికి అరెస్ట్ తప్పదు

### తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి విద్య, జూలై 23 ప్రభాతవార్త:** భూ కబ్జాలు, టిడీఆర్ బాండ్ల కుంభకోణం, 2021 తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సందర్భంగా జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దొంగ ఓట్ల నమోదుకు సంబంధించిన కేసుల్లో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డిలపై చట్టపరమైన చర్యలు తప్పవని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ అంశాలపై విజిలెన్స్ నివేదికలు ప్రభుత్వానికి అందాయని, చట్టం తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు.గురువారం తిరుపతిలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేస్తూ భూముల స్వాధీనాన్ని రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. భూమన కరుణాకర్ రెడ్డి ఆక్రమించినట్లు విజిలెన్స్ నిర్ధారించిన భూములనే రెవెన్యూ అధికారులు చట్ట ప్రకారం స్వాధీనం చేసుకున్నారని, ఇందులో రాజకీయ జోక్యానికి తావులేదని స్పష్టం చేశారు. తాను భూ కబ్జాలకు ఎలాంటి పాల్పడలేదని చెబుతున్న భూమన కరుణాకర్ రెడ్డి,



అభినయ్ రెడ్డి ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అలాగే 2021 తిరుపతి ఉప ఎన్నికల సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న దొంగ ఓట్ల నమోదుపై సిట్ విచారణ కొనసాగుతోందని, విచారణలో దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్వామివారి సేవలో నిబద్ధతతో పనిచేస్తుంటే, వ్యక్తిగత అక్కసుతో ఆయనపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఆరణి విమర్శించారు.

## ఉరి వేసుకుని సచివాలయ ఎఎన్ఎం మృతి

**చిల్లకూరు (నెల్లూరు), జూలై 23, ప్రభాతవార్త :** మండలంలోని తోణుకుమాల గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న శ్రీపతి సాయి చందన ప్రియ (27)గురువారం సచివాలయంలో సిబ్బంది ఎవరు లేకపోవడంతో సూసైడ్ లేక రాసిపెట్టి ఫ్యానుకు చున్నితో ఉరేసుకొని మృతి చెందింది. సూసైడ్ లేఖలో అమ్మ నాన్న అక్కకి నమస్కరించి రాయటం ఏమనగా నా చావుకి ఎవరు కారకులు కాదని నేనే ఉరేసుకొని చనిపోతున్నాను అని లేఖలో పేర్కొంది. మృతి చెందిన సాయి చందన ప్రియ ఓజీల మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన అవివాహిత గత సంవత్సరం క్రితమే బదిలీల్లో తోనుకుమాల గ్రామ సచివాలయానికి రావడం జరిగింది. శ్రీపతి రమణయ్య, సుకుమారి దంపతులకు రెండవ కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సచివాలయం వద్దకు వచ్చి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు, సంఘటన స్థానానికి చేరుకొని కేసు నమోదు చేసిపోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది.

# దుర్గమ్మకి పాలకమండలి ఆషాఢం సారె

**ఇంద్రకీలాద్రి, జులై 22, ప్రభాతవార్త :** బెజవాడ దుర్గమ్మవారికి ఆషాఢం సారె కార్యక్రమంలో గురువారం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు ఆషాఢం సారెను వైభవంగా సమర్పించారు. సారె సమర్పించడానికి వచ్చిన పాలకమండలికి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్ర పఠనోచ్చారణతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించారు.



**వారాహి నవరాత్రులకు నేడు పూర్ణాహుతి :**
శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభమైన వారాహీ నవరాత్రులకు శుక్రవారం ఉదయం 10 గంటలకు శాస్త్రోక్తంగా పూర్ణాహుతితో స్వస్తి పలుకుతామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. యాగశాలలో జరిగే జప, తర్పణ, హోమాదుల పూజా కార్యక్రమాలను దేవస్థానమే అంతర్గతంగా నిర్వహిస్తుందని, భక్తులకు ఇందులో అనుమతి ఉండదన్నారు.

**దుర్గమ్మవారికి ఆషాఢం సారె :**
దుర్గమ్మవారికి మంగళవారం పలువురు మహిళా భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి 7 రోజు గురువారం తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు 27 సారె బృందాలకు చెందిన 9278 మంది భక్తులు సారె సమర్పణ చేశారు. వారికి భవానీ అనుగ్రహ దర్శన్ రూ.100లు క్యూ లైన్ దర్శనం మొత్తం సారె భక్తులకు కేటాయించారు.

**కొబ్బరి చిప్పల టెండర్ ఖరారు:**
మహా మండపం 6వ అంతస్తులో జరిగిన భక్తులు కొబ్బరికాయ కొట్టగా పోగు పడిన కొబ్బరి చిప్పలు సేకరించి, బయటకు తీసుకెళ్ళుటకు గానూ జరిగిన టెండర్ బహిరంగ వేలం ప్రక్రియలో ఆలయం ధర్మ కర్తల మండలి చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనా నాయక్, ధర్మ కర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. రు.1,36,50,000లకు టెండర్ వేసిన విజయవాడకు చెందిన సుంకాబత్తుల నాగవైష్ణవి టెండర్‌ను ఖరారు చేశారు.

# తుంగభద్ర రిజర్వాయర్‌కు పెరుగుతున్న వరద ప్రవాహం

### ప్రస్తుత నీటి నిల్వ 25 టీఎంసీలు

### ఇన్‌ఫ్లో 24,821 క్యూ సెక్కులు

**అనంతపురం, జులై 23 ప్రభాతవార్త బ్యూరో** ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. గత రెండు రోజుల్లోనే దాదాపు రెండు టీఎంసీలకుపైగా తుంగభద్ర డ్యాంకు చేరుకున్నాయి. 2026 సంవత్సరంలో బుధవారం రికార్డు స్థాయిలో నీరు చేరినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎగువత ప్రాంతాల్లో భారీ వర్షాలు రావడం వల్ల తుంగభద్ర జలాశయానికి నీరు రావడం ఎక్కువైంది. బుధవారం నాటి టనీటి లెక్కలను పరిశీలిస్తే.. టీబీ డ్యాంలో 105.788 టీఎంసీల నీటి గాను 28 టీఎంసీల నీరు ఉంది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో పరిశీలిస్తే 24,821 క్యూ సెక్కులు కాగా, అవుట్ ఫ్లో 3,035 క్యూసెక్కులు అని చెప్పవచ్చు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయం ఎగువ భాగంలో వర్షాలు వస్తుండటంతో అనంతపురం, కర్నూలు ఆశలు చిగురిస్తున్నాయి. తుంగభద్ర జలాశయంలో 40 టీఎంసీల నీరు ఉంటేనే అనంతపురం జిల్లాకు సంబంధించిన హెచ్ఎల్‌సికి నీరు వదిలేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే కర్నూలు జిల్లాకు సంబంధించిన ఎల్ఎల్‌సికి నీరు వదిలే నేపథ్యంలో నీటి ప్రవాహం పెరిగితే అనంతపురం జిల్లాకు కూడా హెచ్ఎల్‌సి ద్వారా నీరు వదిలేందుకు అవకాశం ఉంది. హెచ్ఎల్‌సి నీటిని ప్రధానంగా తాగునీటి ఎద్దడిని నివారించేందుకు మొదటి ప్రాధాన్యతగా అధికారులు ఎంచుకునే అవకాశం ఉంది. రుతు పవణాల ప్రభావం వల్ల మరో వారం రోజులు ఇదే విధంగా వర్షాలు పడితే తుంగభద్ర జలాశయంకు ఎక్కువగా నీరు వచ్చే అవకాశం ఉందని, తద్వారా అనంతపురం జిల్లాకు సంబంధించిన హెచ్ఎల్‌సికి టిబి డ్యాం అధికారులు నీరు వదిలే అవకాశం కనిపిస్తోంది. ఇది ఇలా ఉండగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు జలాశయాల్లో నీటి నిల్వల పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. అనంతపురం, కర్నూలు జిల్లాలకు సంబంధించిన హంద్రీనీవా సుజల స్రవంతి పథకం శ్రీశైలం జలాశయంపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వల పరిస్థితి దయనీయంగా ఉంది. శ్రీశైలం జలాశయానికి సంబంధించి బుధవారం నాటి తాజా నీటి లెక్కలను పరిశీలిస్తే జలాశయం పూర్తి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం 41.51 టీఎంసీలు మాత్రమే ఉంది. డ్యాం పూర్తి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 820.89 అడుగులు మాత్రమే ఉంది. దీనిని బట్టి తుంగభద్ర జలాశయంలో ఎప్పుడు లేని విధంగా నీరు అడుగంటిందని చెప్పవచ్చు. అయితే తుంగభద్ర జలాశయం పై భాగంలో కర్ణాటకలో ఉన్న ఆల్‌మట్టి, నారాయణపూర్, జలాశయాల్లో నీటి నిల్వలు పెరుగుతూ వస్తున్నాయి. రిజర్వాయర్ల పై భాగంలో కురుస్తున్న వర్షాల వల్ల ఇన్‌ఫ్లో పెరుగుతున్నాయి. ఆ ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో శ్రీశైలం రిజర్వాయర్‌కు కూడా నీరు వచ్చే అవకాశం కనిపిస్తోంది. కర్ణాటకలోని ఆల్‌మట్టి జలాశయానికి సంబంధించి బుధవారం రోజు 65,752 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 38,067 ఆల్‌మట్టి రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 123.08 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 103.766 టీఎంసీలు ఉంది. అంటే దాదాపు 84 శాతం నీరు ఆ జలాశయంలో ఉంది. ఆల్ మట్టి రిజర్వాయర్‌కు కింది భాగం కర్ణాటకలో నారాయణపురం డ్యాంలో గరిష్ట నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా, ఇప్పుడు 24.08 టీఎంసీలు ఉంది.



## కాణిపాకం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

### స్వర్ణరథం సేవ టిక్కెట్ ధర రూ.5 వేలు, పాలక మండలి ఏకగ్రీవ తీర్మానం

**కాణిపాకం, జూలై 13 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఈఏడాది సెప్టెంబర్ 14 నుండి జరగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని దేవస్థాన పాలక మండలి ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించింది. పాలకమండలి సమా వేశం గురువారం స్థానిక ఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో పాలకమండలి చైర్మన్ మణి నాయుడు అధ్యక్షతన జరిగింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ ప్రధాన అజెండాగా పాలకమండలిలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ వి.మణినాయుడు, ఈవో పెంచల కిషోర్‌లు సమావేశం అనంతరం విలేకరులకు వివరించారు. ఈసందర్భంగా వచ్చే సెప్టెంబర్ 14 నుండి అక్టోబర్ 5 వరకు జరగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగానిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. ప్రతి నెలా ఆలయంలో సంకటహర చతుర్థి రోజున స్వామివారికి జరిగే స్వర్ణర థోత్సవం ప్రస్తుతం దేవస్థానం వారే నిర్వహి స్తుండగా ఇకపై స్వర్ణ రథోత్సవం నిర్వహించే అవకాశం భక్తులకు కల్పిస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు స్వర్ణ రథోత్స వంకు 5 వే రూపాయలుగా టిక్కెట్ ధరను ప్రతిపాదిస్తూ సమావేశంలో తీర్మానించినట్లు చైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌తో పాటు రాష్ట్రంలోని పలువురు ప్రముఖులను ఉత్సవాలకు ఆహ్వానించాలని పాలకమండలి తీర్మానించనట్లు చైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లు తెలిపారు.

## దేశంలో యువ స్వాతంత్ర్య పోరాటం మొదలైంది

### కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్ర దేవ్

**విజయనగరం, (కురుపాం), జూలై 23 ప్రభాతవార్త :** దేశంలో యువ స్వాతంత్ర పోరాటం మొదలైందని దానిని నియంత్రణ చేసే స్థాయి ఏఒక్క రాజకీయ పార్టీలకు లేదని డిల్లీ జంతర్ మంతర్‌లో నీట్ లీకేజీపై జరుగుతున్న న్యాయ పోరాటంపై స్పందిస్తూ కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్ర దేవ్ అన్నారు. గురువారం ప్రకటన విడుదల చేస్తూ విద్యార్థులకు అన్ని రకాలు విద్యకు అర్హత పరీక్షలు నిర్వహణ ,సీట్లు కేటాయింపు పూర్తి అజమాయిషీ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని నిబంధనలు కు విరుద్ధంగా



కేంద్ర ప్రభుత్వం వైద్య విద్య అర్హత పరీక్ష (నీట్) తమ ఆదీనంలోకి తీసుకోవడమే చట్టవ్యతిరేకమైన దన్నారు. దేశంలో వివిధ వర్గాల ప్రజలు ,యువత 12 ఏళ్ళ బిజెపి పరిపాలన పై విసిగిపోయి పోరాటం చేసేందుకు సిద్ధం అయ్యా రని అన్నారు. ఇది ముమ్మాటికీ కేంద్ర హోంశాఖ వైఫల్యమేనని, భవిష్యత్ యువతరానిదేనని అన్నారు.



## ప్రధాని పర్యటన ఏర్పాట్లలో అత్యున్నత ప్రమాణాలు

### ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ప్రత్యేక అధికారి జి.వీరపాండ్యన్

**విజయనగరం, జూలై 23 ప్రభాతవార్త:** ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం రాష్ట్ర ప్రతిష్ఠాత్మక వేడుకగా నిలిచేలా అన్ని ఏర్పాట్లను అత్యున్నత ప్రమాణాలతో పూర్తి చేయాలని ప్రధానమంత్రి పర్యటన నోడల్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ప్రధానమంత్రి పర్యటన ప్రత్యేక అధికారి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండ్యన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డితో కలిసి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించిన వారు, ప్రారంభోత్సవానికి సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో రాష్ట్ర ఎయిర్‌పోర్ట్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, పురపాలక శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ డా. పి.సంపత్ కుమార్, విజయనగరం జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, అనకాపల్లి జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ షోబిత, అదనపు ఎస్పీ సౌమ్యలత, జీఎంఆర్ ప్రతినిధులు ఐ. ప్రభాకర్ రావు, రామరాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దత్తారెడ్డి బ్యాటింగ్ విధ్వంసం




**అనంతపురం, జులై 23 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాకు చెందిన రంజీ క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి మరోసారి రాణించారు. ఇప్పటికే రెండు అర్థ సెంచరీలు సాధించిన మరల మూడో మ్యాచ్‌లో కూడా సూపర్ బ్యాటింగ్‌తో విధ్వంసం సృష్టించారు. సెంచరీ మిస్ చేసుకున్నారు. విజయనగరంలో జరుగుతున్న అండర్-23 ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీల్లో ప్రకాశం జట్టుపై కేవలం 45 బంతుల్లో 89 పరుగులు సాధించారు. 8 సిక్సర్లు ఆరు ఫోర్ లతో ప్రకాశం బౌలర్లపై విరుచుకుపడ్డారు గ్రౌండ్ నలుమూలల సిక్సర్ల వర్షం కురిపించి ఆకట్టుకున్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని నార్త్ జోన్ అకాడమీలో జరుగుతున్న అండర్-23 ఇంటర్నల్స్ క్రికెట్ పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్ల మధ్య గురువారం ఉదయం మ్యాచ్ ప్రారంభమైంది. బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జిల్లా జట్టు 20 ఓవర్లలో 195 పరుగులు సాధించి ఏడు వికెట్లు కోల్పోయింది. అందులో ఓపెనర్ రంజీ క్రికెటర్ మచ్చ దత్తారెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రతిభతో 89 పరుగులు సాధించడంతోపాటు రాణించడంతో అనంతపురం జిల్లా జట్టు భారీ స్కోర్ చేసింది మనోజ్ కుమార్ 32 పరుగులు ప్రదీప్ రెడ్డి 22 పరుగులు రేహన్ 28 పరుగులు మల్లికార్జున 12 పరుగులు చేసి అనంతపురం జట్టు భారీ స్కోర్ చేయడానికి దోహదపడ్డారు.


క్రీడా కారులను అభినందిస్తున్న సమగ్ర శిక్ష, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ టీ.శైలజ

## పారా స్పోర్ట్స్ మీట్‌లో దివ్యాంగ విద్యార్థుల జయకేతనం

**అనంతపురం న్యూటౌన్, జులై 23 ప్రభాతవార్త** రాష్ట్ర స్థాయి పారా స్పోర్ట్స్ మీట్-2026లో జిల్లా దివ్యాంగ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. 8-గోల్డ్ మెడల్స్, 2-సిల్వర్ మెడల్స్, 1-బ్రాంజ్ మెడల్, మొత్తం 11 మెడల్స్ సాధించారు. 7 మంది అనంతపురం జిల్లా దివ్యాంగ విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్షిప్‌లో రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలబెట్టారు. టి.చిన్న, బి.మధు, యం.సుదర్శన్, టి.రాహుల్, బి.తిలక్, పి.ప్రేమ్‌కుమార్, ఆర్.కృష్ణ ప్రవీణ్ విద్యార్థులు 100 మీటర్లు, 200 మీటర్లు, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో జిల్లా ఖ్యాతిని చాటారు. ఈ సందర్భంగా టీ.శైలజ, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష, ఎస్. ఫణిరాజు, సహిత విద్య కోఆర్డినేటర్, సమగ్ర శిక్ష వారు విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ పాల్గొన్నారు.

## ప్రపంచ జూ. స్క్వాష్ క్వార్టర్ ఫైనల్‌కు అనాహత్



**న్యూఢిల్లీ:** ప్రపంచ స్క్వాష్ జూనియర్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ల మహిళల క్వార్టర్ ఫైనల్స్‌కు అనాహత్ సింగ్ చేరుకుంది. టాప్ సీడెడ్ భారత క్రీడాకారిణి అనాహత్ సింగ్ మలేషియాకు చెందిన డోయ్స్ యే సాన్ లీని సునాయాసంగా ఓడించింది. గత ఏడాది కాంస్య పతక విజేత అయిన అనాహత్, ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో తన 13/16వ సీడ్ ప్రత్యర్థిని 11-4, 11-8, 11-3 తేడాతో ఓడించి, తదుపరి ఈజిప్టుకు చెందిన 5/8వ సీడ్ హబీబా రిజ్క్‌తో తలపడనుంది. మహిళల విభాగంలో, ఈజిప్ట్‌కు చెందిన హబీబా రిజ్క్ నాలుగు గేమ్‌ల పోరులో అమెరికాకు చెందిన షార్లెట్ స్జేను ఓడించగా, బెల్జియంకు చెందిన సవన్నా మోక్సామ్ వెనుకబడి ఉన్నప్పటికీ పుంజుకుని హాంకాంగ్, చైనాకు చెందిన ఎనా క్వాంగ్‌ను 3-1 తేడాతో ఓడించింది. మరో జిప్సీ క్రీడాకారిణి మాలికా ఎల్కరక్సీ, అమెరికాకు చెందిన దియా యాదవ్‌పై విజయంతో తదుపరి రౌండ్‌లోకి ప్రవేశించగా, నంబర్ 1 సీడ్ మొహమద్ జకారియా పాకిస్థాన్‌కు చెందిన నౌమాన్ ఖాన్‌పై గెలిచి ముందంజ వేశాడు. ఫ్రాన్స్‌కు చెందిన అమీర్ ఖలీద్‌జౌస్సెలిన్, ఇంగ్లాండ్‌కు చెందిన రోనీ హిక్లింగ్‌పై వరుస గేమ్‌లలో విజయం సాధించగా, హాంకాంగ్, చైనాకు చెందిన హెలెన్ టాంగ్, మలేషియాకు చెందిన హార్లీన్ టాన్‌పై విజయంతో ముందంజ వేసింది. పురుషుల విభాగంలో, టాప్‌ఎనిమిది సీడ్‌లకు సంబంధించి అనేక అనూహ్య ఫలితాలు నమోదయ్యాయి. భారత ఆటగాడు ఆర్యవీర్ దీవాన్ (5/8) అమెరికాకు చెంఇన యాసీన్ షాలాబీ చేతిలో వరుస గేములలో ఓడిపోయాడు. ప్రస్తుత ఆసియా అండర్ 19 ఛాంపియన్ అయిన అతను అమెరికా ప్లేయర్ చేతిలో 4-11, 1-11, 5-11 తేడాతో పరాజయ పాలయ్యాడు.

## చైనా ఓపెన్‌లో సింధు ఓటమి

### ఆయుష్ శెట్టి, లక్ష్య సేన్ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ 2026, రౌండ్ ఆఫ్ 16లో చెన్ యుఫెయ్ చేతిలో భారత్ షట్లరున పీవీ సింధు ఓటమి పాలవ్వగా, ఆయుష్ శెట్టి, లక్ష్య సేన్ పరాజయం పాలై టోర్నీ నుండి నిష్క్రమించారు. చైనాకు చెందిన చెన్ యుఫెయ్ గురువారం భారత క్రీడాకారిణి పివి సింధును 16-21, 22-20, 21-18 తేడాతో ఓడించి, చైనా ఓపెన్ 2026 క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. రెండో గేమ్‌లో సింధుకు నాలుగు మ్యాచ్ పాయింట్లు లభించినప్పటికీ, చెన్ పుంజుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. చివరి గేమ్‌లో, భారత షట్లర్ ఆరంభంలో ఆధిక్యంలో ఉన్నప్పటికీ, చివరి దశలో చెన్ దూసుకువచ్చి టైను ముగించింది. ఇక భారత యువ ఆటగాడు ఆయుష్ శెట్టి ప్రస్థానం కూడా చివరి 16 రౌండ్‌లో ముగిసింది. అతను ఒక గేమ్ ఆధిక్యాన్ని కోల్పోయి ఐర్లాండ్‌కు చెందిన న్హాట్ గుయెన్ చేతిలో 21-15, 13-21, 20-22 తేడాతో ఓడిపోయాడు. ప్రపంచ 28వ ర్యాంకర్ శెట్టి, రెండో గేమ్ ఓడిపోయిన తర్వాత కోలుకుని, నిర్ణయాత్మక సెట్‌లో 19-15 ఆధిక్యం సాధించినప్పటికీ, తన ప్రత్యర్థిని ఆ స్థితి నుండి తొలగించలేకపోయాడు. కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో లక్ష్య సేన్ 19-21, 11-21 తేడాతో ఓడిపోవడంతో, చివర్లో టోర్నమెంట్‌లో భారత్ పోరాటానికి తెరపడింది. కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో లక్ష ్య సేన్ 1921, 1121 తేడాతో ఓడిపోవడంతో, ఆ రోజు చివర్లో టోర్నమెంట్‌లో భారత్ పోరాటానికి తెరపడింది.

## వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్ ఖరారు

### జూన్ 9న నుండి 13 వరకు




ఆట

**న్యూఢిల్లీ:** ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ 2027లో జరగనుంది. దీనికి సంబంధించి ఫైనల్ షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ ఫైనల్ లండన్‌లోని ఓవల్ స్టేడియంలో జరుగుతుంది. ఫైనల్ జూన్ 9న ప్రారంభమై జూన్ 13 వరకు కొనసాగుతుంది. ఈ టోర్నీ 2025లో ప్రారంభమైంది. టెస్ట్ ఛాంపియన్‌షిప్ రెండేళ్ల పాటు కొనసాగుతుంది. ఇందులో 9 జట్లు పాల్గొంటున్నాయి. అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు ఫైనల్ కు చేరుకుంటాయి. 2027 తర్వాత 2029, 2031 టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ల ఫైనల్స్ ఇంగ్లాండ్‌లో జరుగుతాయని ఐసీసీ ఇప్పటికే ప్రకటించింది. గత సంవత్సరం జూన్ 17న బంగ్లాదేశ్‌శ్రీలంక మ్యాచ్‌తో టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్ ప్రారంభమైంది. ఆస్ట్రేలియా ప్రస్తుతం 8 మ్యాచ్‌లలో ఏడు విజయాలతో, 87.5 శాతం పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా 75 శాతం పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. 2023లో భారత్‌ను ఓడించి ఆస్ట్రేలియా టైటిల్ గెలుచుకోగా, 2025లో ఫైనల్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టుకు ఈ ఐసీసీ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సీజన్ అంతగా కలిసి రాలేదు. ఆ జట్టు తొమ్మిది మ్యాచ్‌లలో కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించింది. గతేడాది ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌ను భారత్ డ్రా చేసుకోగా, వెస్టిండీస్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0 తేడాతో గెలుచుకుంది. స్వదేశంలో జరిగిన సిరీస్‌లో దక్షిణాఫ్రికా భారత్‌ను క్లీన్ స్వీప్ చేసింది. భారత జట్టు ఇప్పుడు వచ్చే నెలలో శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది.

## కామన్వెల్త్ గేమ్స్‌లో మాల్టాపై భారత్ విజయం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో మహిళల బౌల్స్ జంటల ప్రారంభ మ్యాచ్‌లో మాల్టాపై భారత్ విజయం సాధించింది. గురువారం జరిగిన మహిళల జంటల విభాగంలో రూపా రాణి టిర్కీ, పింకీ సింగ్, మాల్టాకు చెందిన కోనీ రిక్సన్, రెబెక్కా రిక్సన్‌లను ఓడించడంతో, భారత్ తన కామన్వెల్త్ గేమ్స్ ప్రచారాన్ని విజయంతో ప్రారంభించింది. గ్రూప్ దశ ఆరంభ మ్యాచ్‌లో పోటీపడిన భారత ద్వయం, హోరాహోరీగా సాగిన పోరు అనంతరం టై బ్రేక్‌లో విజయం సాధించింది. పింకీ సింగ్ రాణించడంతో భారత్ ఉత్కంఠభరితమైన తొలి విజయాన్ని కైవసం చేసుకుంది. భారత్ తొలి అర్ధభాగంలో రెండు పాయింట్లు సాధించి బలమైన ఆరంభాన్ని అందుకుంది. ఆ తర్వాత మాల్టా రెండో అర్ధభాగంలో ఒక పాయింట్‌తో ఆధిక్యాన్ని తగ్గించింది. భారత జంట తొలి సెట్ మిగిలిన భాగమంతా ఆధిపత్యం కొనసాగించి, దానిని 7-1 తేడాతో సునాయాసంగా కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో మాల్టా బలంగా పుంజుకుంది. తొలి ఎండ్‌లో పింకీ సింగ్ అద్భుతమైన ఫైనల్ బౌల్ వేసి భారత్‌కు ఆరంభ ఆధిక్యాన్ని అందించగా, రెండవ ఎండ్‌లో మాల్టా పుంజుకుని స్కోర్లను సమం చేసింది. మూడో ఎండ్‌లో భారత్ మళ్లీ ఆధిక్యం సాధించగా, నాలుగో ఎండ్‌లో మాల్టా స్కోరును సమం చేసింది. ఆ తర్వాత మాల్టా ఐదో ఎండ్‌ను కైవసం చేసుకుని రెండో సెట్‌ను గెలుచుకోవడంతో,



మ్యాచ్ టైబ్రేక్‌కు దారితీసింది. టైబ్రేక్ కూడా అంతే ఉత్కంఠభరితంగా సాగింది. మాల్టా మెరుగైన ఆరంభం చేసినప్పటికీ, పింకీ సింగ్ మరోసారి ఒత్తిడిలో రాణించి, కీలకమైన చివరి బంతితో భారత్ నిర్ణయాత్మక ఎండ్‌ను కైవసం చేసుకుని విజయాన్ని ఖాయం చేసుకోవడంలో సహాయపడింది.

## కామన్వెల్త్‌లో తొలిపతకాన్ని ఖరారు చేసిన బాక్సర్ లవ్లీనా



**న్యూఢిల్లీ:** స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో గురువారం జరిగిన ప్రారంభోత్సవానికి ముందే, మహిళల 75 కేజీల విభాగంలో బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించడంతో, 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారతదేశానికి తొలి పతకం ఖరారైంది. 28 ఏళ్ల లవ్లీనా పోటీపడనున్న విభాగంలో కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఫలితంగా, ఈ భారత క్రీడాకారిణికి సెమీఫైనల్స్‌కు నేరుగా ప్రవేశం లభించింది, ఇది ఆమెకు కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేస్తుంది. ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లినా జూలైలో జరిగే సెమీఫైనల్స్‌లో టువాలుకు చెందిన గిరేతీశి తాఫాకితో తలపడనుంది.

లవ్లినాకు ఇది తొలి కామన్వెల్త్ గేమ్స్ పతకం. 2022లో బర్మింగ్‌హామ్‌లో జరిగిన గత ఎడిషన్‌లో, లోవ్లినా లైట్ మిడిల్‌వెయిట్ కేటగిరీ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంది, అక్కడ ఆమె వేల్స్‌కు చెందిన రోసీ ఎక్లెస్ చేతిలో ఓడిపోయింది. వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చానుతో పాటు, గురువారం జరిగే ప్రారంభోత్సవానికి లవ్లీనాను భారత పతాకధారిగా ఎంపిక చేశారు.

## మెర్సిడిస్ బెంజ్ కొత్త కారు విడుదల!

**ముంబయి,జులై 23:** లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ ఇండియా, భారత మార్కెట్లో తన ప్లగ్‌ఇన్ హైబ్రిడ్ పోర్ట్‌ఫోలియోను మరింత బలోపేతం చేసింది. దేశంలోనే తొలి ఎలక్ట్రిఫైడ్ ఏఎమ్‌జీ ఈక్లాస్ సెడాన్ అయిన మెర్సిడెస్‌ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్ 4మేటిక్‌ప్లస్‌ను గురువారం లాంచ్ చేసింది. ఏఎమ్‌జీ బ్రాండ్ అందించే అద్భుతమైన పనితీరుతో పాటు ప్లగ్‌ఇన్ హైబ్రిడ్ టెక్నాలజీ అందించే ఇంధన సామర్థ్యం ఈ కారు సొంతం. ఈ కొత్త సెడాన్ రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. పెర్ఫార్మెన్స్ ఎడిషన్ ధర రూ. 1.45 కోట్లు కాగా, రేసింగ్ ఎడిషన్ ధర రూ. 1.48 కోట్లుగా (రెండు ధరలూ ఎక్స్‌షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. పెట్రోల్ ఇంజిన్, ఎలక్ట్రిక్, ప్లగ్‌ఇన్ హైబ్రిడ్ వంటి విభిన్న పవర్‌ట్రెయిన్ ఆప్షన్లను వినియోగదారులకు అందించాలనే తమ వ్యూహంలో భాగంగా ఈ కారును విడుదల చేసినట్లు మెర్సిడెస్‌బెంజ్ పేర్కొంది. ఈ సందర్భంగా మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోశ్ అయ్యర్ మాట్లాడుతూ భారత ఆటోమోటివ్ పరిశ్రమలో ఈక్లాస్ సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న మోడల్. కొత్త ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్, అద్భుతమైన పనితీరు, రోజువారీ వినియోగానికి అవసరమైన సౌలభ్యం, ఎలక్ట్రిక్ సామర్థ్యం వంటి అంశాలను ఒకేచోట



అందిస్తోంది. రేస్ ట్రాక్ మీద అవసరమైన పెర్ఫార్మెన్స్‌ను, రోజువారీ ప్రయాణాలకు కావాల్సిన ప్రాక్టికాలిటీని ఈ సెడాన్ సమన్వయం చేస్తుందని వివరించారు. మెర్సిడెస్ ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్‌లో 3.0లీటర్ ఇన్‌లైన్ సిక్స్‌సిలిండర్ టర్బోచార్జ్ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 449 హార్స్‌పవర్ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. దీనికి ఏఎమ్‌జీ స్పీడ్‌షిఫ్ట్ టీసీటీ 9జీ ట్రాన్స్‌మిషన్‌లో అనుసంధానించిన 120 కిలోవాట్ల ఎలక్ట్రిక్ మోటార్‌ను జతచేశారు. ఈ రెండూ కలిసి ఏకంగా 585 హెచ్‌పీ (రేస్ స్టార్ట్ ఫంక్షన్‌తో 612 హెచ్‌పీ) శక్తిని, 750 ఎన్ఎం టార్క్‌ను విడుదల చేస్తాయి. ఈ కారు కేవలం 3.8 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని గరిష్ఠ వేగాన్ని ఎలక్ట్రానిక్‌గా గంటకు 250 కిలోమీటర్లకు పరిమితం చేశారు.

## నాలుగోరోజూ సెన్సెక్స్, నిఫ్టీలకు తప్పని నష్టాలు!

**ముంబయి,జులై 23:** మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం ప్రభావంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు గురువారం వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్,మౌలిక వసతులు (ఇన్‌ఫ్రా), పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఆటో మరియు మీడియా రంగాల షేర్లు మాత్రమే స్వల్ప లాభాలను నమోదు చేశాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 363.66 పాయింట్లు క్షీణించి 76,391.39 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 126.65 పాయింట్లు పడిపోయి 23,896.60 వద్ద స్థిరపడింది. గత నాలుగు వరుస



ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 2.25 శాతం, నిఫ్టీ 1.90 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ పతనానికి ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్ షేర్లు కారణమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.01 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.20 శాతం క్షీణించాయి. బిఎస్ఇలో మొత్తం 1,637 షేర్లు లాభపడగా, 2,585 షేర్లు నష్టపోయాయి. మరో 181 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 4.01 డాలర్లు పెరిగి 98.08 డాలర్లకు చేరుకుంది. ముడిచమురు ధరల పెరుగుదలతో పాటు డాలర్ బలపడటంతో రూపాయి బలహీనపడింది. డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ 96.5600 వద్ద ట్రేడైంది. అంతకుముందు సెషన్‌లో ఇది 96.5300 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1%తగ్గి రూ.1,44,222కు చేరుకుంది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పలు కంపెనీల షేర్లలో భారీ కదలికలు నమోదయ్యాయి.ఎటర్నల్ షేరు 0.95 శాతం పెరిగింది.

## ఇన్ఫోసిస్ తొలి త్రైమాసిక లాభం 8.6% తగ్గుదల




**బెంగళూరు,జులై 23:** దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తొలి త్రైమాసికంలో నికరలాభం 8.6 శాతం తగ్గి రూ.7,769 కోట్లకు చేరింది. గత త్రైమాసికంలో ఇది రూ.8,501 కోట్లుగా నమోదైంది. మార్కెట్ అంచనాలు రూ.7,774 కోట్లుగా ఉన్నాయి. అదే సమయంలో కంపెనీ ఆదాయం మాత్రం పెరుగుదలను నమోదు చేసింది. గత త్రైమాసికంలోని రూ.46,402 కోట్లతో పోలిస్తే 3.9 శాతం పెరిగి రూ.48,211 కోట్లకు చేరుకుంది. వడ్డీ, పన్నుల ముందు లాభం 4.3 శాతం పెరిగి రూ.10,163 కోట్లకు చేరగా, గత త్రైమాసికంలో ఇది రూ.9,743 కోట్లుగా నమోదైంది. కంపెనీ ఎబిడిటా మార్జిన్ 20.99 శాతం నుంచి 21.08 శాతానికి పెరిగి 9 బేసిస్ పాయింట్ల వృద్ధిని నమోదు చేసింది. రాబడులపరంగా 1.5 శాతం నుంచి 3.5 శాతం వృద్ధి ఉంటుందని పేర్కొనగా, తాజా అంచనాలో దానిని 1.5 శాతం నుంచి 3 శాతం మధ్యకు సవరించింది. ఆపరేటింగ్ మార్జిన్ మార్గదర్శకత్వాన్ని మాత్రం 20 నుంచి 22 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది.ఎఐ సేవల ద్వారా బలమైన వృద్ధికంపెనీ సీఈఓ సలిల్ పారేఖ్ మాట్లాడుతూ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలకు మంచి డిమాండ్ కొనసాగుతోందని తెలిపారు. జూన్ త్రైమాసికంలో స్థిర కరెన్సీ ప్రాతిపదికన కంపెనీ ఆదాయం 1 శాతం పెరిగిందని చెప్పారు. మొత్తం తొలి త్రైమాసిక ఆదాయంలో ఎఐ సేవల వాటా 8.2 శాతంగా నమోదైందని కంపెనీ నాయకత్వ మార్పులో భాగంగా అశిష్ కుమార్ దాస్‌ను 2027 మార్చి 31 వరకు సిఇఒడిజిగ్నేట్‌గా నియమించింది. అనంతరం ఏప్రిల్ నుంచి ఆయన పూర్తి స్థాయి సీఈఓ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉద్యోగులకు రెండు విడతల్లో వేతన పెంపుఇన్ఫోసిస్ సిఎఫ్‌వో జయేష్ సంగ్‌రాజ్‌కా మాట్లాడుతూ, ఉద్యోగుల వార్షిక వేతన పెంపును రెండు విడతల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. షేర్ ధత్రైమాసిక ఫలితాల ప్రకటనకు ముందు బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేరు రూ.1,051.80 వద్ద స్వల్ప నష్టంతో ముగిసింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు షేరు ధర 35 శాతానికి పైగా క్షీణించగా గత 12 నెలల్లో సుమారు 33.5 శాతం పడిపోయింది.

## రాబడుల్లో వృద్ధి, తగ్గిన మీషో నష్టాలు!

**ముంబయి,జులై 23:** ఈకామర్స్ సంస్థ మీషో తొలి త్రైమాసికంలో తన పనితీరును మెరుగుపరుచుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ నికర నష్టం దాదాపు సగానికి తగ్గగా, ఆదాయం భారీగా పెరిగింది. కంపెనీ రూ.132.8 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ నష్టం రూ.289.3 కోట్లుగా ఉంది. మరోవైపు, కంపెనీ ఆదాయం 48.3 శాతం పెరిగి రూ.3,713 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2,504 కోట్లు.వడ్డీ, పన్నులు, తరుగుదల, అమోర్టైజేషన్‌కు ముందు లాభనష్టం పరంగా కూడా కంపెనీ మెరుగుదల నమోదు చేసింది. ఎబిడిటా నష్టం




రూ.264.4 కోట్ల నుంచి రూ.224.7 కోట్లకు తగ్గింది. వ్యాపార విస్తరణలో భాగంగా, తన అనుబంధ సంస్థ మీషో గ్రోసరీస్లో రూ.75 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటించింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ నెట్ మెర్చండైజ్ విలువ 34 శాతం పెరిగి రూ.11,614 కోట్లకు చేరుకుంది. మార్కెట్‌ప్లేస్ ఆదాయం 48 శాతం పెరిగి రూ.3,707 కోట్లకు చేరింది. వినియోగదారులు, ఆర్డర్లలో గణనీయమైన పెరుగుదమీషో వార్షిక లావాదేవీలు నిర్వహిస్తున్న వినియోగదారుల సంఖ్య 29 శాతం పెరిగి 27.4 కోట్లకు (274 మిలియన్లు) చేరింది. ఒక్కో వినియోగదారు ఏడాదికి చేసే కొనుగోళ్ల సగటు సంఖ్య 10.3 ట్రాన్సాక్షన్లకు పెరిగింది.అదే విధంగా, కంపెనీకి వచ్చిన మొత్తం ఆర్డర్లు కూడా 29 శాతం పెరిగి 72.5 కోట్లకు (725 మిలియన్లు) చేరాయి.నగదు ప్రవాహంలో మెరుగుదగత 12 నెలల ఫ్రీ క్యాష్ ఫ్లో మైనస్ రూ.633 కోట్ల నుంచి మైనస్ రూ.537 కోట్లకు మెరుగుపడింది. త్రైమాసికంలో షిప్ చేసిన ఆర్డర్లలో సుమారు 37 శాతం ప్రీపెయిడ్ ఆర్డర్లే ఉన్నాయని కంపెనీ వెల్లడించింది.త్రైమాసిక ఫలితాల ప్రకటనకు ముందు ఎన్ఎస్ఈలో మీషో షేరు 0.48 శాతం తగ్గి రూ.188.95 వద్ద ముగిసింది. అదే రోజు నిఫ్టీ సూచీ 0.53 శాతం క్షీణించింది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటివరకు మీషో షేరు దాదాపు 5 శాతం లాభపడింది.




Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ పిజిఆర్ఎస్ క్యూఆర్ కోడ్‌ను అర్జీదారుడు వినియోగించు కోవాలి

**-జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**



**భీమవరం జులై 23 ప్రభాతవార్త** పి.జి.ఆర్.ఎస్ లో సమస్యల పరిష్కా రానికి దరఖాస్తు చేసుకున్న అర్జీదారులు తదుపరి తమ సమస్య పరిష్కారం అయిన తరువాత అర్జీదారులు ముఖ్యమంత్రి కార్యాలయం పి జి ఆర్ ఎస్ విభాగం రూపొందించిన క్యూఆర్ కోడ్ ను ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం పి.జి.ఆర్ ఎస్ సమావేశ మందిరంలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు తమ సమస్యలు పి.జి.ఆర్.ఎస్ లో నమోదు చేసుకున్న అనంతరం అధికారు లు తమ సమస్యల పై ఏ విధంగా స్పందించి పరిష్కార మార్గం చూపారో తమ అభిప్రాయాన్ని నిర్భయంగా ప్రభు త్వానికి తెలియ చేసుకునే విధంగా క్యూఆర్ కోడ్ ను రూపొందించడం జరిగిందని అన్నారు. "క్యూఆర్ కోడ్ " ను ఉపయోగించుకొని మీరు పెట్టుకున్న అర్జీ నెంబర్ కి ఫీడ్ బ్యాక్ ఇస్తే, తదుపరి సంబంధిత అధికారి స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. దీనివలన అధికారులు సమస్య లపై పారిదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించి సకా లంలో సమస్యలను సత్వరంగా పుష్క రిస్తారని అన్నారు. అర్జీదారులు మొబైల్ లోనే క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాన్ని నిర్భయంగా తెలియ చేయవచ్చని అన్నారు. దీనివలన ప్రజల సమస్యలు పారదర్శకంగా, సత్వరమే పరిష్కారం అవటమే కాక అధికారుల జవాబుదారితనం తెలియజేస్తుందని అన్నారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులు అందరూ ముఖ్య మంత్రి కార్యాలయ పి జి ఆర్ ఎస్ విభాగం రూపొందించిన క్యూఆర్ కోడ్ ను తమ కార్యాలయా లందు ప్రదర్శించి ప్రజలకు అందు బాటులో ఉండే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి.ప్రభాకర్, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై దోసి రెడ్డి, డ్వామా పిడి కె. అప్పారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ విజయవంతం చేయాలి :కలెక్టర్ నాగరాణి

**భీమవరం, జూలై 23 ప్రభాతవార్త** జిల్లాలో నేడు నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమానికి జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ హాజరై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరం నుండి గురువారం పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కార ప్రగతి, ప్రజా సానుకూల స్పందన, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ అంశాలపై ఆర్డీవోలు, జిల్లా డివిజనల్,మండల స్థాయి అధికారులు, తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రగతిపై శాఖల వారీగా సమీక్షించి పి జి ఆర్ ఎస్ దరఖాస్తులను నిర్దేశించిన సమయంలో ఫిర్యాదుదారు సంతృప్తి పడే విధంగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన పీజీఆర్ఎస్ దరఖాస్తులను ఆడిట్ పూర్తి చేయాలన్నారు. ప్రజా సానుకూల స్పందనలో శాఖల వారీగా ర్యాంకులను సమీక్షిస్తూ ప్రజా సానుకూల స్పందనలో జిల్లా మొదటి స్థానంలో ఉండే విధంగా జిల్లా అధికారులు కృషి చేయాలన్నారు. 24 వ తేదీ శుక్రవారం జిల్లాలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు, తాసిల్దారులు, ఎంపీడీవో లు తప్పనిసరిగా హాజరవాలన్నారు. అంతేకాకుండా ప్రతి 10 రోజులకు ఒకసారి జిల్లా అధికారులు అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలు ,హాస్టల్స్ సందర్శించి విద్యార్థుల క్షేమాలు తెలుసుకొని వారితో కలిసి భోజనం చేయాలన్నారు. తద్వారా అధికారులు మా వెంట ఉన్నారన్న మనో ధైర్యం వారికి కలుగుతుందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి మెగా పేరెంట్ టీచర్స్ మీట్ ను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో పి జి ఆర్ యస్ నోడల్ అధికారి వై.దోసి రెడ్డి, ఆర్డీవోలు, తాసిల్దార్లు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.

## పెట్రోలియం, సహజ వాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో పాల్గొన్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్



**ఢిల్లీ / ఏలూరు, జూలై 23 ( ప్రభాత వార్త)**పెట్రోలియం ు సహజ వాయువు మంత్రిత్వ శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశం గురువారం పార్లమెంటు భవనంలోని సమన్వయ్-5 హాలులో నిర్వహించారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘం సభ్యుడిగా ఉన్న ఏలూరు లోక్‌సభ సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో, దేశంలోని పెట్రోలియం రంగ అభివృద్ధి, ఇంధన భద్రత, భవిష్యత్ ఇంధన విధానాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా పోటీ బిడ్డింగ్ విధానాలు, ఇంధన రిటైల్ మౌలిక సదుపాయాల విస్తరణ, అలాగే ప్రత్యామ్నాయ మరియు స్వచ్ఛమైన ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించే చర్యలు సమావేశంలో ప్రధాన చర్చాంశాలుగా నిలిచాయని పేర్కొన్నారు. దేశ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకొని పారదర్శక విధానాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యావరణహిత ఇంధన వినియోగాన్ని మరింత వేగవంతం చేయాల్సిన అవసరంపై సభ్యులు అభిప్రాయాలు వ్యక్తం చేసినట్లు తెలిపారు.



## విరమించని లేఖర్ల ఆందోళన



**నరసాపురం జూలై 23 ప్రభాతవార్త** దస్తావేజు లేకర్లు ఆందోళన కొనసాగిస్తున్నారు. నరసాపురం కార్యాల స్థానిక దస్తావేజు లేఖర్లు తమ ఆందోళన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర నాయకులు మోసం చేసారని ఎద్దేవా చేశారు.

## కోడి రామకృష్ణ సేవా రత్న అవార్డు అందుకున్న కొత్త శ్రీనివాస్



**భీమవరం జులై 23 ప్రభాతవార్త** ఈనెల 23న హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో జరిగిన కోడి రామకృష్ణ ఫిల్మ్ అవార్డు -2026 ప్రదానోత్సవంలో భీమవరానికి చెందిన కొత్త శ్రీనివాస్ కోడి రామకృష్ణ సేవా రత్న అవార్డును అందుకున్నారు. దివంగత దర్శకుడు కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం పలువురు సినీ, సామాజిక రంగ ప్రముఖులకు 'కోడి రామకృష్ణ పురస్కారాలు' అందజేస్తూ వస్తున్నారని, దీనిలో భాగంగా భీమవరంలో విశిష్ట సేవాతత్పరుల, పశ్చిమ గోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి, డిఎన్నార్ కళాశాల కోశాధికారి, మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్ సలహామండలి సభ్యులుగా, చిన్మయ మిషన్ కార్యదర్శిగా ఎన్నో సేవాలందిస్తున్న కొత్త శ్రీనివాస్ ఈ సేవా రత్న అవార్డును అందుకున్నారు. ఫౌండర్ చైర్మన్ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, అవార్డ్స్ కమిటీ చైర్మన్ వీర శంకర్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు, సినీ నటులు పద్మశ్రీ మురళీమోహన్, సుమన్,దివ్యవాణి, బాబుమోహన్, ప్రముఖ నిర్మాత అంబికా కృష్ణ పలువురు సినీ ప్రముఖులచే కోడి రామకృష్ణ సేవా రత్న అవార్డును కొత్త శ్రీనివాస్ అందుకున్నారు. సేవారత్న అవార్డును సాధించిన శ్రీనివాస్ ను భీమవరం పట్టణ ప్రముఖులు, మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్ ు కన్వీనర్ బొండా రాంబాబు,వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ వాలేటి శ్రీనివాస్, శోభన్ బాబు సేవాసమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు, భీమవరం బులియన్ అసోసియేషన్ అధ్యక్షులు కోట్ల నాని, కురిశెట్టి కాశి, జూలూరి గోపి రాజు,గుండు సుమూర్తి, అనంతపల్లి సుబ్బారావు, సంకా బాబు, చవ్వా భామ కృష్ణమూర్తి, బంధు మిత్రులు, స్నేహితులు పాలుగొన్నారు

## జిల్లాలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగపండుగ వాతావరణంలో నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**



**భీమవరం జులై 23 ప్రభాతవార్త** జిల్లాలో అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలో 24వ తేదీ (శుక్రవారం) నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా, డివిజనల్, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. శుక్రవారం జిల్లాలో నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు, మౌలిక సదుపాయాల కల్పన,డిజిటల్ విద్య అంశాలపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించడమే ఈ సమావేశాల ఉద్దేశం అన్నారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులు ఈ సమావేశానికి తప్పనిసరిగా తీసుకువచ్చే విధంగా చూడాలన్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా, అహ్లాదకర వాతావరణం ఉట్టిపడేలా పాఠశాలలను మామిడి తోరణాలు,పూలతో అలంకరించాలన్నారు. తల్లిదండ్రులకు వారి పిల్లల హాజరు, అభ్యాసనా ఫలితాలు, పాఠశాలలలో ఉన్న మౌలిక సదుపాయాలు, భోధన సామాగ్రి వంటి అంశాలను వారికి అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్లో లీప్ యాప్ డౌన్లోడ్ చేయించి ఈ యాప్ ద్వారా కలిగే ప్రయోజనాలను వారికి తెలియజేయాలి అన్నారు. స్థానిక దాతలను గుర్తించి పాఠశాలలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పనకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశానికి హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు త్రాగునీరు, భోజన వసతి కల్పించాలన్నారు. విద్యాశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా విద్యాశాఖ అధికారి ఈ నారాయణ సర్వ శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి శ్యాంసుందర్ జిల్లాలోని డిప్యూటీ విద్యాశాఖ అధికారులు మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల క్రీడా ప్రాంగణంలో మద్యం ఆనవాళ్లు... కలకలం రేపిన ఘటన

**మద్యం సీసాలు, బీర్ బాటిళ్లు కలకలం... విద్యార్థుల భద్రతపై ప్రశ్నలు -- కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**



**ద్వారకాతిరుమల, జులై 23 (ప్రభాతవార్త):** ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని దేవస్థానం హైస్కూల్ క్రీడా ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందనే ఆరోపణలు స్థానికుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పాఠశాల మైదానంలో రాత్రి వేళల్లో కొందరు మద్యం సేవిస్తున్నారనే సమాచారం నేపథ్యంలో అక్కడ భారీగా ఖాళీ బీర్ బాటిళ్లు, మద్యం సీసాలు కనిపించడం కలకలం రేపుతోంది. పాఠశాల గ్రామ నడిబొడ్డున ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు, యువకులు ఈ క్రీడా ప్రాంగణాన్ని వినియోగిస్తుంటారు. అయితే మైదానంలో మద్యం సీసాలు, పగిలిన గాజు ముక్కలు కనిపించడం వల్ల విద్యార్థుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పగిలిన గాజు సీసాల కారణంగా కొందరు విద్యార్థులకు గాయాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇలాంటి దృశ్యాలు విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, విద్యా వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయని గ్రామస్తులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైన్ షాపులు, మద్యం విక్రయ కేంద్రాలు పాఠశాలలకు దూరంగా ఏర్పాటు చేసినప్పటికీ, మద్యం సేవించే కొందరు వ్యక్తులు పాఠశాల క్రీడా ప్రాంగణాన్నే వేదికగా ఎంచుకోవడం అత్యంత బాధ్యతారాహిత్యమని స్థానికులు మండిపడుతున్నారు. పాఠశాల అనేది విద్యా దేవాలయంగా భావించే పవిత్రమైన ప్రదేశం. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం విశ్వాసంతో పంపే విద్యాలయం ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారడం అత్యంత హేయమైన చర్యగా గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో మద్యం సేవించడం, మద్యం సీసాలు, బీర్ బాటిళ్లు వదిలివేయడం వంటి ఘటనలు విద్యార్థులకు తప్పు సంకేతాలు పంపడమే కాకుండా, విద్యా వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు, పోలీసులు, దేవస్థానం యాజమాన్యం వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. క్రీడా ప్రాంగణంలో రాత్రివేళల్లో పోలీసు నిఘా పెంచడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు, భక్తులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. విద్యాలయాల పవిత్రతను కాపాడటం సమాజం మొత్తానికి బాధ్యత అని, విద్యార్థులకు సురక్షితమైన, స్వచ్ఛమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## నల్లి క్రీక్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే నాయకర్



**నరసాపురం జూలై 23 ప్రభాతవార్త** నరసాపురం మండలంలోని పి.ఎం. లంక గ్రామం వద్ద పూర్తయినలినల్లి క్రిక్ మట్టి పూడికతీత పనులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఇరిగేషన్ మరియు డ్రెయినేజ్ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పెదమైనవానిలంక నుండి చినమైనవానిలంక వరకు పంటిపై ప్రయాణిస్తూ, డీ-సిల్టింగ్ అనంతరం గట్టులు పటిష్టంగా ఉన్నాయా, పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తయ్యాయా అనే అంశాలను స్వయంగా పరిశీలించారు. గట్టుల బలోపేతం, నీటి ప్రవాహం సక్రమంగా ఉండేలా చేపట్టిన చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులకు డీ-సిల్టింగ్ పనుల కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా సముద్రం మరియు నల్లి క్రిక్‌కు అనుసంధానంగా అవసరమైన ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, నల్లి క్రిక్ డీ-సిల్టింగ్ పనుల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున తగిన పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తానని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ హామీ ఇచ్చారు. అనంతరం గట్టులు ఎక్కడైనా బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, భవిష్యత్తులో వరదల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, జిల్లా మత్స్యకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ వలవల నాని, ఏ ఎం సి చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా,మొగల్తూరు సొసైటీ అధ్యక్షులు నిప్పులేటి తారకరామారావు, మైల శివ, ఒడుగు ఏసు, అడ్డాల శ్రీనివాస్,ఇరిగేషన్ ఎస్ ఇ జి గోపాల్, డ్రైన్స్ ఇఇ సత్యనారాయణ, డ్రైన్స్ డి ఇ మురళీకృష్ణ, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు జనసైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.







## ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోండి

**-ఎంఈఓ 2 శ్రీనివాస్**



**చాట్రాయి, జులై 23 ప్రభాతవార్త** మండలంలో అన్ని పాఠశాలలోని విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకొని మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మండల విద్యా శాఖధికారి 1 మాసగిరి శ్రీనివాస్ అన్నారు గురువారం ఆరుగొలనుపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల రికార్డు లను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజనం స్వయంగా విద్యార్థులకు వడ్డించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు అనేక సదుపాయాలు అందిస్తున్నట్లు చెప్పారు. 24 న జరగబోయే మెగా పేరెంట్స్ డే మీటింగ్ కు తల్లిదండ్రులు హాజరు అయ్యి విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని చెప్పారు. అమ్మ కు వందనం నగదు తల్లుల ఖాతాలకు జమ చేసిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కు మండల విద్యా శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల టీడీపీ అధ్యక్షులు ఇజ్జగాని వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు చంద్రు,సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



**టి నరసాపురం జులై 23 ప్రభాతవార్త** సామాజిక సేవా కార్యకర్తల సేవలు పూర్తిగా దాయకమని మండల విద్యాశాఖ అధికారి టి.రామ్మూర్తి అన్నారు. టి.నర్సాపురం గ్రామానికి చెందిన దాతలు సందేపూడి పినాకపాణి, మండం ఆదిత్యల సహకారంతో గండిగూడెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సామాజిక కార్యకర్తలు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్యఅతిథిగాహాజరైమాట్లాడారు. విద్యకు సంబంధించి అన్ని ప్రభుత్వాలే చేస్తాయని అనుకోవడం కంటే, స్వచ్ఛంద సంస్థలు కూడా విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. మేము సైతం మిత్ర బృందం ఆధ్వర్యంలో టి.నర్సాపురం మండలంలో చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు దాతలను కూడా అభినందించారు. ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు కొనసాగించాలని ప్రోత్సహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు ఎస్ డి నాసర్ పాషా ,కొరివి శేషారావు, పింగుల మధు, ప్రగడ భద్రయ్య నాయుడు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి కుమారి , వెంకటేశ్వరావు , రామకృష్ణ, టంగుటూరి రామాంజిబాబు, నాగలక్ష్మి, రంగమ్మ, గణేష్, చంద్రావతి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు పెంచాలి : కోనాల



**భీమవరం టౌన్,జులై 23 : ప్రభాతవార్త** రాష్ట్ర పౌర సరఫరాల శాఖలో పనిచే స్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మెరు గైన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఏపీ సివి ల్ సప్లైస్ కార్పొరేషన్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లా యీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువా రం భీమవరంలోని జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిం చారు. అనంతరం పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎం.డి ఇబ్రహీంకు వినతిప త్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీ యూసీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్య క్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖలో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగు లు అతితక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం తీవ్ర భారంగా మారింద న్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నిరం తరం పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యో గుల వేతనాలను జీవన వ్యయానికి అనుగుణం గా పెంచడం అత్యవ సరమని పేర్కొన్నా రు.డిగ్రీ అర్హతతో పౌర సరఫరాల శాఖలో విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు కనీసం రూ.36,000 వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే సీనియారిటీ ఆధారంగా వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం “సమాన పనికి సమాన వేతనం” సూత్రాన్ని అమలు చేయా లని కోరారు. గత ఎన్నికలసమయంలో ఇచ్చిన హామీ మేరకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా నియ మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఏఐటీయూసీ జిల్లా నాయ కులు చెల్లబోయిన రంగారావు, ఎం. సీతా రాం ప్రసాద్, పౌర సరఫరాల శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం నాయకు లు కొనకళ్ళ వినయ్, జె. రాజే ష్,ఎన్. రమే ష్,కె.సాయిచరణ్,జి.శాయి,టి.బి.వందన,వై.రమేష్,కె.అంజనాదేవి,ఎం.శ్రీ ను,ఎం.రూథర్ కింగ్, జీవీఆర్ గోపి తదితరులు పాల్గొని ధర్నాకు నాయక త్వం వహించారు.

## అభివృద్ధి, సంక్షేమంపై ఎమ్మెల్యే పితాని సమీక్ష




**ఆచంట, జూలై-24, (ప్రభాతవార్త)** ఆచంట నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయంలో ఆచంట మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధికారులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు పాల్గొని వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామాల వారీగా పెండింగ్ సమస్యలు, ప్రజలకు మెరుగైన సేవల అందింపుపై సమగ్రంగా సమీక్షించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి జి పిచ్చయ్య ఆచంట మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమార్, ఆచంట తహసిల్దార్ ఎన్.ఎస్.ఎస్.ఎస్ కుమార్, ట్రాన్స్-,కో ఏడి బి.ఎస్.ఎస్ కృష్ణ మోహన్, పంచాయతీరాజ్ డిఇ కృష్ణమూర్తి, పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు తదితరులు

## దోమల నిర్మూలన మందు అన్ని పంచాయతీలకు సరఫరా చేయాలి



**అత్తిలి, జూలై 23( ప్రభాతవార్త)** ప్రస్తుత వర్షాకాలంలో దోమల నిర్మూలనకు అన్ని పంచాయతీలకు దోమల నిర్మూలన మందు పంపిణీ చేసే లా వైద్య ఆరోగ్యశాఖ వారు చర్యలు తీసుకోవాలని అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యరావు కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సూర్యారావు అధ్యక్షతన జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోదోమల నిర్మూలన మందు ఉన్నప్పటికీ పంపిణీ చేయడంలో జాప్యం తగదని ఆయన అన్నారు. అందుబాటులో ఉన్న మందును వెంటనే పంపిణీ చేయాలని అన్నారు. జలజీవన్ పథకం కింద పైపులైను వేసిన కాంట్రాక్టర్లకు వెంటనే నిధులు మంజూరయ్యేలా చూడాలని ఎంపీపీ సూర్యరావు కోరారు. ఈడూరు గ్రామంలో మంచినీరు పరిశుభ్రంగా లేదని మండల ఉపాధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు అన్నారు. అత్తిలిలో పైపులైన్లు కలెక్షన్లు ఇంకా ఇవ్వలేదని ఎంపీటీసీ బుద్దాల రాంబాబు తెలిపారు. వెంటనే పైపులైన్లు కలెక్షన్లు ఇవ్వాలని కోరారు. మండలంలో విద్యుత్ కోతలను తగ్గించాలని ఎంపీపీ సూర్యరావు కోరారు. అత్తిలి దెబ్బతిన్న కరెంటు స్తంభాలను మార్చాలని ఎంపిటిసి బుద్దాల రాంబాబు కోరారు. మండలంలోని అధికారులు సమర్థవంతంగా పనిచేసి మండలానికి, శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణకు పేరు తేవాలని ఎంపీపీ సూర్యారావు కోరారు. శాసనసభ్యుడు నియోజకవర్గ అభివృద్ధి కోసం రేయింబవళ్లు పనిచేస్తున్నారని తెలిపారు. మండలంలో 1750 కౌలు రైతు కార్డులను రెన్యూవల్ చేసినట్లు వ్యవసాయ అధికారి టి కే రాజేష్ తెలిపారు. రైతులకు యూరియా ఇబ్బంది లేదని అన్నారు. ఉర దా ళ్ల పాలెం లో నిర్మించిన మినీ గోకులంకు నిధులు పూర్తిస్థాయిలో మంజూరు కాలేదని ఎంపీటీసీ గుండుమోగుల శ్రీనివాస్ తెలిపారు. 47 టన్నుల పశువుల దాణాను సగం సబ్సిడీపై రైతులకు అందజేసినట్లు పశుసంవర్ధక అధికారి శంకర్ బావ నారాయణ తెలిపారు. శాసనసభ్యుడు రాధాకృష్ణ కృషితో వనుంవారిపాలెం, మంచిలి గ్రామాలకు రక్షిత నీరు అందించగలిగినట్లు ఆర్ బ్ల్యూఎస్ ఏఈ ఎం బుచ్రా తెలిపారు. వరిగెడు గ్రామంలో 13 మందికి గతంలో మంజూరు చేసిన ఇండ్ల పట్టాలు వెంటనే ఇవ్వాలని జెడ్పిటిసి అద్దాల జానికి కోరారు. దువ్వ నుంచి అత్తిలికి రెండవ విద్యుత్ లైన్ నిర్మించడం వల్ల మండలం లో విద్యుత్ సమస్యలు తీరతాయని ట్రాన్స్కో ఏయి ఓ.హెచ్. సురేష్ కుమార్ తెలిపారు. తల్లికి వందనం కింద అత్తిలి మండలంలో 8106 మందికి 10 కోట్ల 53 లక్షల 78 వేలు అందజేసినట్లు మండల విద్యాధికారి ఎం వి ఎల్ కె ప్రసాద్ తెలిపారు. ఐసిడిఎస్ ద్వారా మండలంలో 13 వందల మంది పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు పర్యవేక్షకురాలు ఎం విజయ్ కుమారి తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, తదితరులు మాట్లాడారు. జడ్పీ కోఆప్టర్ సభ్యుడు హబీబుద్దీన్, మండల ఉపాధ్యక్షురాలు కొనకళ్ల విజయనిర్మల, తాసిల్దార్ పద్మావతి, ఎంపీడీవో జీకే అన్నపూర్ణేశ్వరి,మంచిలి, ఒరిగేడు సొసైటీ అధ్యక్షులు ఇందుకూరి వెంకట సుబ్బరాజు, కడలి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధం

**గణపవరం, జూలై 23 (ప్రభాతవార్త )** నిడమర్రు మండలం, భువనపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో20 ఎకరాల గడ్డివామి దగ్ధమైంది. కోసూరి వెంకటేశ్వరరావు కు చెందిన గడ్డివామి దగ్ధం కావడంతో లక్ష రూపాయలు విలువ చేసే గడ్డి బుగ్గి పాలయింది. ప్రమాద వివరాలు తెలిసిన వెంటనే అత్తిలి అగ్ని మాపక దళాధికారి కే. గంగరాజు ఆధ్వర్యంలో బృందం తరలి వెళ్లి మంటలను ఆర్పేశారు. రెండు లక్షలు విలువచేసే గడ్డిని కాపాడారు. నిర్లక్ష్యంగా కాల్చిపడేసిన సిగరెట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు.

## శ్రీ శ్రీ శ్రీ కండిగలమ్మ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించిన జనసేన ఇన్‌చార్జ్ సువర్ణ రాజు

**-డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆరోగ్యంగా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని ప్రత్యేక ప్రార్థనలు**



**ద్వారకాతిరుమల,జూలై 23 ప్రభాతవార్త:** ద్వారకాతిరుమలలోని శ్రీ కండి గలమ్మ అమ్మవారికి గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు గురువారం ఆషాఢ మాసం సందర్భంగా సారె సమర్పించారు. మండల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయం, అభివృద్ధి అన్ని రంగాల్లో రాష్ట్రం పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. శ్రీ కండి గలమ్మ అమ్మవారి ఆలయాన్ని భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దిన చిలుకూరి ధర్మారావు కుటుంబ సభ్యుల సేవలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండల జనసేన పార్టీ అధ్యక్షుడు దాకారపు నరసింహమూర్తి, సున్నంపల్లి సొసైటీ అధ్యక్షుడు సాయి సుధాకర్, వెంకటకృష్ణాపురం సొసైటీ అధ్యక్షుడు అద్దంకి సోమశేఖర్, జనసేన సీనియర్ నాయకుడు తరగళ్ల శ్రీనివాసరావు, వీర మహిళ అరుణకుమారి, ఓం నమశ్శివాయ కొత్తపల్లి సొసైటీ డైరెక్టర్ మహంకాళి హరిబాబు, జనసేన ఐటీ కోఆర్డినేటర్ ఉనమట్ల సత్య, దూమంత్రగూడెం జనసేన పార్టీ అధ్యక్షుడు గుడిసెపోసే వెంకటరత్నం, నల్లజర్ల మండల కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు, పీకన్నాపురం గ్రామ అధ్యక్షుడు పండు, ఐఎస్ రాఘవపురం పార్టీ అధ్యక్షుడు నాగాంజనేయులు, గుండుగొలనుకుంటకు చెందిన జనసేన నాయకుడు పవన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి విశేష స్పందన



**తణుకు, జూలై 23( ప్రభాతవార్త)** తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ ఏడిఎల్ సుధారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన దయ ల్ యువర్ డి. యం. ప్రోగ్రామ్ కి విశేష స్పందన వచ్చిందని డిపో మేనేజర్ సుధారాణి తెలిపారు. దువ్వ లో అమలాపురం బైపాస్ బస్ లు ఆపాలని, అత్తిలి పార్క్ నుండి రేలంగి టికెట్ కొడుతున్నారని అత్తిలి టికెట్ ఇచ్చేలా చూడాలని, కొత్తగా నడుస్తున్న నిడదవోలు - తణుకు వయా వేలివెన్ను బస్సు రోజూ తిరగడం లేదని తెలిపారు. పెరవలి శివారు లోని నక్కా వారి పాలెం రామారావు హోటల్ దగ్గర రిక్వెస్ట్ స్టాప్ కావాలని, 12-30 విజయవాడ ఎక్స్‌ప్రెస్ బస్సు తరచుగా తణుకు లో ఆలస్యం గా బయలు దేరుతుందని తెలిపారు. రెగ్యులర్ ప్రయాణికులు సమస్యలు తెలిపారని అన్నారు. అన్ని సమస్యలు క్షుణం గా పరిశీలించి చాలా వరకు పరిష్కరిస్తామని డిఎం తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆఫీస్ సూపరిండెంట్ కొత్తలంక శేఖర్ పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 1235 అమలు చేయాలి

**-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్**



**ఆగిరిపల్లి, జులై 23 ప్రభాతవార్త** దళితవాడలో కనీస సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె లోకనాథం విమర్శించారు. గురువారం సామాజిక శంఖారావం లో భాగంగా ఆగిరిపల్లి మండలం చిన్న ఆగిరిపల్లి గ్రామంలో సామాజిక శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా దళితులు ఉపయోగించుకుంటున్న స్మశానాన్ని భూమిని పరిశీలించడం జరిగింది. అప్పటికే 80 సెంట్లు పైగా ఈ స్మశాన భూమి ఆక్రమణ జరిగిందిఅని,రాష్ట్రంలో ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్న, దళితుల జీవితాల్లో ఎలాంటి మార్పు లేదని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ళు నిండిన నేటికీ 5 అడుగుల జాగా కోసం దళితుల పోరాడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దళితులు పుట్టిన దగ్గర నుండి చచ్చేవరకు చివరికి ఖననం చేసుకోవడానికి కూడా భూమి లేక నానా అవస్థలు పడుతున్నారని మండి పడ్డారు. రాజధాని కి కూతవేట దూరంలో ఉన్న ఆగిరిపల్లి మండలంలోని ఇలాంటి దుస్థితి ఏర్పడిందంటే ఈ రాష్ట్ర అభివృద్ధి ఎవరి ఆధీనంలో ఉందో అర్థమవుతుందన్నారు. ఎవరు చెప్పు చేతుల్లో అధికారులు పనిచేస్తున్నారో కొత్తగా చెప్పనక్కర్లేదన్నారు. దళితులు స్మశాన భూమి ఆక్రమణకు గురికాకుండా అధికారులు వచ్చి కొలతలు వేసిన ఆ రాళ్ళను వేస్తే వాటిని కూడా పీకి వేసి భూమిని ఆక్రమించుకున్న రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం సిగ్గుచేటు అన్నారు. దళితుల స్మశాన వాటిక ఆక్రమించుకుంటుంటే రెవెన్యూ శాఖ అధికారులు నిద్రపోతున్నారని విమర్శించారు. దళితులు నివాసం ఉంటున్న కాలనీలో కనీసం మంచినీరు కూడా లేక ఉన్న నీరు శుద్ధ నీరు కావడంతో గుక్కెడి నీరు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగడానికి నీరు కొనుక్కునే దుస్థితి ఏర్పడిందన్నారు. పేదల స్మశాన వాటికకు రక్షణ కల్పించాల్సిన జీవోలు అమలు చేయడంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. 1235 జీవోను వెంటనే అమలు చేసి దళితులకు స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని, చుట్టూ ఫెన్సింగ్, షెడ్డు, మంచినీరు బోరు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఒకపక్క రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధి పెట్టుబడిదారులు, పరిశ్రమల అభివృద్ధి పేరుతో పేదల భూములను పెద్దలకు కట్టబెట్టే విధంగా జీవోలు, ఆర్డర్లు తీసుకొస్తున్నారని మండిపడ్డారు. ఏళ్ల తరబడి భూమి కోసం పోరాడుతూ భూమిలో ఉంటూ సాగు చేస్తున్న పేదల భూములను పెద్దలు కట్టబెట్టాలని ప్రయత్నాన్ని మానుకోవాలని కోరారు. రెవెన్యూ శాఖ అధికారులు కలగజేసుకొని చిన్న ఆగిరిపల్లి పేదలు సాగు చేసుకున్న కొండా పోరంబోకు భూములను వాళ్లకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితుల యొక్క సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సత్తుకోటేశ్వరరావు, మండల నాయకులు అర్జున్ రావు, మోహన్ రావు,రంగారావు, రంజిత్, కవిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్ల పర్వం.

**-అధ్యక్ష పదవికి వల్లభరావు జ్ఞానానంద్ నామినేషన్లు దాఖలు**



**నరసాపురం జులై 23 ప్రభాతవార్త** నరసాపురం బార్ అసోసియేషన్కు ఎన్నికలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మొదటిరోజు గురువారం వివిధ పదవులకు ఎనిమిది నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారి నక్క కుమార్ రత్నం తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు సహాయ ఎన్నికల అధికారిగా కొమ్ముల నారాయణమూర్తి వ్యవహరించారు. అధ్యక్ష పదవికి గన్నాబత్తుల వల్లభ రావు నిడుమోలు జ్ఞానానంద్ దాఖలు చేశారు. ఉపాధ్యక్షుని పదవికి కురెళ్ళ సోమశేఖర్ కోశాధికారి పదవికి తోట సూర్యలక్ష్మి లైబ్రరీ సెక్రెటరీగా నారిన శ్రీనివాసరావు మహిళా ప్రాతినిధ్యం కొరకు బొడ్డు ప్రగతి ఎర్రంశెట్టి మాధురి ఎగ్జిక్యూటివ్ కమిటీలో కుంచే దుర్గ భవాని గోరింకల వినోద్ కుమార్ మొదటి రోజు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు శుక్రవారం కూడా స్వీకరిస్తారని ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికలు అనివార్యమైతే ఈనెల 31న ఎన్నికలు నిర్వహిస్తామని కుమార్రత్నం తెలిపారు.

## ద్వారకాతిరుమల దేవస్థానంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు,

**-స్పెషల్ ఇన్విటీ గడ్డమణుగు**



**జీలుగుమిల్లి, జూలై 23 (ప్రభాతవార్త)** డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు ప్రారంభమైనట్లు ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ తెలిపారు. గురువారం ద్వారకాతిరుమల ధర్మకర్త మండలి సమావేశ మందిరంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎస్.వి. సుందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గడ్డమణుగు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 25న ఏకాదశి పర్వదినం సందర్భంగా వేలాదిమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి మంచినీరు, అన్నప్రసాదం తదితర సౌకర్యాలను దేవస్థానం ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ద్వారకాతిరుమల నుంచి ఐఎస్ జగన్నాథపురం వరకు ఫోర్‌లేన్ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, ఐఎస్ జగన్నాథపురంలోని ప్రసాద నివేదిత శాలలో ప్రసాద పంపిణీ నిర్వహించాలని, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వంటమనిషిని నియమించాలని, ఆలయంలో వినియోగానికి నాలుగు కార్డ్‌లెస్ మైకులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. స్వాతి నక్షత్రం, ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకునే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని గడ్డమణుగు రవికుమార్ పేర్కొన్నారు.

## మొగల్తూరు మండలంలో మొదలైన వరి నాట్లు



**మొగల్తూరు, జూలై 23 (ప్రభాతవార్త):** వర్షాలు అనుకూలంగా కురవడం, సాగునీరు అందుబాటులోకి రావడంతో మొగల్తూరు మండలంలో ఖరీఫ్ వరి నాట్లు జోరందుకున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు తెల్లవారుజాము నుంచే పొలాల్లో నాట్ల పనుల్లో నిమగ్నమై వ్యవసాయ సందడి నెలకొంది. ఈ సీజన్‌లో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున వరి సాగు చేపట్టేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. నాట్ల పనులకు కూలీలకు మంచి డిమాండ్ ఏర్పడగా, వ్యవసాయ యంత్రాల వినియోగం కూడా పెరిగింది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వర్షాలు ఇదే విధంగా కొనసాగి సాగునీటి సమస్య తలెత్తకుండా ఉంటే ఈ ఏడాది వరి దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## దస్తావేజు లేఖర్లు లేకపోతే ప్రజల ఆస్తులకు ముప్పు

**-దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షులు అలీ అబ్బాస్ -జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలి ం నూజివీడు లో చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద దస్తావేజులేఖరుల ధర్నా -4 వ రోజు విజయవంతంగా పెన్ డౌన్**



**నూజివీడు జులై 23 ప్రభాతవార్త :** రాష్ట్రంలో స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలు అన్నింటిని ప్రైవేటు పరం చేసి రిజిస్ట్రేషన్ సర్వీసు కేంద్రాల ఏర్పాటు దిశగా ఆలోచిస్తున్న కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్నిఉపసంహరించుకోవాలని నూజివీడు సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధిలోని దస్తావేజులేఖరులు స్టాంప్ వెండర్స్ డిటిపి ఆపరేటర్స్ సహాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పెన్డౌన్ కార్యక్రమంలో భాగంగా గురువారం నూజివీడు సబ్ రిజిస్టర్ కార్యాలయం దగ్గర ఆందోళన చేశారు. తదనంతరం ర్యాలీ గా బయలుదేరి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్దకు చేరుకుని అక్కడ ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మొహమ్మద్ అలి అబ్బాస్ ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం ఆలోచిస్తున్న రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని అన్నారు. కీలకమైన భూ రికార్డులన్నీ భద్రతకు నోచుకోక ప్రజల ఆస్తులు గాలిలో దీపంలా మారే అవకాశాలు ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తరతరాలుగా కొనసాగుతున్న దస్తావేజులు లేఖరుల వ్యవస్థకు జీవో నెంబర్ 396 ముప్పుగా వారు అభివర్ణించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం కూడా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిర్వహించాలని తలపెట్టడంపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు దాని ఫలితాన్ని ఆ ప్రభుత్వం అనుభవించిందని కూటమి ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును ఆమోదిస్తే ఆ ప్రభావాన్ని ఎన్నికల్లో చూడవలసి ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు మహమ్మద్ అలి అబ్బాస్, మోహన్ రాజు, పండ్రంగి రవి, త్రినాథ్ ,సందీప్, పుష్ప, వాకా సోమేశ్వరరావు, బేబే శ్వరరావు ,రాజేశ్వరి, ఉమా,మహేష్,ఉమ,అయ్యంకి రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**-తాడిచెర్లలో కోకో లైఫ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పలు వైద్య సేవలు**




**తాడేపల్లిగూడెం (జూలై 23) (ప్రభాతవార్త)** కోకో లైఫ్ సామాజిక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మోండలీజ్ సంస్థ ఆర్థిక సహకారంతో, ఆఫ్రో (యాక్షన్ ఫర్ ఫుడ్ ప్రొడక్షన్) సంస్థ ఆధ్వర్యంలో, గుడ్ సమారిటన్ క్యాన్సర్ ఆసుపత్రి (ఏలూరు) సహకారంతో గురువారం కామవరపుకోట మండలం తాడిచెర్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి తాడిచెర్లతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను పొందారు. జ్వరాలు, రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధులు, మోకాళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, మహిళల ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ స్క్రీనింగ్ తదితర పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆఫ్రో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పి.విజయ ప్రసాద్ మాట్లాడుతూ కోకో సాగు చేస్తున్న గ్రామాల్లో మోండలీజ్ సంస్థ సహకారంతో భవిష్యత్తులో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి, గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిచెర్ల గ్రామ మాజీ సర్పంచ్ పసుమర్తి పార్థసారథి, మోండలీజ్ ఏరియా ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్‌లు సాజిద్ ఉర్ రెహమాన్, ఎస్. మనోజ్ కుమార్ రెడ్డి, ఆఫ్రో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పి.విజయ ప్రసాద్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. జానీ, ఫీల్డ్ ట్రైనర్లు కె. శివ, డి.ఆకేష్, బి.జ్యోతి, గుడ్ సమారిటన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు డా. చంద్ర, ప్రజా సంబంధాల అధికారి వినీల్, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక సీహెచ్ఓ టి. యశోద, ఏఎన్ఎంలు రత్నకుమారి, జయశ్రీ, ఆశా కార్యకర్తలు జయమణి, లక్ష్మికుమారి తదితరులు పాల్గొన్నారు.

## కస్పా పెంటపాడులో సామూహిక మరుగుదొడ్లు కూల్చివేత

**-నిరసనకు దిగిన ఎస్సీ మహిళలకు మద్దతు తెలిపిన దళిత హక్కుల పోరాట సమితి**



**పెంటపాడు,జులై 23 (ప్రభాత వార్త)** పెంటపాడు మండలం కస్పా పెంటపాడులోని ఎస్సీ పేటలో ఉన్న సామూహిక మరుగుదొడ్లను కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు కూల్చివేయడాన్ని నిరసిస్తూ స్థానిక ఎస్సీ మహిళలు గురువారం ఆందోళన చేపట్టారు. ప్రజల వినియోగం కోసం నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను తొలగించడం వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చివేతకు బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, వెంటనే మరుగుదొడ్లను పునర్నిర్మించాలని అధికారులను కోరారు. ఈ ఆందోళనకు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు మద్దతు ప్రకటించారు. దళితులకు ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలను పరిరక్షించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. కూల్చివేసిన సామూహిక మరుగుదొడ్లను తక్షణమే పునర్నిర్మించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆలయం వద్ద దుర్గంధం, హాస్టల్‌కు పొగ ముప్పు

**-డంపింగ్ యార్డ్‌పై స్థానికుల భక్తులు ఆగ్రహం**



**జంగారెడ్డిగూడెం జూలై 23 ప్రభాత వార్త** జంగారెడ్డిగూడెం పట్టణంలోని బైనేరు నది తీరాన ఉన్న సుమారు 70 ఏళ్ల ప్రాచీనమైన ఉమా సహిత రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తొలగించాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేశారు. నిత్యం వేలాది మంది భక్తులు విచ్చేసే ఈ పుణ్యక్షేత్రం పక్కనే చెత్త కుప్పలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెలువడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున వచ్చే భక్తుల కోసం 500 నుండి 600 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటారని, అయితే డంపింగ్ యార్డ్ నుండి వచ్చే కంపు, వ్యర్థాలు, జంతు కళేబరాల దుర్గంధం వల్ల భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. అంతేకాకుండా, సమీపంలోనే ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్‌లోని చెత్తకు మంటలు పెట్టడం వల్ల వచ్చే దట్టమైన పొగ హాస్టల్ వరకు వ్యాపించి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అధికారులు ఈ డంపింగ్ యార్డ్‌ను మార్కెట్ యార్డ్ లేదా అటవీ ప్రాంతంలోకి తరలిస్తామని హామీ ఇచ్చి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డంపింగ్ యార్డ్‌ను వేరే ప్రాంతానికి తరలించి శాశ్వత పరిష్కారం చూపాలని , శివ భక్త బృందం నాయకులు కోరారు. తరలింపునకు సమయం పడితే రోడ్డుపైకి వ్యర్థాలు రాకుండా, పొగ వ్యాపించకుండా చుట్టూ తాత్కాలికంగా అడ్డుగోడలు అమర్చాలని విజ్ఞప్తి చేశారు.

## ఆర్ఓ ప్లాంట్ లో పరిశీలించిన ఎండిఓ -వార్తకు స్పందన



చాట్రాయి, జూలై 23 ప్రభాతవార్త చాట్రాయి మండలం చనుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేయని ఆర్ ఓ ప్లాంట్లను గురువారం ఆయన పరిశీలించారు. పనిచేయని ఆర్ఓ ప్లాంట్లను పట్టించుకునే నాథుడు ఎవరు అంటూ ప్రభాతవార్త ప్రచురించడంతో ఎండిఓ స్పందించారు. పాఠశాలలో ఎప్పటినుండి ఆర్ఓ ప్లాంట్ పనిచేయటం లేదో ప్రధానోపాధ్యాయులను ఇన్చార్జి ఎండిఓ సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు.గత కొంత కాలంగా ఆర్ వో ప్లాంట్ పనిచేయడం లేదని, ఆ ప్లాంట్ సప్లై చేసిన కంపెనీ ప్రతినిధులకు ఫోన్ చేసిన కంపెనీ మెకానిక్ ను పంపడంలేదంటూ కోరామని హెచ్ ఎం చెప్పారు.కాని ఇప్పటివరకు ప్లాంట్ మెకానిక్ రిపేర్ చేయడానికి రాలేదని హెచ్ ఎం అన్నారు.దీనిపై తక్షణమే స్పందించిన ఎండిఓ సత్యనారాయణ ప్లాంట్ సప్లై చేసిన కంపెనీ ప్రతినిధులకు ఫోన్ చేసి వెంటనే మెకానిక్ ని పంపి ప్లాంట్ రిపేర్ చేయించాలని ఆదేశించారు. కంపెనీ ప్రతినిధులు కూడా వెంటనే మెకానిక్ ని పంపి ప్లాంట్ రిపేర్ చేయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మొరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు మినరల్ వాటర్ అందించాలని మరమ్మతులు వస్తే తక్షణమే చేయించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఉపాధ్యాయులు కూడా చొరవ తీసుకోవాలని ఆయన అన్నారు.

## నాయుడు కుటుంబం సేవలు మరువలేనివి



టి నర్సాపురం జూలై 23 ప్రభాతవార్త టీ నర్సాపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాయుడు రామకృష్ణ గౌడ్ మాతృమూర్తి నాంచారమ్మ ఇటీవల మరణించిన సంగతి పాఠకులకు విధితమే. గురువారంజరిగిన సంతాప సభకు మాజీ ఎమ్మెల్యే గంట మురళి, మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీను తెలుగుదేశం పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ ,బొరగం శ్రీనివాసరావు, తదితరులు హాజరయ్యారు. నాయుడు రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఘంట మురళి మాట్లాడుతూ నాయుడు పుల్లయ్య సతీమణి నాంచారమ్మ మరణం తీరని లోటు అన్నారు. నాయుడు కుటుంబం బంధం చర్ల గ్రామానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ముఖ్యంగా నాయుడు పుల్లయ్య 40 ఏళ్లపాటు టిడిపి పార్టీ కి చేసిన సేవలు మరువలేనివి అన్నారు.అదే విధంగా గౌడ సంఘ నాయకుడిగా అనేక సేవలు చేశారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు అడప నాగరాజు,బొంతు సత్యనారాయణ,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు జయవరపు శ్రీరామమూర్తి మాజీ జెడ్పిటీసి సభ్యులు నల్లూరి వలపతిరావు, పోలవరం ఏఎంసి డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎబిఎస్ బిలో చేరిక : దండు శ్రీనివాసరాజు



భీమవరం టౌన్, జూలై 23 : ప్రభాతవార్త అల్ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి అను బంధంగా ఉన్న (నేతాజిసుభాష్ స్థాపించిన) విద్యార్ధి సంఘం అల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఎబిఎస్ బి) రాష్ట్ర ఉపాధ్య క్షుడు నల్లమిల్లి వంశీ ఆధ్వర్యంలో సోమవారం నలుగురు విద్యార్ధులు చేరినట్లు, వారికి నల్లమిల్లి వంశీ కండువాలు కప్పి విద్యార్ధి సంఘం లోకి ఆహ్వానించినట్లు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి దండు శ్రీనివాసరాజు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పోరాడేందుకు విద్యార్థులకు అండగా నిలబడతామని ఈసందర్భంగా వారన్నారు. ఎస్ సాయి కృష్ణ, టి ప్రసన్న, మహివిష్ణుశివ షేక్ ఫ్యార్ మున్నా, బి వివేక్ తదితరులు ఎబిఎస్ బి లో జాయిన్ అయి నట్లు దండు శ్రీనివాసరాజు వెల్లడించారు.

## పి పి పి విధానం వద్దు, 396 జిఓ రద్దు


**-కోరుతూ 4వ రోజు కొనసాగిన పెన్ డౌన్**



భీమవరం టౌన్, జూలై 23 : ప్రభాతవార్త భూముల రిజిస్ట్రేషన్లలో పి పి పి విధానం వద్దని, పాత పద్దతినే రిజిస్ట్రేషన్లు కొనసా గాలని జి ఓ 396 రద్దు చేయాలని కోరుతూ జూలై 7 నుండి 14 వ తేదీ వరకు దస్తావేజు లేఖర్లు రాష్ట్రస్థాయిలో ఆందోళనా కార్యక్రమం, మరియు రిలే నిరాహార దీక్షలు చేసిన విషయం విదితమే. కాగా కూటమి ప్రభుత్వం లేఖర్ల ఆందోళనను పరిగణనలోకి తీసుకోకపోవ డమే కాక పిపిపి విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ముందుకు పోతుండగా లేఖర్ల అసోసియేషన్ ఆందోళనను ఉధృతం చేస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనరల్ సెక్రటరీ తాళ్లూరి మధు తెలిపారు. 396 జిఓ వల్ల ప్రజలు ఆస్తులకు ఏమాత్రం రక్షణ ఉండదని అన్నారు. ప్రజల ఆస్తులను ప్రైవేటు వారు దక్కించుకునే రికార్డులు భద్ర పరచ గలరని, 396 జిఓ వల్ల సుమా రు 4 లక్షల మంది దస్తావేజు లేఖర్లు, అసి స్టెంట్ లు, స్టాంప్ వెండర్, డీటీపీ ఆపరేటర్ లు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడతా రని అన్నారు. తాము చేసిన ఆందోళనలను కూటమి ప్రభుత్వం పట్టించు కొనక పోవడంతో జూలై 20 నుండి ఆగష్టు 1 వరకు జరుప చేస్తున్న స్టేట్ వైడ్ పెన్ డౌన్ కార్యక్రమం నాలుగవ రోజు కొనసాగింది. ఉమ్మడి పశ్చి మగోదావరి జిల్లాలోని లేఖర్లు, అసి స్టెంట్లు, స్టాంప్ వెండర్లు డిటిపి ఆపరే టర్లు పెద్ద సంఖ్య లో విచ్చేసి పెన్డౌన్ కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు, తాము చేస్తున్న న్యాయ సమ్మతమైన ఉద్యమానికి క్రితం మాదిరి గానే మద్దతు ఇవ్వాలని పూర్తి సహాయ సహకారాలు అంది చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లా లేఖర్ల అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, మధు భీమవరం లేఖర్ల సెక్రటరీ కవురు పుల్లేశ్వర శంకర్, ట్రెజరర్ జి బాబురావు, గంజిరెడ్డి మధు, వీరగా ట్టపు అప్పారావు, రాపాక శ్యామల ప్రసాద్, పామర్తి మహేష్, మేకా నాగరాజు, కోయ శ్రీని వాస్, బొర్రా నాగరాజు, మేకా బ్రహ్మయ్య, పె సుభోతుల మురళీ నాయుడు, మేకల నరేష్ కేశా విజయకుమార్ పాలూరి శ్రీధర్ గిలకలశెట్టి దాట్ల హేమంత్ కుమార్, దాట్ల రామరాజు, ఆరేపల్లి ధనరాజు, దేవు మల్లికార్జున రావు, శివ, తాళ్లూరి సురేష్ కుమార్, దండు శ్రీనివా సరాజు, స్టాంప్ వెండర్ ప్రసాదరాజు, తిలక్, కడలి సూరి బాబు, పాస కళ్యాణు, పొనకళ్ల చిరంజీవి, భాను, బొడ్డు మోహన్, తదితరులు పాల్గొ న్నారు.

## చినుకు పడితే జారుడే..!

**-మొగల్తూరు--వెంప రహదారి దుస్థితిపై ప్రజల ఆవేదన**



మొగల్తూరు, జూలై 23 (ప్రభాతవార్త): మొగల్తూరు నుంచి వెంప గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన స్థితికి చేరుకోవడంతో వాహనదారులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్వల్పంగా చినుకులు పడినా రహదారిపై బురద పేరుకుపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై తరచూ ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.స్థానికుల కథనం ప్రకారం, రహదారి నిర్మాణ పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేయడంతో ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో రహదారి పూర్తిగా దెబ్బతిని, వర్షం పడినప్పుడల్లా బురదమయంగా మారుతోందని పేర్కొన్నారు.ఏళ్లు గడిచినా రహదారి నిర్మాణం పూర్తి కాకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారి రెండేళ్లు పూర్తయినా ఈ రహదారి నిర్మాణంపై ఎలాంటి పురోగతి కనిపించకపోవడం బాధాకరమని అంటున్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, అత్యవసర సేవల వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని, వర్షాకాలంలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున తక్షణ చర్యలు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఎలక్ట్రిక్ బస్ ల నిర్వహణ ప్రైవేటుకు వద్దు



భీమవరం టౌన్, జూలై 23 : ప్రభాతవార్త ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించ కుండా పూర్తిగా ఆర్టీసీయే నిర్వహించాలని, డ్రైవర్లు, కండక్టర్లుగా ఆర్టీసీ ఉద్యోగులనే నియమించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయ సీనియర్ అసి స్టెంట్ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఎఐటియుసి పశ్చిమగోదా వరి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడు తూ, ప్రజలకు సురక్షితమైన,నాణ్యమైన, అందుబాటు ధరలతో రవాణా సేవలు అందిస్తు న్న ప్రభుత్వ రంగ సంస్థ ఆర్టీసీయే నన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల శాశ్వత ఉద్యోగ అవకాశాలు తగ్గిపోవడమే కాకుండా, ఔట్‌సో ర్సింగ్ విధానాలు పెరిగి కార్మికుల హక్కులు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే ఆర్టీసీలో అనుభవజ్ఞులైన డ్రైవర్లు, కండక్టర్లు, సాంకేతిక సిబ్బంది ఉన్నందున ఎలక్ట్రిక్ బస్సు లను కూడా ఆర్టీసీయే సమర్థ వంతంగా నిర్వ హించగలదన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను బలోపేతం చేయాలని ప్రైవేటీ కరణ విధానా లను విడనాడి అన్ని సేవలను పూర్తిగా ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమం లో ఎఐటియుసి నాయకులు అల్లం నారాయ ణ, చెల్లబోయిన రంగారా వు, ఎం సీతారాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

**అత్తిలి జులై 23 (ప్రభాతవార్త)** అత్తిలి ఎస్ వి ఎస్ ఎస్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న క్యాంపస్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు దాసం గోవిందరావు,కార్యదర్శి మద్దాల వెంకటేశ్వరరావు తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఈ క్యాంపస్ డ్రైవ్ లో పాల్గొనవచ్చునని తెలిపారు. పలు కంపెనీల వారు ఈ క్యాంపస్ డ్రైవ్ లో పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ద్వారకా తిరుమల దేవస్థానం ధర్మకర్తల మండలి కీలక నిర్ణయాలు..

**-భక్తుల సౌకర్యాలకు పెద్దపీట-ప్రత్యేక దర్శన మార్గం, కొత్త సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పలు టెండర్లకు ఆమోదం**




ద్వారకా తిరుమల,జూలై 23 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో గురువారం దేవస్థానం చైర్మన్ ఎస్.వి. సుధాకర్ రావు అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భక్తుల సౌకర్యాల విస్తరణ, దేవస్థానం అభివృద్ధి, ఆలయ సేవల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సమావేశంలో గ్రామ ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక మార్గం ద్వారా స్వామివారి శీఘ్ర దర్శనం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే శ్రీ వేంకటేశ్వర సంస్కృతోన్నత పాఠశాల ప్రాంగణంలోని శ్రీ వినాయక ఆలయాన్ని మరో అనుకూల ప్రదేశానికి మార్చి నిర్మించేందుకు అంచనాలను ఆమోదించారు. భక్తుల కోరిక మేరకు స్వామివారి అంతరాలయంలో అష్టోత్తర శతనామార్చన సేవను దంపతులకు రూ.3,116 రుసుముతో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. అలాగే ఆలయంలో కోట తులసి పూజను తిరిగి ప్రారంభించేందుకు కూడా సమీక్షించారు. అదేవిధంగా ఆగమ పాఠశాల విద్యార్థులకు మూడు నెలల పాటు దేవస్థాన ఆలయాల్లో అప్రెంటిస్‌షిప్ అవకాశం కల్పించేందుకు ఆమోదం తెలిపారు. కొండపైకి వచ్చే వాహనాల టోల్ వసూళ్ల లైసెన్స్, దత్తత ఆలయాల్లో కొబ్బరి చెక్కల సేకరణ హక్కులు, ప్రసాదాల తయారీకి అవసరమైన 21 రకాల ముడి సరుకుల సరఫరా టెండర్లకు వచ్చిన అత్యల్ప ధరలను ధర్మకర్తల మండలి ఆమోదించింది. రాబోయే ఆశ్వయుజ మాస తిరుకళ్యాణ మహోత్సవాల సందర్భంగా తాత్కాలిక ఫైబర్ మండపం, పందిళ్లు, రంగుల అలంకరణ పనులకు ఆమోదం లభించింది. అలాగే గరుడాళ్వార్, ఆంజనేయస్వామి విగ్రహాలకు రంగులు వేయడం, భక్తుల కోసం బస్ షెల్టర్ల నిర్మాణానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా దేవస్థానం, దత్తత ఆలయాలు, వివిధ ట్రస్టుల జూన్-2026 నెల ఆదాయ-వ్యయాలను పరిశీలించి ఆమోదించడంతో పాటు, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, భద్రతా చర్యలు మరియు కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ధర్మకర్తల మండలి సమీక్ష నిర్వహించింది.

## ఓ ఎన్ జి సి ఆర్థిక సౌజన్యంతో మొక్కల పంపిణీ



నరసాపురం జూలై 23 ప్రభాతవార్త స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్ బి .చర్ల కు (కేజీ బేసిన్) వారు సుమారు లక్షా యాభై వేల రూపాయల విలువైన వివిధ రకాల ఫల వృక్ష జాతులకు చెందిన 150 మొక్కలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఇందులో చాలా విలువైన కొబ్బరి, మామిడి, సపోటా, జామ మరియు వివిధ గార్డెనింగ్ మొక్కలు ఉన్నాయి. నరసాపురం మండలంలోనే విశాలమైన స్థలం కలిగి ఉన్న ఈ పాఠశాల నందు కేజీ బేసిన్ హెడ్ ఆఫీస్ మేనేజర్ రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో ఈ మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె వి ఎన్ మూర్తి మరియు పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొయ్యలగడ్డ శ్రీనివాసరావు మరియు స్థానిక గ్రామ సర్పంచ్ అయిన గుబ్బల యమునా భానుమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించడంలో ఓఎన్జిసి వారి కృషిని అభినందించారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ కోసం దళిత సేన నిరంతరం పని చేస్తోంది

**-దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్**



తాడేపల్లిగూడెం ,జులై 23 (ప్రభాత వార్త)తాడేపల్లిగూడెం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో గురువారం దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ ఆశయాల సాధనే దళిత సేన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు బడుగు, బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ కోసం దళిత సేన నిరంతరం పని చేస్తుందని చెప్పారు. రాబోయే ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని వివరించారు. అనంతరం ఈ నెల 29న నిర్వహించనున్న దళిత సేన 6వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ సాధించాల్సిన 10 అంశాల అజెండాకు సంబంధించిన కరపత్రాలను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మిరియాల వెంకట్రావు, కంకిపాటి సుబ్బారావు, మిరియాల అన్నపూర్ణ, దూలపల్లి నాగమణి, చింతపర్తి వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ భారీ ఆందోళన : డిసిసి అధ్యక్షుడు అంకెం



భీమవరం టౌన్, జూలై 23 : ప్రభాతవార్త నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూకేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేస్తు న్న సందర్భంలో పార్టీ అగ్రనేత, మరి యు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్ట్ గూర్చి 25వ తేదీ భారీ ఆందోళనకు పిలుపు నిచ్చి నట్లు పశ్చిమగోదావరి జిల్లా డిసిసి అధ్య క్షుడు అంకెం సీతారాం తెలి పారు. శనివా రం ఉదయం పదిగంట లకు భీమవరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ వద్ద నిర్వహించ నున్న ఆందోళన కార్యక్ర మానికి పార్టీ నాయ కులు, నియోజ కవర్గ కో-ఆర్డినేటర్లు, మండ ల నాయకులు, విద్యా ర్థి యువజన సంఘా లు, మహిళా నాయకు లు, కార్యకర్తలు, అభిమానులు, పెద్దసంఖ్య లో పాల్గొని విజయవంతం చే యాలని సీతారాం విజ్ఞప్తి చేశారు. విద్యా ర్థుల భవిష్యత్తు కోసం, రాహుల్ గాంధీకి మద్దతుగా ప్రతీ ఒక్కరూ ఉత్సా హంగా తరలివచ్చి నిరసన గళాన్ని వినిపిద్దామంటూ అంకెం సీతారాం పిలుపు నిచ్చారు.

## వృద్ధులకు దుప్పట్లు



భీమవరం జులై 23 ప్రభాతవార్త శుభకార్యాలలో పేదలకు వృద్ధులకు చేయూతనివ్వడం మన భారతీయ సంప్రదాయంలో అత్యంత పుణ్యప్రదమైనదని టిడిపి రాష్ట్ర మాజీ కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. పట్టణానికి చెందిన పోసాన్న నాగబాబు కుమార్తె సునన్య పుట్టినరోజు సందర్భంగా టీడీపీ నాయకులు అంగర వెంకట్ ఆధ్వర్యంలో వీరమ్మ పార్క్ ఎదురుగా ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలోని 50 మంది వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, భోజనాలు అందించారు. టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, మాజీ కౌన్సిలర్ మైలబత్తుల ఐజాక్ బాబు మాట్లాడుతూ వేడుకలకు అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని కేటాయించి, వృద్ధులకు అనాథలకు దుస్తులు, పండ్లు, బియ్యం వంటి నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడం భగవత్ సేవతో సమానమని అన్నారు. కార్యక్రమంలో అంగర వెంకట్, చెల్లబోయిన సుబ్బారావు, డివివి ప్రసాద్, కొండ్రు శ్రీనివాస్, యలమంచిలి శ్రీనివాస్, చెరుకు తిరుపతిరావు, గంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 25న భీమవరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజలు



భీమవరం జులై 23 ప్రభాతవార్త తొలి ఏకాదశి సందర్భంగా భీమవరంలోని పలు దేవాలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రత పూజలను నిర్వహిస్తున్నారు. శ్రీరాంపురంలోని శ్రీరామ లింగేశ్వర స్వామి వారి దేవస్థానం (సుబ్బారాయుడు గుడి) లో ఈనెల 25న ఉదయం 8 గంటల నుంచి శ్రీరామలింగేశ్వర బ్రాహ్మణా సేవా సంఘం అద్వర్యంలో సామూహికంగా శ్రీరామ సత్యనారాయణ స్వామివారి వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుండు వెంకట రమణ, తాడేపల్లి రంగ నరసింహ మూర్తి తెలిపారు. పంచపాత్ర, ఉద్ధరణి, పళ్లెం, కలశం తదితర పూజ సామాగ్రిని భక్తులు తెచ్చుకోవాలని, మరిన్ని వివరాలకు దేవస్థానం వద్ద సంప్రదించాలన్నారు. భక్తులందరూ ఈ శ్రీరామ సత్యనారాయణ స్వామివారి వ్రత పూజ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నూకల రవి వీర వెంకట సత్యనారాయణ, ఉప్పులూరి ప్రకాశరావు, వేము కృష్ణమోహన్, చెరుకువాడ రంగసాయి, మొవ్వ శంకరం, మానేపల్లి సీత మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.. అదే విధంగా భీమవరం ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న శ్రీసీతారామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం 8 గంటల నుంచి సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రత పూజలను నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వేలూరి శ్రీధర్ శర్మ, ఆలయ అర్చకులు మొవ్వ భూపేంద్ర శివ తెలిపారు. గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రత పూజల పోస్టర్ ను ఆవిష్కరించారు. పసుపు, కుంకుమ, అరటిపళ్ళు తదితర పూజ సామాగ్రిని భక్తులు తెచ్చుకోవాలని, మరిన్ని వివరాలకు దేవస్థానం వద్ద సంప్రదించాలన్నారు.

## భారతీయులలో జాతీయతా భావాన్ని రగిలించిన మహనీయుడు బాలగంగాధర తిలక్

**భీమవరం జులై 23 ప్రభాతవార్త** స్వరాజ్యం నా జన్మ హక్కు దానిని నేను సాధించి తీరుతానని సింహంలా గర్జించి దేశ ప్రజలందరి మదిలో స్వరాజ్యం ఆకాంక్షను రగిలించిన దేశభక్తుడు బాల గంగాధర్ తిలక్ అని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అద్వర్యంలో భీమవరం వెంకట్రామ థియేటర్ ప్రాంగణంలో గురువారం భారతజాతీయోద్యమ పిత బాలగంగాధర తిలక్, భారతీయ ఉద్యమకారుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళిలర్పించారు. రచయితలు కలిగొట్ల గోపాలశర్మ, ఎస్ కె చాన్ భాషా, డిఆర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతీయులలో జాతీయతా భావాన్ని, స్వేచ్ఛా ఆకాంక్షను, విప్లవ జ్వాలలను రగిలించిన లోకమాన్యుడు బాలగంగాధర్ తిలక్ అని, జాతీయోద్యమాన్ని తిలక్ కొత్తదారుల్లో నడిపించారని, దేశవ్యాప్తంగా సామాన్య ప్రజల్ని జాతీయ ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో ఆయన చెప్పుకోదగిన పాత్ర పోషించారని అన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటాన్ని కొత్త పుంతలు తొక్కించిన స్ఫూర్తి ప్రదాత బాలగంగాధర్ తిలక్ అని, భారత జాతి మద్దు బిడ్డ, బ్రిటిష్ వారిని వణికించిన వీరుడు చంద్రశేఖర్ అజాద్ అని అన్నారు. ఇటువంటి మహనీయులను స్మరించుకుంటూ వారి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎం సీతారాం ప్రసాద్, డివివి ప్రసాద్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కొండ్రు శ్రీనివాస్, ఎస్ సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**-మండల సర్వసభ సమావేశంలో వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు**



మొగల్తూరు, జూలై 23 (ప్రభాతవార్త): మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సర్వసభ సమావేశానికి వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రగతిపై వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, గ్రామీణ రహదారుల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, వ్యవసాయం, విద్య, వైద్య సేవలు, ఉపాధి హామీ, తాగునీటి వసతులు, సాగునీటి సమస్యలు తదితర ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. మండల ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు సూచించారు.మండల అభివృద్ధికి అవసరమైన పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ సమావేశంలో జడ్పీటీసీ తిరుమాణి బాపూజీ, ఎంపీడీవో సి.హెచ్. త్రిశూలపాణి, వెలుగు ఏపీఎం జ్యోతిరాణి, పంచాయతీరాజ్ ఏఈ అరటకట్ల వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్వైజర్ డి. విజయకుమారి, మండల ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ జవ్వాది వెంకటేశ్వరరావు, ఎంఈఓ సామ్యూల్ జాన్, జీఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ, ఆర్ అండ్ బి, ఆరోగ్య శాఖ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు దొంగ వీర వెంకట సత్యనారాయణ, అందే ముక్తేశ్వరరావు, అండ్ రాజు సరాబంధు రాజు, తిరుమాణి స్వామి, ఎన్నాబత్తుల ఉషారాణి, ఆకన దుర్గా దొరబాబు, మల్లాడి శాంతిరత్నం, మండల సచివాలయ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ట్యాంకు వాచర్ డొల్లా శాంతరాజు మృతి



మొగల్తూరు, జూలై 23 (ప్రభాతవార్త): మొగల్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో ట్యాంకు వాచర్గా విధులు నిర్వహిస్తున్న డొల్లా శాంతరాజు (46) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. గత 15 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.శాంతరాజు మృతితో మొగల్తూరు మండలం నక్కవారిపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది, సహోద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురై ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.శాంతరాజు కుటుంబ సభ్యులను పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్పునిచ్చారు.అనంతరం జరిగిన అంత్యక్రియలకు గ్రామస్థులు, బంధుమిత్రులు, పంచాయతీ సిబ్బంది, సహోద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై డొల్లా శాంతరాజుకు కన్నీటి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

## చెవిలో పువ్వులతో వినూత్న నిరసన చేపట్టిన దస్తావేజు లేఖర్లు

**-జీవో 396ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్**



**మొగల్తూరు, జూలై 23 (ప్రభాతవార్త):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్లు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. జీవో 396 రద్దు చేయాలంటూ లేఖర్లు చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు కొల్లాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్రీలబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ, జీవో 396 అమలుతో దస్తావేజు లేఖర్ల ఉపాధి తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఈ జీవోను ప్రభుత్వం పునఃసమీక్షించి వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో సంఘ సభ్యులు బొక్క గంగాధరరావు, పి. జయసుధ, చిట్టిబొమ్మ శైలజ, తిరుమణి ముత్యాలరాజు, కడలి త్రిమూర్తులు, కృష్ణమోహన్, బొక్క ఏడుకొండలు, రవి, గుండు నాగేంద్ర, ముక్కు రాజబాబు, కడలి చంద్రశేఖర్, తిరుమణి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగో రోజుకు చేరిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన

**-రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**




**తాడేపల్లిగూడెం : జులై 22 (ప్రభాతవార్త)** రాష్ట్ర ప్రభుత్వ విశ్వ విద్యాలయాల్లో ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తక్షణమే క్రమబద్ధీకరించాలని కోరుతూ స్థానిక ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్లో నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. ఆందోళనలో భాగంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించి నివాళులర్పించారు. సామాజిక న్యాయం, సమానత్వం, సమాన అవకాశాల కోసం డాక్టర్ అంబేద్కర్ చేసిన కృషిని స్మరించుకుంటూ, రాజ్యాంగం కల్పించిన న్యాయస్ఫూర్తికి అనుగుణంగా తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం రాబోయే అధ్యాపకుల నియామకాలకు ముందు అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని, వారి సేవా కాలాన్ని గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేసి, కాంట్రాక్ట్ అధ్యాపకులకు కూడా యూజీసీ వేతన స్కేల్కు అనుగుణమైన వేతనాలు అందించాలని కోరారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలుగన్న సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ స్ఫూర్తిని ప్రభుత్వం ఆచరణలో చూపించాలని, విశ్వ విద్యాలయాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల పట్ల న్యాయంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ హీరా బట్టు నాయకత్వం వహించగా, సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.ప్రశాంతి, సభ్యులు లిఖిత, శ్రీరాముడు, బాబులు, డాక్టర్ ఎఫ్రైమ్ బాబు, డాక్టర్ పుత్రయ్య, డాక్టర్ రమణ, డాక్టర్ సురేష్, డాక్టర్. ప్రదీప్, డాక్టర్ సత్యనారాయణతో పాటు క్యాంపస్కు చెందిన పలువురి కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వడ్డీ రఘురాం



తాడేపల్లిగూడెం జులై 22 (ప్రభాతవార్త)తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, కార్యకర్తలతో కొనసాగుతున్న సమన్వయం, ప్రజా సమస్యలు, రానున్న స్థానిక సంస్థలకు సంబంధించిన రాజకీయ పరిణామాలు, పార్టీ సంస్థాగత బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణులు ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం కొనసాగించాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి అవసరమైన కార్యాచరణపై కూడా మార్గనిర్దేశం చేశారు.ఈ భేటీ అనంతరం వడ్డీ రఘురామ్ నాయుడు పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ ఆశయాల సాధన కోసం కార్యకర్తలతో కలిసి మరింత కృషి చేస్తామని వివరించారు.